www.andhrajyothy.com

వెల (Price) : Rs. 8.00

విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 10-11-2024 | పేజీలు: 14 +28 పేజీల ఆదివారం అనుబంధం | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 205

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: నవమి రా. 9.02 తదుపరి దశమి; నక్షత్రం: ధనిష్ఠ ఉ. 11.00 తదుపరి శతభిషం; వర్జ్యం: రా. 5.48-7.18; దుర్ముహూర్తం: సా. 4.06-4.51; అమృతఘడియలు: రా. 2.52-4.22; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.21; సూర్యాస్తమయం: 5.36

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇన్సులిన్ ఇంజక్షన్లకు చెక్



సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో మధుమేహ బాధితులకు సాంత్వన

రీజనరేటివ్ థెరపీతో షుగర్‌ను కంట్రోల్ చేయొచ్చు

టైప్-1 బాధితులకు ఇన్సులిన్ అవసరం ఉండదు

పాశ్చాత్య దేశాల్లో అందుబాటులో అధునాతన చికిత్స

షుగర్ పేషెంట్లకు ఫుట్ రీకన్‌స్ట్రక్షన్ ఓ వరం

భారత్‌లోనూ అందుబాటులోకి తెస్తున్నాం

చైల్డ్ డయాబెటిస్ కేసులు పెరగడం ఆందోళనకరం

'ఆంధ్రజ్యోతి'తో ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ అలీ అల్దీబియాత్, డాక్టర్ వేణు కవర్తపు, డాక్టర్ కేవీఎస్ హరికుమార్

విశాఖలో ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఇండియా వార్షిక సదస్సుకు హాజరు

విశాఖపట్నం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): "మధుమేహంతో బాధపడే వ్యక్తులు జీవితాంతం ఇన్సులిన్ తీసుకుంటూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. రీజనరేటివ్ థెరపీ వారికి ఓ చక్కని పరిష్కారం. టైప్-1 డయాబెటిస్‌తో బాధపడేవారు ఆ థెరపీతో సాధారణ జీవితాన్ని గడపవచ్చు" అని యూఏఈకి చెందిన ప్రముఖ వైద్యుడు, రీజనరేటివ్ థెరపీ స్పెషలిస్ట్ డాక్టర్ అలీ అల్దీబియాత్ చెప్పారు. విశాఖలో జరుగుతున్న ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఇండియా 53వ వార్షిక సదస్సుకు ఆయన హాజరయ్యారు. శనివారం మూడో రోజు సదస్సులో ఐలెట్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అనే అంశంపై

మిగతా 12వ పేజీలో...

'దొర'కునా ఇటువంటి సేవ!

తెలుగుకు వెలుగులు అద్దిన ఆంగ్ల దొర బ్రౌన్

వ్యయ ప్రయాసలకోర్చి తెలుగు, సంస్కృత గ్రంథాల సేకరణ

ఆయనే లేకుంటే అపురూప పుస్తకాలు అంధకారంలోనే

మనుచరిత్ర, రంగనాథ రామాయణం, పండితారాధ్య చరిత్ర, దశావతార చరిత్ర తొలిసారి అందుబాటులోకి..


నేడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి



తెలుగు గడ్డకు తెల్ల దొరలు వచ్చారు.. తిరిగి వెళ్లిపోయారు! కానీ ఆ దొర మాత్రం తెలుగుకు వెలుగు తెచ్చారు. ఆయనే లేకుంటే మన ప్రాచీన సారస్వతంలో చాలాభాగం ఇప్పటికీ అంధకారంలోనే పడిఉండేది. వేలకు వేల వేమన పద్యాలు అనేకం వెలుగు చూసేవి కావు. ఆయన చేసింది తెలుగు సాహిత్యారాధన! దీనికోసం జీవితాన్నే అంకితం చేశారు. ఆయనే.. సీపీ బ్రౌన్! నేడు ఆయన జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

12

ఉన్మాదులను వదిలేయాలా?



..ఏ విషయంలోనైనా ఆచితూచి వ్యవహరించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజం. అయితే చంద్రబాబు అందరూ అనుకున్నంత మెతక కాదు. అలా కనిపిస్తారంతే! సమయం కోసం వేచిచూస్తారు. ఒక వ్యూహం ప్రకారం అడుగులు వేస్తారు. దీంతో ఆయనది మెతక వైఖరి అని అందరూ భావిస్తారు. అన్ని సమయాలలో ఆయన మెతక వైఖరితో ఉండరు.

..ఒకవైపు పవన్ కల్యాణ్ తన ఆవేదనను వ్యక్తం చేయడం, మరోవైపు సోషల్ మీడియా ఉన్మాదుల దాడి తీవ్రమవడంతో అదను కోసం వేచివున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మేల్కొన్నారు. తానేమిటో రుజువు చేసుకోవాల్సిన తరుణం ఆసన్నమైందని భావించారు. పోలీసు ఉన్నతాధికారులను పిలిపించుకొని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీకి చెందిన సోషల్ మీడియా ఉన్మాదులపై వేట మొదలైంది.

..ఇప్పుడు పోలీసులు అన్వేషిస్తున్న వర్రా రవీంద్రారెడ్డి జగన్ భార్య భారతీ రెడ్డికి అనధికార పీఏ అని అందరికీ తెలుసు. అతడు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ ఇళ్లలోని ఆడవాళ్లను జుగుప్సాకరంగా దూషించినా సాటి మహిళగా భారతి స్పందించకపోవడంలోని మర్మం అంతుపట్టదు. చివరకు తన ఆడపడుచు, రాజశేఖర రెడ్డి బిడ్డ షర్మిలను అతగాడు దూషించినా వారించే ప్రయత్నం చేయకపోవడం ఏమిటి?

..2014 ఎన్నికల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియాను ఉపయోగించుకొని రాజకీయంగా లబ్ధి పొందారు. ఆ తర్వాత అన్ని రాజకీయ పార్టీలు సోషల్ మీడియాను ఆశ్రయించాయి. తమ పార్టీల కార్యకలాపాల ప్రచారం కోసం, సమాచార వ్యాప్తికి ఉపయోగించుకున్నాయి. కాలక్రమంలో ప్రత్యర్థి పార్టీలపై బురద చల్లడానికే ఉపయోగించడం మొదలైంది. జగన్మోహన్ రెడ్డి వంటి వారు రంగప్రవేశం చేశాక ఇళ్లలోని ఆడవాళ్లను బజారుకు ఈడ్చడం మొదలైంది.

..నిత్యం అసత్యాలు, అర్ధసత్యాలతో నిండి ఉండే తన రోత మీడియా బాటలోనే 'ఆంధ్రజ్యోతి' కూడా నడుస్తోందని అనుకోవడం జగన్ రెడ్డి వెర్రితనం. నిజంగానే మేము పొరపాటు చేస్తే క్షమాపణ చెప్పే సంస్కారం మాకు ఉంది. అటువంటి సంస్కృతి ఉంటే జగన్ రెడ్డి దంపతులు ప్రతి రోజూ రోత మీడియాలో వండి వారుస్తున్న అసత్యాలు, అర్ధసత్యాలకు క్షమాపణలు చెబుతూనే ఉండాలి.

కొత్త పలుకు ఆర్కే విశ్లేషణ 4లో..

తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు





శ్రీశైలం జలాశయంలో ల్యాండ్ అవుతున్న సీ ప్లేన్, (ఇన్‌సెట్) కిందకు దిగుతున్న సీఎం చంద్రబాబు

అనుచిత పోస్టులను తీవ్రంగా పరిగణిస్తాం

ఆడబిడ్డలను కించపరిస్తే కఠిన చర్యలు: చంద్రబాబు

వైసీపీకి చెందిన మహిళలపై పోస్టులు పెట్టినా ఊరుకోం

రౌడీల రాజకీయ ముసుగులు తొలగిస్తాం.. ఎవరైనా చట్టానికి లోబడే ఉండాలి

పోలీసులు లాలూచీ పడినా, తప్పు చేసినా అదే వారి ఉద్యోగానికి ఆఖరి రోజు

శాంతిభద్రతలు బాగుంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయి

వాటికి విఘాతం కలిగిస్తే ఉపేక్షించం.. శ్రీశైలంలో ముఖ్యమంత్రి స్పష్టీకరణ

ఏ పార్టీ వారైనా సరే ఆడబిడ్డలపై సోషల్ మీడియాలో అనుచితంగా పోస్టులు పెట్టినా, వైసీపీకి చెందిన వారి ఆడబిడ్డలపై పోస్టులు పెట్టినా మా ప్రభుత్వం ఊరుకోదు. తప్పును తప్పుగానే చూస్తాం. తప్పు చేసిన వారిని శిక్షించి తీరుతాం. ఎవరైనా తమాషాలు చేద్దామని చూస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదు.

- సీఎం చంద్రబాబు

నంద్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఓవైపు తాము అహర్నిశలూ కృషి చేస్తుంటే.. కొంతమంది సోషల్ మీడియాలో ఇష్టానుసారం చెలరేగిపోతున్నారని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. అనుచితంగా పెట్టే పోస్టులను తీవ్రంగా పరిగణిస్తామన్నారు. ఆడబిడ్డల జోలికి వచ్చి వారి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం శ్రీశైలం పర్యటనకు

మిగతా 2వ పేజీలో...

సోషల్ సైకోల్లో వణుకు!

నోటీసులు, కేసులు, కౌన్సెలింగ్‌తో బెంబేలు

పోలీసుల ముమ్మర వేట

తీవ్రతను బట్టి బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు

13

పర్యాటకాంధ్ర!

రాష్ట్రంలో ఎన్నో దర్శనీయ ప్రదేశాలు

వాటన్నిటినీ కలిపితే ప్రపంచాన్నే ఆకర్షించవచ్చు

తిరుమలలా శ్రీశైలం అభివృద్ధి.. పర్యాటక కేంద్రంగా 'గండికోట'

టూరిజంతోనే అత్యధిక వృద్ధి.. వైట్ కాలర్ జాబ్స్ వస్తాయి

విజయవాడలో సీ ప్లేన్ డెమో లాంచ్‌లో చంద్రబాబు వెల్లడి

అక్కడి నుంచి సీ ప్లేన్‌లోనే శ్రీశైలానికి.. తిరిగి విజయవాడకు

'ట్రంప్' తొలి దెబ్బ.. భారతీయులపైనే!

పౌరసత్వ మంజూరుపై కఠిన ఆంక్షలు

గద్దెనెక్కిన తొలిరోజే ఉత్తర్వులిస్తానంటూ ఎన్నికల ప్రచారంలో ప్రకటన

లక్షల మంది భారతీయులు, వారి సంతానంపై తీవ్ర ప్రభావం

కోర్టుల్లో సవాల్ చేసే అవకాశం



వాషింగ్టన్, నవంబరు 9: అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్.. గద్దెనెక్కిన తొలిరోజే భారతీయులకు షాక్ ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది. వలసలను నిరోధిస్తూ.. సహజ పౌరసత్వాల మంజూరును నియంత్రిస్తామని, అధికారం చేపట్టిన వెంటనే ఇచ్చే కార్యనిర్వాహక ఉత్తర్వు ఇదేనని ట్రంప్, కాబోయే

మిగతా 2వ పేజీలో...

భారత విద్యార్థులకు కెనడా షాక్

ఫాస్ట్ ట్రాక్ స్టూడెంట్ వీసా ప్రక్రియ రద్దు



2

నో మ్యారేజ్.. నో సెక్స్!

అమెరికాలో పురుషులపై మహిళల గుస్సా

కమలను కాదని ట్రంప్‌ను గెలిపించినందుకే

పదవుల పండగ

భారీగా నామినేటెడ్ పోస్టులు

రెండో విడతలో మొత్తం 59

కులాలు, అభివృద్ధి కార్పొరేషన్లు భర్తీ

జనసేనకు 10, బీజేపీకి 3

నైతిక విలువల సలహాదారుగా చాగంటి

పట్టాభి, తేజస్విని, మంజులా రెడ్డికి చాన్స్

సుజయ్‌కృష్ణ, షరీఫ్, కిడారి శ్రావణ్‌కూ

కావలి గ్రీష్మ, ఉండవల్లి శ్రీదేవికి పదవులు

టీడీపీ కేడర్‌లో హర్షాతిరేకాలు

పార్టీకి అండగా ఉన్నవారికి అందలం

త్యాగాలు చేసినవారికి ప్రతిఫలం



ఎంఏ షరీఫ్
మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు



కొత్తపల్లి సుబ్బారాయుడు
ఏపీ కాపు సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్



చాగంటి కోటేశ్వరరావు
విద్యార్థుల్లో నైతిక విలువల ప్రభుత్వ సలహాదారు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

టీడీపీకి వెన్నుదన్నుగా ఉంటూ కష్టపడి పనిచేసిన వారిని, ఇన్‌చార్జిలుగా ఉంటూ సీట్లు త్యాగం చేసిన వారిని నామినేటెడ్ పదవులు వరించాయి. అలాగే మిత్ర పక్షాలు జనసేన, బీజేపీకి సముచిత ప్రాధాన్యం దక్కింది. శనివారం కూటమి ప్రభుత్వం రెండో విడతలో మొత్తం 59 సామాజిక వర్గాల సంక్షేమ కార్పొరేషన్లు, అభివృద్ధి సంస్థలకు చైర్మన్లను నియమించింది. టీడీపీ మిత్రపక్షాలు జనసేనకు 10, బీజేపీకి 3 నామినేటెడ్ పదవులు దక్కాయి. రాజకీయాలకు అతీతంగా ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించే సలహాదారు పదవిలో కేబినెట్ ర్యాంక్‌తో నియమించారు. గత టీడీపీ

మిగతా 13వ పేజీలో...

అవినీతి లేకుండా పనిచేయండి

ఎన్డీయే భాగస్వాముల్లా మాట్లాడాలి.. ప్రొటోకాల్ మరవద్దు

వ్యక్తిగతంగా కాదు.. పాలసీలపైనే వ్యాఖ్యానించాలి

నైపుణ్య, కుల గణనలు సంపూర్ణంగా జరగాలి

నామినేటెడ్ పదవులు పొందిన జనసేన నేతలతో పవన్

2



రష్యాలో 'శృంగార మంత్రిత్వ శాఖ'!

ఉక్రెయిన్‌తో యుద్ధం.. సైనికుల మరణాలతో తగ్గుతున్న జనాభా

జనాన్ని పెంచేందుకు మినిస్ట్రీ ఆఫ్ సెక్స్

రాత్రి 10 నుంచి 2 వరకు నెట్ బంద్

పని ప్రదేశాల్లో సంతానోత్పత్తి బ్రేక్‌లు

2

జనవరి 1 నుంచి స్విట్జర్లాండ్‌లో

బురఖాపై నిషేధం

బహిరంగ ప్రదేశాల్లో అమలు

ఉల్లంఘిస్తే వెయ్యి స్విస్ ఫ్రాంక్‌ల ఫైన్

ముస్లిం సంస్థలు, హక్కుల కార్యకర్తల వ్యతిరేకత

2

అసెంబ్లీ జాయింట్ సెక్రెటరీ

విజయరాజు సస్పెన్షన్

శాసనసభ సెక్రెటరీ జనరల్ పేరిట తప్పుడు రిపోర్టు ఫలితం

14

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం

14



శనివారం రాజమహేంద్రవరంలో పోలవరం ప్రాజెక్టుపై చర్చిస్తున్న నిపుణులు, అధికారులు

ఏడాదిలోనే డయాఫ్రం వాల్

సమాంతరంగా ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మాణం

కాంట్రాక్టు సంస్థలకు కేంద్ర జలసంఘం ఆదేశం

నిర్మాణాలపై ప్రతి 15 రోజులకోసారి సమీక్ష

వర్చువల్‌గా, ప్రత్యక్షంగానూ పరిశీలిస్తాం

సీఎస్ఆర్ఎంఎస్ నాణ్యతా పరీక్షలతో పాటు రాష్ట్రస్థాయిలోనూ క్వాలిటీ కంట్రోల్ లేబొరేటరీ

నెలాఖరుకల్లా వాల్, ఈసీఆర్ఎఫ్ డిజైన్లు ఇవ్వాలి

పరిశీలించి ఫిబ్రవరిలో ఆమోదిస్తాం: జలసంఘం

ఒకరోజు ముందే ముగిసిన వర్క్‌షాపు

అమరావతి/రాజమహేంద్రవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో కీలక నిర్మాణాలకు అంతర్జాతీయ నిపుణుల బృందం, కేంద్ర జల సంఘం గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. డయాఫ్రం వాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యాం పనులు చేపట్టడం.. పూర్తి చేయడంపై ఉన్న సందిగ్ధాలన్నింటినీ తొలగించాయి. 2025 జనవరిలో డయాఫ్రం వాల్ పనులు ప్రారంభించి.. ఆ ఏడాది నవంబరుకే పూర్తి చేయాలని జర్మన్ కాంట్రాక్టు సంస్థ బావర్‌కు జల సంఘం ఆదేశాలిచ్చింది. వాల్‌కు సమాంతరంగా ఈసీఆర్ఎఫ్ డ్యాంను నిర్మిస్తే ఏడాది సమయం కలిసి వస్తుందన్న రాష్ట్ర జల వనరుల శాఖ అభిప్రాయంతో, అధ్యయన నివేదికలతో అంతర్జాతీయ నిపుణులు, జల సంఘం

మిగతా 12వ పేజీలో...

రష్యాలో శృంగార శాఖ

» జనాభాను పెంచేందుకే

న్యూఢిల్లీ, నవంబరు 9: దేశంలో జనాభా తగ్గుతుండటం, వృద్ధుల సంఖ్య భారీగా పెరుగుతుండటంతో పెళ్లిళ్లు చేసుకోండర్రా.. పిల్లలను కనండర్రా అని యువతకు ఉద్బోధిస్తోంది చైనా! జనాభా తగ్గుదల సమస్యను ఎదుర్కొంటున్న రష్యానైతే ఓ అడుగు ముందుకేసి ప్రత్యేకంగా శృంగార మంత్రిత్వ శాఖ (మినిస్ట్రీ ఆఫ్ సెక్స్)ను ఏర్పాటు చేయాలని సీరియస్‌గా ఆలోచిస్తోంది. ఉక్రెయిన్‌తో యుద్ధం ఫలితంగా జనాభా భారీగా పడిపోవడంతో జనసంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధ్యక్షుడు పుతిన్ ప్రత్యేక ఆదేశాలిచ్చిన మీదటే ఆయన సలహాదారులు ప్రత్యేకంగా శృంగార మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నారు. మరి.. ఈ శాఖలో భాగంగా ఏంచేస్తారు? అంటే.. పెళ్లైన జంటలు ఏకాంతంగా గడిపేలా ప్రోత్సహిస్తారు. ఇందుకు రాత్రి 10 నుంచి 2 గంటల వరకు ఇంట్లో లైట్లు, ఇంటర్నెట్ బంద్ చేయాలని, ఇంట్లో ఉండే మహిళలకు జీతం ఇవ్వాలని, కొత్త జంటల ఫస్ట్‌నైట్‌కు హోటల్ ఖర్చుల కోసం ప్రత్యేకంగా డబ్బు ఇవ్వాలనే ప్రతిపాదనలున్నాయి. ఇక పని ప్రదేశాల్లో లంచ్, కాఫీ బ్రేక్‌లు సంతానోత్పత్తి బ్రేక్‌లుగా వాడుకోవాలనేది మరో ఆసక్తికరమైన ప్రతిపాదన.

నో మ్యారేజ్.. నో సెక్స్.. నో కిడ్స్!


న్యూఢిల్లీ, నవంబరు 9: అమెరికా ఆడవాళ్లకు అక్కడి మగాళ్లపై పీకల్దాక కోపమొచ్చింది. కమలా హారి‌స్‌ను కాదని ట్రంప్‌కు ఓట్లేసి గెలిపించినందుకు పురుష పుంగవులపై లక్షల సంఖ్యలో మహిళామణులు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ట్రంప్ స్త్రీవాద వ్యతిరేకి అని కన్నీటి పర్యంతమవుతూ వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. వీరిలో వేల సంఖ్యలో తరుణులైతే తమ ఈ కోపానికి ప్రతీకార రూపాన్నిచ్చి మగవారిపై కసి తీర్చుకోవాలనుకుంటున్నారు. దక్షిణకొరియాలో తమ హక్కులను కాలరాస్తున్నారనే ఆగ్రహంతో అక్కడి మహిళలు 4బీ ఉద్యమం సాగించినట్లుగా.. అందులో ప్రధానమైంది భర్తలను శృంగారానికి దూరంగా ఉంచడం. అంటే.. పడకమీదకు చేరిన భర్తకు 'నో సెక్స్' అని తేల్చి చెబుతారన్నమాట! ఇంకా మగవారితో సంబంధాలే కొనసాగించకపోవడం, అసలు పెళ్లిళ్లకే దూరంగా ఉండటం, ఒకవేళ పెళ్లి చేసుకున్నా పిల్లల్ని కనకపోవడం వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకున్నారట!

జనవరి 1 నుంచి

స్విట్జర్లాండ్‌లో బురఖాపై నిషేధం

న్యూఢిల్లీ, నవంబరు 9: స్విట్జర్లాండ్‌లో బహిరంగ ప్రదేశాల్లో బురఖా ధరించడంపై నిషేధం వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి రానుంది. ప్రజలు తిరిగే ప్రైవేటు భవనాల్లోనూ బురఖాపై నిషేధం ఉంటుంది. ఈ నిబంధనలను అతిక్రమించిన వారికి 1,000 స్విస్ ఫ్రాంక్‌ల (రూ.96,947) జరిమానా విధించనున్నారు. ఈ నిర్ణయాన్ని ముస్లిం సంస్థలు, హక్కుల కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 2021లో దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో బురఖా నిషేధానికి మద్దతుగా 51 శాతం మంది ప్రజలు ఓటేశారు. అక్కడి పార్లమెంట్‌లోనూ ఈ నిర్ణయానికి ఆమోదం లభించింది. దాదాపు 88.5 లక్షల మంది జనాభా ఉన్న స్విట్జర్లాండ్‌లో.. ముస్లింలు 5 శాతం ఉన్నారు.

లోకం తీరు



నీట్ అభ్యర్థినిపై అత్యాచారం

» బ్లాక్‌మెయిల్ చేసి పలుమార్లు రేప్.. ఇద్దరు కోచింగ్ టీచర్ల అరెస్టు

కాన్పూర్, నవంబరు 9: 'నీట్' శిక్షణ కోసం కాన్పూర్ వచ్చిన ఓ బాలిక పలుమార్లు అత్యాచారానికి గురయింది. పేరుపొందిన ఇద్దరు కోచింగ్ టీచర్లే ఈ దారుణానికి పాల్పడ్డారు. పోలీసులు వారిని అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరుపరిచారు. ఈ ఏడాది జనవరిలో బయాలజీ టీచర్ సహీల్ సిద్దిఖీ (32) విద్యార్థులందరికీ పార్టీ ఇస్తున్నానని చెప్పి ఆ బాలికను తన ఇంటికి పిలిచాడు. వెళ్లి చూసేసరికి ఇతర విద్యార్థులు ఎవరూ లేరు. ఆమెకు మద్యం తాగించి అత్యాచారం చేశాడు. ఎవరికైనా చెబితే కుటుంబ సభ్యులకు హాని కలిగిస్తానని బెదిరించాడు. అనంతరం పార్టీల పేరుతో పలుమార్లు అత్యాచారం చేశాడు. ఇదే క్రమంలో కెమిస్ట్రీ బోధించే వికాస్ పోర్వాల్ (39) కూడా ఆమెను రేప్ చేశాడు. సిద్దిఖీపై గతంలోనూ ఇలాంటి కేసు నమోదయింది. అరెస్టయి,ఇటీవలే బెయిల్‌పై వచ్చాడు.

మణిపూర్‌లో గిరిజన మహిళపై అత్యాచారం

» అనంతరం ఇంట్లోనే సజీవ దహనం..17 ఇళ్లకు నిప్పు

గువాహటి, నవంబరు 9: మణిపూర్‌లో జాతి విద్వేషం తీవ్రరూపం దాల్చింది. ఆయుధాలతో వచ్చిన చొరబాటుదార్లు జిరిబాం జిల్లాలోని జైరివాన్ గ్రామంలో గురువారం రాత్రి అరాచకం సృష్టించారు. విచక్షణ రహితంగా కాల్పులు జరిపారు. ముగ్గురు పిల్లల తల్లి అయిన 31 ఏళ్ల గిరిజన మహిళపై అత్యాచారం చేశారు. అనంతరం ఆమెను ఇంట్లోనే సజీవ దహనం చేశారు. 17 ఇళ్లకు నిప్పుపెట్టి దహనం చేశారు.

బ్రదర్స్, నన్స్‌కు ఐటీ మినహాయింపులు రద్దు

న్యూఢిల్లీ, నవంబరు 9: ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడుస్తున్న విద్యాసంస్థల్లో పనిచేస్తున్న క్రైస్తవ ప్రీస్ట్స్, బ్రదర్స్ నన్స్‌కు అమలవుతున్న ఆదాయపు పన్ను(ఐటీ) మినహాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసింది. తద్వారా బ్రిటిష్ కాలం నాటి సంప్రదాయానికి ముగింపు పలికింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం గురువారం తీర్పు చెప్పింది.

పాకిస్థాన్‌లో ఫిదాయీ దాడి.. 27 మంది దుర్మరణం

ఇస్లామాబాద్, నవంబరు 9: పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్‌లో మానవబాంబు దాడిలో 27మంది దుర్మరణంపాలయ్యారు. వారిలో 14మంది సైనికులు ఉన్నారు. మరో 62 మంది తీవ్రగాయాలపాలవ్వగా.. వారిలో 46మంది జవాన్లు ఉన్నారు. క్షతగాత్రుల్లో తొమ్మిది మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

72 కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతి

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 2024-25 విద్యా సంవత్సరానికి కొత్తగా 72 నూతన వైద్య కళాశాలలకు అనుమతులు మంజూరు చేసినట్లు జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) వెల్లడించింది. కొత్తగా అనుమతులు పొందిన కాలేజీలు, సీట్లు అప్‌గ్రేడేషన్ అయిన కాలేజీలు, సీట్ల వివరాలను ఎన్ఎంసీ వెబ్‌సైట్‌లో ఉంచింది. 72 కొత్త కాలేజీల్లో 6850 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతులివ్వగా మరో 30 కాలేజీల్లో అదనంగా 1872 సీట్ల పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ విద్యా సంవత్సరం అదనంగా 8722 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చినట్లు వెల్లడించింది.

తప్పుచేసిన వారికి శిక్ష తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిన ఆయన పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. టీడీపీ దేనికీ భయపడదన్నారు. తీవ్రవాదులతోనే పోరాడామని.. ముఠానాయకులను పూర్తిగా కట్టడి చేశామని.. మత విద్వేషాలను రెచ్చగొట్టే వారిని నియంత్రించామని తెలిపారు. ప్రస్తుతం రౌడీలు రాజకీయ ముసుగులు వేసుకున్నారని.. వారి ముసుగులను తొలగిస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో రౌడీలను రౌడీలుగా, నేరస్థులను నేరస్థులుగానే చూస్తామని.. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని తెలిపారు. 'ఎవరైనా సరే చట్టానికి లోబడే పనిచేయాలి. ఒకరిద్దరు పోలీసులు లాలూచీ పడినా, తప్పు చేసినా అదే వారి ఉద్యోగానికి ఆఖరి రోజు అవుతుంది. శాంతిభద్రతలు బాగుంటేనే పెట్టుబడులు వస్తాయి. రాష్ట్రం ప్రశాంతంగా ఉంటేనే పర్యాటకాన్ని ప్రచారం చేయగలం. దీనివల్ల అభివృద్ధి జరిగి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగి ఆదాయం పెరుగుతుంది. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించం. రాష్ట్రంలో అలజడులు సృష్టించేవారు ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. సోషల్ మీడియాలో ఇష్టారీతిన పోస్టులు పెట్టే వారికి.. వారి కుటుంబ సభ్యులపైన గౌరవం లేకపోవచ్చేమో, వారి తల్లి, చెల్లెలిపైన గౌరవం లేకపోవచ్చేమో.. కానీ మా ప్రభుత్వానికి గౌరవం ఉంది' అని పరోక్షంగా మాజీ సీఎం జగన్‌కు చురకలంటించారు. మనుషులు మనుషుల్లాగానే ఉండాలని, మృగాళ్లలా ప్రవర్తిస్తే వారి పట్ల ఎలా ప్రవర్తించాలో అలానే ప్రవర్తిస్తామన్నారు. 'ఇది ప్రజాస్వామ్యం. రాతియుగం కాదు. అభివృద్ధి కోసం ఆనాడు సాంకేతికత తీసుకొచ్చాను.. ఇలా సోషల్ మీడియాలో విచ్చలవిడిగా ప్రవర్తించేందుకు కాదు. తప్పుడు చిరునామాతో తప్పుడు సమాచారం పెట్టే ఆలోచన ఉంటే మానుకోండి. సోషల్ మీడియా పోస్టుల వల్ల తన బిడ్డలు బోరున ఏడ్చారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారు. ఇలాంటి వాటిని ప్రభుత్వం భరించాలా' అని ప్రశ్నించారు. గతంలో ఎన్నికల సమయంలో బాబాయిని చంపి గుండెపోటని అబద్ధమాడారని, తర్వాత గుండెపోటు కాదని, గొడ్డలి పోటని సాయంత్రానికి తెలిస్తే.. జగన్ పత్రిక 'నారాసుర రక్తచరిత్ర' అని వేసిందని దుయ్యబట్టారు. 'అనాడే అబద్ధాలాడిన వారిని లోపల వేయిస్తే ఏమై ఉండేది? కానీ మంచితనంతో నేనా పని చేయలేదు. దీనిని దుర్వినియోగం చేయాలని చూస్తే ఖబడ్దార్. తప్పు చేసిన వారెవరినీ వదిలిపెట్టం' అని సీఎం తేల్చిచెప్పారు.

ట్రంప్ తొలి దెబ్బ భారతీయులపైనే!

(మొదటి పేజీ తరువాయి)



ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. ఇదే జరిగితే పౌరసత్వం కోసం అమెరికాలోనే ఉండి ఎదురుచూస్తున్న లక్షలాది మంది భారతీయులు, వారి సంతానం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడం ఖాయం. ఈ నేపథ్యంలో ట్రంప్ జారీచేసే కార్యనిర్వాహక ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధమంటూ న్యాయస్థానాల్లో సవాల్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ట్రంప్ ప్రచార వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న డాక్యుమెంట్ ప్రకారం.. అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన తొలి రోజే.. వలసలను నివారిస్తూ ఆయన కార్యనిర్వాహక ఆదేశాలు జారీచేస్తారు. తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు అమెరికన్ పౌరులై ఉండాలని.. లేదా చట్టబద్ధ శాశ్వత నివాసులై (పర్మినెంట్ రెసిడెన్స్-పీఆర్) ఉండాలని.. అప్పుడే వారి పిల్లలు ఆటోమేటిగ్గా అమెరికన్ పౌరులవుతారని.. లేదంటే వారిని స్వదేశాలకు పంపించివేయాలని ఫెడరల్ ఏజెన్సీలకు ఉత్తర్వులు ఇస్తారు. అంటే.. భవిష్యత్‌లో అమెరికా పౌరులు కాని.. శాశ్వత నివాసులు కాని దంపతులకు అక్కడ పుట్టిన పిల్లలు సహజ ప్రక్రియ ద్వారా వారు ఆటోమేటిక్ పౌరులవడానికి అర్హులు కారు. ట్రంప్ తన ప్రతి ప్రచార సభలో కూడా.. అమెరికన్ చరిత్రలోనే అతిపెద్ద డిపోర్టేషన్ (అక్రమ వలసదారులు స్వదేశాలకు అప్పగింత) కార్యక్రమాన్ని అధ్యక్షుడిగా మొదటి రోజే ప్రారంభిస్తానని ప్రకటించారు. అధికారిక గణాంకాలు లేనప్పటికీ.. 2023 మొదటి త్రైమాసికం నాటికి ఉపాధి ఆధారిత గ్రీన్‌కార్డు (అమెరికా పౌరసత్వం) కోసం ఎదురుచూస్తున్న భారతీయుల సంఖ్య 10లక్షలు దాటిందని అంచనా. గ్రీన్‌కార్డు కోసం వీరి వెయిటింగ్ కాలపరిమితి సగటున 50 ఏళ్లకుపైనే ఉంటుంది. దీనిప్రకారం అమెరికాలో చదువుకునేందుకు లేదా ఉద్యోగం చేసుకోవడానికి వెళ్లిన 5లక్షల మందికిపైగా యువ వలసదారులు.. పౌరసత్వం రాకముందే మరణించే అవకాశముంది. అలాగే దరిదాపుగా 2.5లక్షల మంది పిల్లల వయసు 21 ఏళ్లు దాటుతుంది. విద్యార్థి వీసా వంటి ప్రత్యామ్నాయ వీసా గనుక లేకపోతే వారు అక్రమ వలసదారులవుతారు. ఈ నేపథ్యంలో ట్రంప్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని అమెరికన్ న్యాయ నిపుణులు అంటున్నారు. 14వ సవరణను అది ఉల్లంఘిస్తోందని చెబుతున్నారు. అయితే 14వ సవరణకు సరైన భాష్యం తామే చెబుతున్నామని ట్రంప్ జారీచేయబోతున్న కార్యనిర్వాహక ఆదేశాల ముసాయిదాలో పేర్కొనడం గమనార్హం. 2022 అమెరికా జనాభా లెక్కలను విశ్లేషించిన 'ప్యూ రీసెర్చ్' సంస్థ.. అమెరికాలో స్థిరనివాసం ఏర్పరచుకున్న భారతీయ అమెరికన్లు 48 లక్షల మంది వరకు ఉన్నారని తెలిపింది. వీరిలో 16 లక్షల మంది అమెరికాలోనే పుట్టి పెరిగి సహజ పౌరులుగా మారారని వెల్లడించింది.

భారత విద్యార్థులకు

కెనడా షాక్

ఫాస్ట్ ట్రాక్ స్టూడెంట్ వీసా ప్రక్రియ రద్దు

అట్టవా, నవంబరు 9: కెనడాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకొనే భారతీయ విద్యార్థులకు ట్రూడో ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. వేలాది మంది అంతర్జాతీయ విద్యార్థులు త్వరగా వీసాలు పొందడానికి సహాయపడే ఫాస్ట్ ట్రాక్ స్టూడెంట్ డైరెక్ట్ స్ట్రీమ్(ఎస్‌డీఎస్) ప్రోగ్రామ్‌ను ఈ నెల 8నుంచి నిలిపివేసింది. ఈ నిర్ణయం తక్షణమే అమలులోకి వస్తుందని ప్రకటించింది. ఎస్‌డీఎస్‌తో పాటు నైజీరియా నుంచి స్టడీ పర్మిట్ దరఖాస్తులను స్వీకరించే నైజీరియా స్టూడెంట్ ఎక్స్‌ప్రెస్(ఎన్ఎస్ఈ)ని కూడా రద్దు చేస్తున్నట్లు ఇమిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (ఐఆర్‌సీసీ) ప్రకటించింది. భారత్ సహా 14 దేశాలకు చెందిన విద్యార్థులకు వీసా దరఖాస్తులను వేగవంతం చేసే ఉద్దేశంతో 2018లో ఎస్‌డీఎస్‌ను ప్రారంభించారు. 2022లో మన దేశానికి చెందిన 80శాతం మంది ఈ విధానంలోనే వీసా పొందారు. 2023 జనవరి నుంచి మార్చి వరకూ వీసా కోసం దరఖాస్తు చేసిన ప్రతి ఐదుగురు భారతీయ విద్యార్థుల్లో నలుగురు ఎస్‌డీఎస్ ద్వారా చేసుకున్నారు. వీరిలో 76 శాతం మందికి వీసాలు మంజూరయ్యాయి. ఇదే సమయంలో రెగ్యులర్ విధానంలో వెళ్లిన వారిలో 8శాతం మందికి మాత్రమే వీసా లభించింది. కాగా కెనడాలో పెద్దసంఖ్యలో ఖలిస్థానీ మద్దతుదారులు ఉన్నారని ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో ఎట్టకేలకు అంగీకరించారు. అయితే వారు మొత్తంగా సిక్కు సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు కాదని చెప్పుకొచ్చారు. అదేవిధంగా భారత ప్రధాని మోదీ ప్రభుత్వానికి మద్దతుదారులు కూడా తమ దేశంలో ఉన్నారని, హిందూ కెనడియన్లు అందరికీ వారు ప్రాతినిధ్యం వహించరని అభిప్రాయం వ్యక్తం చేశారు. అట్టవా పార్లమెంట్ హిల్‌లో ఇటీవల నిర్వహించిన దీపావళి వేడుకల్లో పాల్గొన్న ట్రూడో ఈ వ్యాఖ్యలు చేశారు.

ట్రంప్ హత్యకు ఇరాన్ పన్నిన

కుట్ర భగ్నం

వాషింగ్టన్, నవంబరు9: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌ను హత్యచేసేందుకు ఇరాన్ పన్నిన కుట్రను ఎఫ్‌బీఐ భగ్నం చేసింది. ఫర్హాద్ షకేరీ అనే ఆఫ్ఘన్ పౌరుడికి ఐఆర్‌జీసీ ఈ బాధ్యతలు అప్పగించిందంటూ ముగ్గురిపై అమెరికా న్యాయ విభాగం మన్‌హట్టన్ ఫెడరల్ కోర్టులో అభియోగాలుమోపింది. ఈ కేసులో ఇప్పటికే మరో ఇద్దరిని అరెస్ట్ చేసింది. అధ్యక్ష ఎన్నికలకు ముందే ట్రంప్‌ను హత్య చేయాలని ఐఆర్‌జీసీ ఆదేశించినా షకేరీ కావాలనే ఆలస్యం చేశాడు. ఎన్నికల్లో ఓటమిపాలయ్యాక ట్రంప్‌ను హత్య చేయడం సులభమని భావించి పథకాన్ని వాయిదా వేసుకున్నాడు. ఈలోగా ఎఫ్‌బీఐ ఈ కుట్రను భగ్నం చేసింది. ట్రంప్ హత్యతోపాటు న్యూయార్క్‌లోని యూదు అమెరికన్లను, శ్రీలంకలో ఉన్న ఇజ్రాయెలీ పర్యాటకులను చంపాలని కూడా షకేరీని ఐఆర్‌జీసీ ఆదేశించింది. షకేరీ గతంలో అమెరికాలో ఓ దోపిడి కేసులో 14ఏళ్లు జైలు శిక్ష అనుభవించాడు. షకేరీ ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్నట్లు సమాచారం. ట్రంప్ హత్యకు కుట్ర పన్నారంటూ వచ్చిన ఆరోపణలను ఇరాన్ తోసిపుచ్చింది.

బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తత

న్యూఢిల్లీ, నవంబరు 9: బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తత నెలకొంది. ఇస్కాన్ సంస్థను నిషేధించాలని చిట్టగాంగ్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ హెఫాజత్ ఎ ఇస్లాం పిలుపునివ్వడంతో వివాదం నెలకొంది. చట్టోగ్రాంలో ఇటీవల జరిగిన ఓ ప్రదర్శనలో హెఫాజత్ కార్యకర్తల నినాదాల వీడియో ను ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఇస్కాన్‌పై దాడి చేయాలని, కార్యకర్తలను చంపాలని కొందరు నినదించడం ఆ వీడియోలో కనిపించింది. ఇస్కాన్ భక్తులకు ముప్పు ఉందని తస్లీమా ఆందోళన వ్యక్తంచేశారు.

రిజర్వేషన్లపై పరిమితి ఎత్తివేయడమే

కాంగ్రెస్ విధానం: జైరామ్

న్యూఢిల్లీ, నవంబరు 9: దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టడం, ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు విధించిన పరిమితులను ఎత్తివేయడమే కాంగ్రెస్ పార్టీ విధానమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. తెలంగాణలో కుల గణన ప్రారంభించిన నేపథ్యంలో శనివారం 'ఎక్స్'లో ఆయన ఈ మేరకు ఓ పోస్టు చేశారు. 1931 తర్వాత తొలిసారిగా తెలంగాణలో కుల గణన చేపట్టం ఓ విప్లవాత్మకమైన నిర్ణయం అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను సాకారం చేయడంతోపాటు అంబేడ్కర్ ఆదర్శాలకు అనుగుణంగా ఈ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. రాహుల్ ఇటీవల హైదరాబాద్‌లో పేర్కొన్నట్లు తెలంగాణలో జరుగుతున్న కుల గణన దేశానికి ఆదర్శం కావాలని తెలిపారు.

ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు..

ఆరెస్సె‌స్‌పై నిషేధం!

ఎంవీఏకు మద్దతివ్వడానికి ఉలేమా బోర్డు షరతులు

ముంబై/న్యూఢిల్లీ, నవంబరు 9: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)కి మద్దతు ఇచ్చేందుకు అఖిల భారత ఉలేమా బోర్డు ముందుకొచ్చింది. ఎంవీఏ అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహిస్తామని ఆ కూటమి నాయకులకు రాసిన లేఖలో పేర్కొంటూ పలు షరతులు విధించింది. ప్రధాన షరతులివీ.. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రద్దుకు ఎంవీఏ కృషి చేయాలి. ఎంవీఏ అధికారంలోకి వస్తే మహారాష్ట్ర వక్ఫ్ బోర్డుకు రూ.1,000 కోట్లు కేటాయించాలి. రాష్ట్రంలో ముస్లింలకు 10శాతం రిజర్వేషన్లు కేటాయించాలి. ఆరెస్సెస్ పై నిషేధం విధించాలి.

రాష్ట్రాలను ఏటీఎం చేసుకున్నారు

వనరులను దోపిడీ చేస్తున్నారు.. మహారాష్ట్రను ఏటీఎం కానివ్వం

» కాంగ్రెస్‌పై నిప్పులుచెరిగిన ప్రధాని

» మహారాష్ట్రలో మోదీ సుడిగాలి పర్యటన

నాగ్‌పూర్/నాందేడ్, నవంబరు9: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఆ రాష్ట్రంలో సుడిగాలి పర్యటన చేశారు. నాగ్‌పూర్ సమీపంలోని అకోలా, నాందేడ్ సహా పలు నియోజకవర్గాల్లో బీజేపీ నేతృత్వంలోని 'మహాయుతి' కూటమి అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాలను ఆ పార్టీ నేతలు, ముఖ్యంగా రాజకుటుంబం ఏటీఎంలుగా భావిస్తోందని, రాష్ట్రాల ఆర్థిక మూలాలను దోపిడీ చేస్తోందని దుయ్యబట్టారు. తాము అంబేడ్కర్ వారసులమని చెప్పుకొనే కాంగ్రెస్.. రాజ్యాంగ నిర్మాత కోసం ఏం చేసిందో చెప్పాలన్నారు. అకోలా నియోజకవర్గంలో ప్రధాని మాట్లాడుతూ.. "ఎక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందో ఆ రాష్ట్రం ఆ రాజ కుటుంబానికి ఏటీఎం. కానీ, మహారాష్ట్రను మాత్రం వారికి ఏటీఎం కానివ్వబోం" అన్నారు. "అంబేడ్కర్ పంచతీర్థాలను మీరెప్పుడైనా సందర్శించి ఉంటే నిరూపించండి" అని కాంగ్రెస్ నేతలకు ప్రధాని సవాల్ విసిరారు. అంబేడ్కర్ జన్మస్థలం మౌ, లండన్‌లోని ఆయన నివాసం, నాగ్‌పూర్‌లోని దీక్షా భూమి, ఢిల్లీలోని అంబేడ్కర్ మహాపరినిర్వాణ స్థల్, ముంబైలోని చైత్యభూమిలను అంబేడ్కర్ పంచతీర్థాలుగా అభివర్ణించారు.



మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో మోదీ

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో హరియాణా ప్రజలు ఐక్యంగా ఉండి కాంగ్రెస్ పార్టీ కుట్రను భగ్నం చేశారని, మహారాష్ట్ర ప్రజలు కూడా ఐక్యంగా ఉండి కాంగ్రెస్ కుట్రలను చేదించాలని ప్రధాని పిలుపునిచ్చారు. "కాంగ్రెస్ కులాల మధ్య చిచ్చుపెడుతోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని మహావికాస్ అఘాడీ కూటమి అవినీతి, కుంభకోణాలకు పరాకాష్ఠ. ఆ కూటమి నేతలు లక్షల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారు" అని నిప్పులుచెరిగారు. నాందేడ్‌లో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, దళితులు, ఆదివాసీలు ఐక్యంగా ఉండడంతో కాంగ్రెస్ పునాదులు కదిలిపోతున్నాయన్నారు. "కాంగ్రెస్‌నేతలు ఇటీవల రెడ్ బుక్ చూపుతున్నారు. దీనికి 'భారత రాజ్యాంగం' అని పేరు పెట్టారు. కానీ, లోపలన్నీ ఖాళీ పేజీలే. ఆ పార్టీ నేతల దురదృష్ట, దౌర్భాగ్యకర రాజకీయాలతో దేశం దిగ్భ్రాంతికి గురవుతోంది" అని మోదీ అన్నారు.

మోదీ జీ.. తెలంగాణలో

కులగణన మొదలైంది

» త్వరలో మహారాష్ట్రలోనూ

» దేశవ్యాప్తంగా కులగణనను మీరు ఆపలేరు: రాహుల్

న్యూఢిల్లీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): "మోదీ జీ తెలంగాణలో శనివారం కులగణన మొదలైంది. కులగణన లెక్కల ఆధారంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధికి విధానాలను రూపొందిస్తాం. త్వరలో మహారాష్ట్రలోనూ ఇదే జరగనుంది. దేశంలో సమగ్ర కులగణన చేపట్టడం బీజేపీకి ఇష్టంలేదన్న సంగతి అందరికీ తెలుసు. దేశవ్యాప్తంగా కుల గణనను మీరు ఆపలేరు. ఈ పార్లమెంట్‌లోనే కులగణనను ఆమోదింపజేసేలా చేసి రిజర్వేషన్లపై 50శాతం గోడను బద్దలు కొడతాం" అని రాహుల్ గాంధీ శనివారం 'ఎక్స్'లో స్పష్టంచేశారు. మరోవైపు శనివారం ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్, జంషెడ్‌పూర్‌లలో ఎన్నికల ర్యాలీల్లో రాహుల్ మాట్లాడుతూ, దేశంలో ఓ సామాన్యుడు ఎంతైతే పన్ను చెల్లిస్తున్నాడో అదానీ కూడా అంతే పన్ను కడుతున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వ పన్నుల విధానం పేదవారిని దోపిడీ చేసేలా ఉందని ఆయన విమర్శించారు.

అవినీతి లేకుండా పనిచేయండి

» ఎన్డీయే భాగస్వాముల్లా మాట్లాడాలి

» ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రొటోకాల్ మరవద్దు

» నామినేటెడ్ పదవులు పొందిన జనసేన నేతలతో డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): 'పదవులు పొందిన నాయకులు పదిమందినీ కలుపుకొని వెళ్లాలి. సరికొత్త నాయకత్వాన్ని తయారు చేయాలి' అని జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. నామినేటెడ్ పదవులు పొందిన జనసేన నాయకులతో ఆయన శనివారం మధ్యాహ్నం తన నివాసంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. 'గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు, అవినీతి లేకుండా పని చేయాలి. పార్టీ మరింతగా ప్రజలకు దగ్గరయ్యేలా పని చేయాలి. ఎట్టి పరిస్థితుల్లో ప్రొటోకాల్ మర్చిపోవద్దు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు తగిన గౌరవం ఇస్తూ, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగాలి. కేవలం జనసేన పార్టీ ప్రతినిధులుగానే కాకుండా ఎన్డీయే ప్రభుత్వంలో భాగంగా మాట్లాడాలి" అని పవన్ సూచించారు. 'కుల గణాంకాలు కావాలని కొన్ని పార్టీలు కోరుతున్నాయి. నైపుణ్య గణాంకాలతో పాటు కుల గణాంకాలూ తీసుకోవాలి. దానిలో తప్పు లేదు. ఇది రాష్ట్రంలో సంపూర్ణంగా జరగాలన్నదే నా ఆలోచన. మీడియా వద్ద వ్యక్తిగతంగా మాట్లాడొద్దు. పాలసీలపైనే చర్చ చేయాలి. ఏదైనా సమస్య ఉంటే నా పేషీ దృష్టికి తీసుకురావాలి' అని పవన్ కోరారు. నామినేటెడ్ పదవులు పొందిన అందరికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, కాకినాడ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), ఇతర నాయకులకు ఆయన పేరు పేరునా అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ హరిప్రసాద్ ఉన్నారు.



నామినేటెడ్ పోస్టుల్లో నియమితులైన పార్టీ నేతలతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

పోలీసులూ బాధ్యతగా వ్యవహరించండి...

రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో బాధ్యతగా ప్రవర్తించాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. వారు చేసిన తప్పులు కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తాయన్నారు. ఇటీవల తుని సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. ఈ వ్యవహారంలో పోలీసులు ప్రవర్తించిన తీరు పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి ఫిర్యాదు చేయడానికి వెళ్లిన బాధితుల తల్లిదండ్రుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు ఆ కుటుంబాలను తీవ్ర మనస్తాపానికి గురి చేసిందన్నారు. శనివారం మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులను ఆయన కలిశారు. ప్రమాద వివరాలు తెలుసుకొని చలించిపోయారు. 'పవన్ కల్యాణ్ లెర్నింగ్ సెంటర్ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్' నుంచి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... 'రోడ్డు ప్రమాదంలో బిడ్డలను కోల్పోయిన తల్లిదండ్రుల బాధ తీవ్రమైంది. అంతటి కష్టాన్ని దిగమింగుకొని, బ్రెయిన్ డెడ్ అయిన రేవంత్ తల్లిదండ్రులు అవయవదానం చేయడం నన్ను కదిలించింది. పోలీసులు ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌పై కేసు పెట్టలేదు. కారులో ప్రయాణిస్తున్న వైద్యుడు కూడా బాధ్యతగా వ్యవహరించకపోవడం దారుణం. పోలీసులు ప్రవర్తించిన తీరుకు నేను క్షమాపణలు చెబుతున్నా' అని అన్నారు.

జిల్లా కోర్టు నుంచి సర్వోన్నత న్యాయస్థానానికి

» 51వ సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా

» రేపు రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారం

» ఆరు నెలలపాటు బాధ్యతలు



న్యూఢిల్లీ, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ సంజీవ్ ఖన్నా... న్యాయ వ్యవస్థలో శిఖరాగ్రస్థానానికి చేరుకోనున్నారు. జిల్లా కోర్టులో న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించిన ఆయన భారత ప్రధాన న్యాయమూర్తిగా కర్తవ్యాన్ని నిర్వహించనున్నారు. సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా (సీజేఐ) సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ పదవీ కాలం ఆదివారంతో ముగియనుండడంతో మరుసటి రోజునే పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. రాష్ట్రపతి భవన్‌లో ఆ రోజు ఉదయం జరిగే కార్యక్రమంలో జస్టిస్ సంజీవ్ ఖన్నాతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయించనున్నారు. అనంతరం ఆయన అక్కడి నుంచి నేరుగా సుప్రీంకోర్టుకు చేరుకుంటారు. కోర్టు నంబర్-1లో సీజేఐ హోదాలో కేసుల విచారణను ప్రారంభిస్తారు. ఆయన దాదాపు ఆరు నెలల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. వచ్చే ఏడాది మే 13న తన 65వ పుట్టినరోజుకు ఒకరోజు ముందు పదవీ విరమణ చేయనున్నారు. భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో జస్టిస్ ఖన్నా తన అలవాట్లను మార్చుకోనున్నారు. తనకెంతో ఇష్టమైన మార్నింగ్ వాక్‌కు విరామం ఇవ్వనున్నారు. ఇప్పటి వరకు ఆయన ప్రతి రోజూ లోధి గార్డెన్ వద్ద ఒంటరిగా మార్నింగ్ వాక్ చేసేవారు. ఇప్పుడు తనను అందరూ గుర్తుపట్టే అవకాశం ఉండడం, భద్రత కారణాలు కూడా ఉండడంతో ఉదయపు నడకకు విరామం ప్రకటించినట్లు సమాచారం.

కుటుంబ నేపథ్యం

జస్టిస్ సంజీవ్ ఖన్నా న్యాయమూర్తుల కుటుంబం నుంచి వచ్చారు. ఆయన తండ్రి జస్టిస్ దేవరాజ్ ఖన్నా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. చిన్నాన్న జస్టిస్ హన్సరాజ్ ఖన్నా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా వ్యవహరించారు. ఢిల్లీలోని బరాఖంబా రోడ్‌లోని మోడరన్ స్కూల్‌లో పాఠశాల విద్యను పూర్తిచేసిన జస్టిస్ సంజీవ్ ఖన్నా 1980లో ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ పట్టా తీసుకున్నారు. అదే యూనివర్సిటీలో న్యాయవిద్యను అభ్యసించారు. 1983లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరును నమోదు చేసుకున్నారు. తీస్ హజారీ కాంప్లెక్స్‌లోని జిల్లా న్యాయస్థానంలో తొలుత ప్రాక్టీస్ చేశారు. 2004లో ఢిల్లీ ప్రభుత్వం తరఫున నేషనల్ క్యాపిటల్ టెరిటరీకి స్టాండింగ్ కౌన్సెల్‌గా నియమితులయ్యారు. 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2006లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, తన చిన్నాన్న జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా కూర్చొన్న కోర్టు గది నుంచి తన మొదటి రోజును ప్రారంభించారు. ప్రస్తుతం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా సేవలు అందిస్తున్నారు.

ఆధునిక సనాతన పోకడను ఆలోచనతో ఎదుర్కోవాలి

» ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర మహాసభలో 'ఆంధ్రజ్యోతి' పూర్వ ఎడిటర్ కె.శ్రీనివాస్



ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సనాతన ధర్మం పేరుతో నడుస్తున్న పోకడను ఆలోచన విధానంతోనే ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని 'ఆంధ్రజ్యోతి' పూర్వ ఎడిటర్ కె.శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. ఒంగోలులో ఆదివారం జరిగిన ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి అంశాన్నీ లోతుగా విశ్లేషించకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. దేశంలో గత పదేళ్ల నుంచి జరుగుతున్న పరిణామాలను చూస్తే మనం ఎటువైపు వెళ్తున్నామో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. తప్పుడోవ పట్టించే సమాచారానికి ప్రజలు ఆకర్షితులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వాసాన్నీ, విలువలనూ నీరుగార్చే విధానాలు కొనసాగడం బాధాకరమన్నారు. ప్రస్తుతం దేశానికి ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని, వీటిని సమర్థంగా ఎదుర్కోవాల్సిన సమయం వచ్చిందన్నారు. నూతన సనాతన విధానాలతో దేశంలో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతోందని ఉదాహరణలతో వెల్లడించారు. సమాజంలో అసమానతలు, మూఢనమ్మకాలను కొనసాగించే దిశగా ఆలోచనలు జరుగుతున్నాయని, వీటిని నిర్మూలించేందుకు కొత్త ఆలోచనలతో ముందుకు పోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలు పూర్తిగా పడిపోతున్నాయని.. మాట్లాడే వారి నైతికత దెబ్బ తీసే విధంగా వ్యవహరిస్తున్నారని, వీటన్నింటిపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కులాంతర వివాహాలనూ ఏదో ఒక విధంగా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో కులాంతర వివాహం చేసుకునేందుకు నెల రోజుల ముందే రిజిస్ట్రార్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకుంటారని.. వాటిని అక్కడ నోటీసు బోర్డుల్లో పెట్టడంతో కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎం.సుబ్బారావు, ఎంఎల్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ చల్లపల్లి ఘనత ఢిల్లీకి చేరాలి

» స్వచ్ఛ ఉద్యమం దేశానికే ఆదర్శం
» ఘనంగా స్వచ్ఛ చల్లపల్లి పదేళ్ల వేడుక



స్వచ్ఛ చల్లపల్లి పదేళ్ల వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, పద్మభూషణ్ కె.వరప్రసాద్‌రెడ్డి, డాక్టర్ గురవారెడ్డి, డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్-డాక్టర్ పద్మావతి దంపతులు

చల్లపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పరిశుభ్రత కోసం పదేళ్లుగా చేస్తున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం ఘనత ఢిల్లీ వరకూ చేరాలని శాంతా బయోటెక్స్ అధినేత, పద్మభూషణ్ కె.వరప్రసాద్ రెడ్డి అన్నారు. కృష్ణాజిల్లా చల్లపల్లి గ్రామంలో స్వచ్ఛ చల్లపల్లి రథసారథులు డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్-డాక్టర్ పద్మావతి దంపతుల నేతృత్వంలో నిర్వహిస్తున్న స్వచ్ఛసేవా ఉద్యమం పదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా శనివారం వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాంతా బయోటెక్స్ అధినేత కె.వరప్రసాద్‌రెడ్డి, హైదరాబాద్ కిమ్స్ సన్‌షైన్ హాస్పటల్స్ అధినేత డాక్టర్ ఎ.వి.గురవారెడ్డి, అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తి దేశంలోని అన్ని గ్రామాలకూ విస్తరించాలని, అప్పుడే దేశం స్వచ్ఛభారత్‌గా మారుతుందన్నారు. స్వచ్ఛభారత్‌కు పిలుపునిచ్చిన మోదీ ఆదర్శంగా నిలిస్తే, ఆ పిలుపునందుకుని పదేళ్లుగా స్వచ్ఛ సేవలందిస్తున్న కార్యకర్తలు, వారికి నాయకత్వం వహించిన డీఆర్కే దంపతులు కారణజన్ములనీ, దైవస్వరూపులనీ, దేవతలనీ కొనియాడారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, పదేళ్ల స్వచ్ఛ ఉద్యమం ద్వారా చల్లపల్లి రూపురేఖలు మారిపోయాయని, స్వచ్ఛోద్యమం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. భారతదేశ సాంఘిక ఉద్యమాల చరిత్రలో స్వచ్ఛఉద్యమం మకుటాయమానంగా నిలిచిపోతుందని తెలిపారు. డాక్టర్ ఎ.వి.గురవారెడ్డి మాట్లాడుతూ, స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం కొనసాగాలని, ప్రధానమంత్రికి ఉద్యమ గొప్పతనం తెలియాలన్నారు. ఫలాపేక్ష లేకుండా పనిచేయటం తక్కువ మందికే సాధ్యమని, చల్లపల్లిలో వైద్య దంపతులకూ, స్వచ్ఛ కార్యకర్తలకూ మాత్రమే అది సాధ్యమని ప్రశంసించారు. తొలుత గంగులవారిపాలెం రోడ్డులో జాతీయ రహదారి పక్కనే మొక్కలు నాటిన అతిథులు, స్వచ్ఛ సుందర చల్లపల్లి బోర్డు ఆవిష్కరించి అక్కడి నుంచి గ్రామంలో పాదయాత్ర చేశారు.



కార్తీకమాసం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం పుష్పయాగాన్ని శోభాయమానంగా నిర్వహించారు.

శ్రీవారి సేవలో జస్టిస్ వి.గోపాలకృష్ణారావు



తిరుమల ఆలయం ముందు జస్టిస్ వి.గోపాలకృష్ణారావు

తిరుమల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శించుకున్నారు. పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విపుల్ ఎం.పంచోలీ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

వేగ జ్యూయలర్స్ లక్కీడ్రా విజేతలు వీరే

» ముగ్గురికి పోల్కీ నెక్లెస్‌లు అందజేసిన యాజమాన్యం



వేగ జ్యూయలర్స్‌లో లక్కీ డ్రా తీస్తున్న దృశ్యం

విజయవాడ, నవంబరు 9: దసరా, దీపావళి పండుగల సందర్భంగా తమ ఖాతాదారుల కోసం విజయవాడలోని వేగ జ్యూయలర్స్ సెప్టెంబరు 1 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు పండుగ ఆఫర్లతో పాటు లక్కీ డ్రా ప్రకటించింది. ఈ లక్కీ డ్రాలో గెలుపొందిన ముగ్గురు విజేతలకు మూడు లక్షల రూపాయలు విలువైన పోల్కీ నెక్లెస్‌లు అందజేస్తామని పేర్కొంది. ఈ మేరకు శనివారం లబ్బీపేట, నందమూరి రోడ్డులోని తమ షోరూం వద్ద ఖాతాదారుల సమక్షంలో లక్కీ డ్రా తీశారు. విజేతలుగా నిలిచిన నాసిక్ చౌడేశ్వరి, పి.శ్రీనివాస్, బి.హనుమయ్యను అభినందించిన వేగ జ్యూయలర్స్ అధినేతలు వనమా నవీన్, వనమా సుధాకర్ వారికి పోల్కీ నెక్లెస్‌లు అందజేశారు. ఈ సందర్భంగా నవీన్, సుధాకర్ మాట్లాడుతూ.. పండుగ సమయాల్లో తమ ఖాతాదారులకు ప్రత్యేక రాయితీ ఆఫర్లను అందించి వారిని సంతోషపరచాలనేదే తమ ఉద్దేశమని తెలిపారు. తమ షోరూంలో అన్ని వర్గాలకూ సంప్రదాయ ఆభరాణల నుంచి, ఆధునిక ఆభరణాల వరకు అన్నీ ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తాయని చెప్పారు. వివాహాల కోసం ప్రత్యేక నగల శ్రేణి అందుబాటులో ఉంచామని, బంగారు, డైమండ్ నగల తరుగు చార్జీలపైన 50శాతం తగ్గింపును, డైమండ్ జ్యూయలరీ క్యారట్ ధర రూ.54 వేలు మాత్రమేనని, పోల్కీ జ్యూయలరీపై తయారీ/తరుగు చార్జీలు లేవని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే

RK



కొత్తపలుకు

ఉన్మాదులను వదిలేయాలా?

అలుగుటయే ఎరుగని అజాత శత్రువే అలిగిన నాడు సాగరములన్నియు ఏకము కాకపోవునా!...


పాండవుల తరఫున దుర్యోధనుడి వద్దకు రాయబారిగా వచ్చిన శ్రీకృష్ణుడు ధర్మరాజును దృష్టిలో పెట్టుకొని చేసిన హెచ్చరిక ఇది! సౌమ్యుడుగా కనిపించే ధర్మరాజుకు ఆగ్రహం వస్తే పరిస్థితులు ఎలా ఉంటాయో దుర్యోధనుడిని హెచ్చరించడమే దీని సారాంశం. మహాభారతం నుంచి వర్తమానంలోకి వస్తే, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆగ్రహం తెప్పించిన సోషల్ మీడియా ఉన్మాదులు ఫలితాన్ని అనుభవిస్తున్నారు. తాజా ఎన్నికల్లో అఖండ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాలుగు నెలలపాటు మెతకగానే ఉన్నారు. దీంతో కూటమి ప్రభుత్వం తమను ఏమీ చేయలేదని భావించిన వైసీపీ మద్దతుదారులైన సోషల్ మీడియా ఉన్మాదులు కలుగుల్లో నుంచి బయటకు వచ్చి రెచ్చిపోయారు. నాగరిక సమాజం ఏ మాత్రం ఆమోదించని భాషతో కూటమికి చెందిన ముఖ్యుల ఇళ్లలోని ఆడవాళ్లను దూషించడం మొదలుపెట్టారు.

> ఉన్మాద మూక చర్యలు ఎంత దూరం వెళ్లాయంటే... జగన్‌రెడ్డికి మద్దతుగా ఉన్నంత కాలం షర్మిలమ్మ, విజయమ్మ, సునీతమ్మ అని సంబోధించి.. ఇప్పుడు జగన్‌తో విబేధించగానే పేరు చివర 'అమ్మ'లు తొలగించి షర్మిల, విజయలక్ష్మి, సునీత అంటూ నిందించడం మొదలుపెట్టారు. ఇప్పుడు వైసీపీ సోషల్ మీడియా ఉన్మాద మూక కేవలం జగన్‌రెడ్డి భార్య భారతీరెడ్డిని మాత్రమే భారతమ్మ అని పిలుచుకుంటున్నారు. అంటే, భారతీ రెడ్డికి మాత్రమే పరువు మర్యాదలు ఉన్నాయి, జగన్‌రెడ్డితో విబేధించేవారు రక్త సంబంధీకులైనా వారికి పరువు మర్యాదలు ఉండవనే కదా! దివంగత రాజశేఖర రెడ్డి సతీమణి విజయలక్ష్మికి కూడా దురుద్దేశాలు ఆపాదించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చేతులు కలిపారని నిందించారు. రక్తం పంచుకు పుట్టిన వారి మన్ననలు కూడా పొందలేని జగన్‌రెడ్డి కోసం ఇంతలా బరితెగించాలా అంటే సమాధానం లభించదు.

జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ మొదలైన వారి ఇళ్లలోని మహిళలను దారుణంగా కించపరిచారు. అప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే బరితెగింపు కొనసాగింది. దీంతో ముఖ్యమంత్రి మెతక వైఖరిపై తెలుగు తమ్ముళ్లు, జన సైనికులు రగిలిపోయారు. ఈ నేపథ్యంలోనే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిఠాపురంలో మాట్లాడుతూ, పోలీసుల పనితీరును విమర్శించడంతోపాటు హోం శాఖను తాను చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు. దీంతో సోషల్ మీడియాలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించే విశ్లేషకులు కూటమిలో కుంపట్లు అంటూ విశ్లేషణలు మొదలుపెట్టారు. ఈ విశ్లేషణలు కొనసాగుతున్న దశలోనే సరస్వతి సిమెంట్ కంపెనీలో తన పేరిట, తన భార్య పేరిట ఉన్న షేర్లను తల్లి విజయలక్ష్మి, చెల్లి షర్మిల అక్రమంగా బదలాయించుకున్నారని ఎన్సీఎల్టీలో జగన్మోహన్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీంతో రాజశేఖర రెడ్డి కుటుంబంలో విబేధాలు రచ్చకెక్కాయి. ఈ విబేధాలకు చంద్రబాబు కారకుడు అంటూ విశ్లేషకులతోపాటు సోషల్ మీడియా ఉన్మాదులు వీడియోలు, పోస్టులు పెట్టారు. ఒకవైపు పవన్ కల్యాణ్ తన ఆవేదనను వ్యక్తం చేయడం, మరోవైపు సోషల్ మీడియా ఉన్మాదుల దాడి తీవ్రమవడంతో అదను కోసం వేచివున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మేల్కొన్నారు. తానేమిటో రుజువు చేసుకోవాల్సిన తరుణం ఆసన్నమైందని భావించారు. పోలీసు ఉన్నతాధికారులను పిలిపించుకొని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీకి చెందిన సోషల్ మీడియా ఉన్మాదులపై వేట మొదలైంది. అంతే, జగన్మోహన్‌రెడ్డి కూడా తన పాలనలో ఏం చేసిందీ మరచిపోయి నీతి వ్యాఖ్యలు వల్లెవేయాల్సిన పరిస్థితి! ప్రజాస్వామ్యంలో ప్రశ్నించకూడదా? అని ఆయన వాపోయారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎంపీ అని కూడా చూడకుండా రఘురామకృష్ణ రాజును చిత్రహింసలు పెట్టించడమే కాకుండా ఏబీఎన్, టీవీ5 చానళ్లకు చెందిన బాధ్యులపై ఏకంగా దేశద్రోహం కేసులు పెట్టించిన విషయం మరిచారు.

ఇదీ బాబు స్వభావం...

ఏ విషయంలోనైనా ఆచితూచి వ్యవహరించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజం. 'ఇనుమును కూడా నానబెడతారు' అని ఆయనపై ఛలోక్తులు వినిపిస్తుంటాయి. అయితే చంద్రబాబు అందరూ అనుకున్నంత మెతక కాదు. అలా కనిపిస్తారంతే! సమయం కోసం వేచిచూస్తారు. ఒక వ్యూహం ప్రకారం అడుగులు వేస్తారు. దీంతో ఆయనది మెతక వైఖరి అని అందరూ భావిస్తారు. అన్ని సమయాలలో ఆయన మెతక వైఖరితో ఉండరు. ఇప్పుడు తాజా పరిణామాల విషయానికి వద్దాం. సోషల్ మీడియా ఉన్మాదులు తన ఉచ్చులో చిక్కే వరకు ఆయన ఓపిక పట్టారు. తెలుగు తమ్ముళ్లు బుసకొడుతున్నా చంద్రబాబు రెచ్చిపోలేదు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను కూటమిలో చిచ్చుగా అభివర్ణించే ప్రయత్నం చేసిన వైసీపీ అనుకూల విశ్లేషకుల దిమ్మ తిరిగేలా పావులు కదిపారు. వైసీపీ అనుకూల విశ్లేషకులు ఒక్కసారిగా రెచ్చిపోయి దాడి చేయడం, అదే సమయంలో పవన్ కల్యాణ్‌లో ఆగ్రహం కట్టలు తెంచుకోవడాన్ని చంద్రబాబు తనకు అనుకూలంగా మలచుకున్నారు. అంతే, రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియా ఉన్మాదుల కోసం వేట మొదలైంది. నిజానికి చంద్రబాబు సంయమనం ప్రదర్శించి ఉండకపోతే ఉన్మాద మూకకు ఇంత త్వరగా చెక్ పెట్టే పరిస్థితి వచ్చేది కాదు. గతంలో జగన్ అధికారంలో ఉన్నప్పుడు అడపా దడపా ఎవరైనా పోస్టులు పెట్టినా తెల్లవారేసరికి వారి ఇంటి ముందు పోలీసులు ప్రత్యక్షమయ్యేవారు. ఎల్జీ పాలిమర్స్ ఉదంతంపై పోస్టును ఫార్వర్డ్ చేసిన రంగనాయకమ్మ అనే సీనియర్ సిటిజన్‌కు ఎదురైన అనుభవాన్ని ఎలా మరచిపోగలం! జగన్‌రెడ్డి అండ చూసుకొని వైసీపీ సోషల్ మీడియా ఉన్మాదులు రెచ్చిపోయారు. నీచమైన భాషను వాడారు. రాజకీయాలతో సంబంధం లేని ఇళ్లలోని ఆడవాళ్లను కూడా దారుణంగా దూషించారు. అయినప్పటికీ అప్పట్లో కూటమి నాయకులు నిస్సహాయంగా ఉండిపోవాల్సిన పరిస్థితి. ప్రభుత్వం మారిన తర్వాత సోషల్ మీడియా ఉన్మాదులు కొద్ది రోజుల పాటు గమ్మునున్నారు. గతంలో చేసిన ఘోరాలను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇక తమకు ఏమీ కాదని, చంద్రబాబు వల్ల తమకు ప్రమాదం లేదనీ భావించారు. ఈ ప్రభుత్వం తమను ఏమీ చేయదన్న ధీమాతో మరింత రెచ్చిపోవడం మొదలెట్టారు. ఆడ, మగ తేడా లేకుండా తమకు అలవాటైన ముతక భాషను ప్రయోగించారు. వైసీపీ సోషల్ మీడియా ఉన్మాద మూక వాడే భాషను గమనిస్తే, ఏ సంబంధం లేని వారికి కూడా ఆ బూతుగాళ్లను తన్నాలనిపిస్తుంది. ఇక బాధితుల మనోభావాలు ఎంత దారుణంగా దెబ్బతిని ఉంటాయో ఊహించవచ్చు. తన కూతురు కన్నీళ్లు పెట్టుకోవడాన్ని చూసి తట్టుకోలేకపోయానని పవన్ కల్యాణ్ అన్నారు. రాజకీయాలతో సంబంధంలేని మా బోటి వాళ్ల కుటుంబాలనూ దూషించారు. బూతులను యథేచ్ఛగా వాడారు. ప్రత్యర్థులనుకున్న వారందరిపైనా ఫేక్ వార్తలతో విరుచుకుపడ్డారు. ఇదే అదను కోసం ఎదురుచూస్తున్న చంద్రబాబు తనలోని మరో షేడ్‌ను ప్రదర్శించడం మొదలుపెట్టారు. పవన్ కల్యాణ్ ధర్మాగ్రహాన్ని కూటమిలో చిచ్చుగా అభివర్ణించి మురిసిపోయిన వైసీపీ అనుకూల విశ్లేషకులు నోరు వెళ్లబెట్టే పరిస్థితి వచ్చింది. ఇక సోషల్ మీడియా ఉన్మాద మూకకు చెందిన కొందరు తమను క్షమించమంటూ వేడుకుంటున్నారు.



జగన్‌తో పాటు వచ్చిన జాడ్యం

వాస్తవానికి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్ర రాజకీయాలు మారిపోయాయి. బూతులు అధికార భాషగా మారాయి. ముతక భాష మాట్లాడిన వారికే జగన్‌రెడ్డి వద్ద మార్కులు లభిస్తుండటంతో ఆ భాషను వాడటంలో నేతలు పోటీ పడ్డారు. నిండు సభలో నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. అప్పట్లో ఈ చర్యల వల్ల తమ రక్తం మరిగినా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో చంద్రబాబు అండ్ కో ఉండిపోయారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా చంద్రబాబు విలపించడాన్ని చూశాం! వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లలో వందలాది మంది సొంత మనుషులను నియమించి రాజకీయ ప్రత్యర్థులను, వారి కుటుంబాలను దూషించడానికి జగన్ వారిని ఉపయోగించుకున్నారు. స్థాయితో సంబంధం లేకుండా జగన్‌రెడ్డితో విబేధించిన వారి ఇళ్లలోని మహిళల వ్యక్తిత్వ హననానికి తెగబడ్డారు. ప్రభుత్వం మారినా ఇప్పటికీ అదే ధోరణి కొనసాగింది. రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర రెడ్డి కుటుంబానికి, జగన్‌రెడ్డికి మద్దతుగా ఉండే వారికి మాత్రమే పరువు మర్యాదలు ఉంటాయని, ఎదిరించే వారంతా బజారు మనుషులని చిత్రించే ప్రయత్నం చేశారు. ఉన్మాద మూక చర్యలు ఎంత దూరం వెళ్లాయంటే.. జగన్‌రెడ్డికి మద్దతుగా ఉన్నంత కాలం షర్మిలమ్మ, విజయమ్మ, సునీతమ్మ అని సంబోధించి.. ఇప్పుడు జగన్‌తో విబేధించగానే పేరు చివర 'అమ్మ'లు తొలగించి షర్మిల, విజయలక్ష్మి, సునీత అంటూ నిందించడం మొదలుపెట్టారు. వైఎస్ కుటుంబ సభ్యులు అయినప్పటికీ షర్మిల, సునీతల వ్యక్తిత్వ హననానికి సైతం పాల్పడ్డారు. ఇప్పుడు వైసీపీ సోషల్ మీడియా ఉన్మాద మూక కేవలం జగన్‌రెడ్డి భార్య భారతీరెడ్డిని మాత్రమే భారతమ్మ అని పిలుచుకుంటున్నారు. అంటే, భారతీ రెడ్డికి మాత్రమే పరువు మర్యాదలు ఉన్నాయి, జగన్‌రెడ్డితో విబేధించేవారు రక్త సంబంధీకులైనా వారికి పరువు మర్యాదలు ఉండవనే కదా! దివంగత రాజశేఖర రెడ్డి సతీమణి విజయలక్ష్మికి కూడా దురుద్దేశాలు ఆపాదించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చేతులు కలిపారని నిందించారు. రక్తం పంచుకు పుట్టిన వారి మన్ననలు కూడా పొందలేని జగన్‌రెడ్డి కోసం ఇంతలా బరితెగించాలా అంటే సమాధానం లభించదు.

వారించలేదెందుకు?

ప్రజా జీవితంలో కొనసాగే అర్హత ఒక్కటి కూడా లేని జగన్ రెడ్డి కోసం ఇంత మంది ఉన్మాదులు పుట్టుకురావడం ఆశ్చర్యం కలిగించక మానదు. ముఖ్యమంత్రులుగా ఎంతో మందిని చూశాం. జగన్‌రెడ్డిలా రాజకీయాలను భ్రష్టుపట్టించిన వారిని మాత్రం చూడలేదు! చూడబోము కూడా! ఇప్పుడు పోలీసులు అన్వేషిస్తున్న వర్రా రవీంద్రారెడ్డినే తీసుకుందాం. అతను జగన్ భార్య భారతీ రెడ్డికి అనధికార పీఏ అని అందరికీ తెలుసు. అతడు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ ఇళ్లలోని ఆడవాళ్లను జుగుప్సాకరంగా దూషించినా సాటి మహిళగా భారతి స్పందించకపోవడంలోని మర్మం అంతుపట్టదు. చివరకు తన ఆడపడుచు, రాజశేఖర రెడ్డి బిడ్డ షర్మిలను అతగాడు దూషించినా వారించే ప్రయత్నం చేయకపోవడం ఏమిటి? దీన్ని బట్టి రాష్ట్రంలో ఉన్మాద పోకడలను పెంచి పోషిస్తున్నది జగన్‌రెడ్డి దంపతులే అని భావించవలసి వస్తుంది. ఒకవైపు రోత మీడియాలో, మరో వైపు సోషల్ మీడియాలో తమ ప్రత్యర్థులను టార్గెట్‌గా చేసుకొని బురద చల్లిస్తున్నదీ జగన్‌రెడ్డి దంపతులు కాదా? అబద్ధాలే ఆలంబనగా రాజకీయాలు చేయడానికి అలవాటుపడిన వారు కాల క్రమంలో ఉన్మాదులుగా మారతారేమో? దీనికి మానసిక శాస్త్రవేత్తలే సమాధానం చెప్పాలి.

దారి తప్పిన 'సోషల్ మీడియా'

సోషల్ మీడియా ఉన్మాదులు అచ్చోసిన ఆంబోతుల్లా రాష్ట్రం మీద పడుతున్నారు. ఇలాంటి ఉన్మాదుల వల్ల సోషల్ మీడియా పూర్తిగా కలుషితమైంది. సోషల్ మీడియా అనేది రెండు వైపులా పదునున్న కత్తి వంటిది. దాన్ని ఎలా ఉపయోగిస్తామన్నదే కీలకం. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో సోషల్ మీడియా పోకడలు వెగటు పుట్టిస్తున్నాయి. ప్రజల మెదళ్లలో విషం నింపుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఈ పోకడలు పెరుగుతున్నాయి. మైనర్లు, అంటే పదహారేళ్లలోపు వయసు ఉన్నవారు సోషల్ మీడియా వినియోగించకుండా ఆ[illegible]యాలో నిషేధం విధించారు. సోషల్ మీడియా వాడకంలోకి వచ్చినప్పుడు సమాచార వ్యాప్తికి, మార్పిడికి దోహదపడింది. 2014 ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియాను ఉపయోగించుకొని రాజకీయంగా లబ్ధి పొందారు. ఆ తర్వాత అన్ని రాజకీయ పార్టీలు సోషల్ మీడియాను ఆశ్రయించాయి. తమ పార్టీల కార్యకలాపాల ప్రచారం కోసం, సమాచార వ్యాప్తికి ఉపయోగించుకున్నాయి. దీంతో సోషల్ మీడియా ప్రాధాన్యం పెరిగింది. యూట్యూబ్ చానల్స్ ప్రారంభమయ్యాయి. ఆరంభంలో ఆయా పార్టీల అనుకూల ప్రచారానికి మాత్రమే వాటిని వినియోగించేవారు. కాలక్రమంలో ప్రత్యర్థి పార్టీలపై బురద చల్లడానికే ఉపయోగించడం మొదలైంది. జగన్మోహన్‌రెడ్డి వంటి వారు రంగప్రవేశం చేశాక ఇళ్లలోని ఆడవాళ్లను బజారుకు ఈడ్చడం మొదలైంది. ప్రజల మెదళ్లను కలుషితం చేస్తూ వచ్చారు. పార్టీల మీద అభిమానంతో వాటికి అనుకూలంగా ప్రచారం చేయడం వేరు. ఇప్పుడా పరిస్థితులు లేవు. అనుకూల ప్రచారాన్ని మరచిపోయి ప్రత్యర్థి పార్టీలపై విష ప్రచారం చేయించడం కోసం వందలు, వేల మందిని నియమించుకొని భారీ మొత్తాలలో జీతాలు చెల్లిస్తున్నారు. ఈ పోకడల వల్ల ఆయా పార్టీల తరఫున సోషల్ మీడియా వారియర్స్‌గా పిలిపించుకుంటున్న వారి బుర్రలు కలుషితం అవడమే కాకుండా మొత్తం సమాజాన్ని కలుషితం చేస్తున్నారు. రాజకీయ పార్టీల పరిస్థితి కూడా పులి మీద స్వారీలా మారింది. అలా అని సోషల్ మీడియా వల్లనే ఆ పార్టీల జయాపజయాలు ఆధారపడి ఉంటాయా అంటే అదీ లేదు. మొదట్లో కొంత ఉపయోగపడినా ఇప్పుడా పరిస్థితి లేదు. సోషల్ మీడియాలో వస్తున్న విషయాలను ప్రజలు నమ్మడం లేదు. అందుకే సోషల్ మీడియా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయలేకపోతున్నది. పదేళ్ల క్రితంతో పోల్చితే ఇప్పుడు సోషల్ మీడియా వికృత పోకడలు పోతోంది. యూట్యూబ్ చానళ్లు కూడా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. రాజకీయ పార్టీలు వాటిని స్పాన్సర్ చేస్తున్నాయి. జర్నలిస్టులు కూడా ఏదో ఒక సంస్థలో నిలకడగా ఉద్యోగం చేసే విధానానికి స్వస్తి చెప్పి రాజకీయ పార్టీల ప్రాపకంతో యూట్యూబ్ చానళ్లు ప్రారంభిస్తున్నారు. అన్ని పార్టీలకూ ఇలాంటి చానళ్లు ఉన్నాయి. ఏ యూట్యూబ్ చానల్ ఏ పార్టీ కోసం పనిచేస్తున్నదో ప్రజలు ఇట్టే గ్రహిస్తున్నారు. ఫలితంగా వందల కోట్లు వెచ్చిస్తున్నప్పటికీ రాజకీయ పార్టీలకు సోషల్ మీడియా వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదు. కర్ణుడి చావుకు ఎన్నో కారణాలు అన్నట్టుగా సోషల్ మీడియా విశ్వసనీయత ఇటీవలి కాలంలో దారుణంగా దెబ్బతిన్నది. దీంతో ప్రజలు వాస్తవాలకోసం మెయిన్ [illegible] మీడియాపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతానికి ప్రింట్ మీడియాకు మాత్రం విశ్వసనీయత మిగిలి ఉంది. తెలుగునాట ప్రింట్ మీడియా విశ్వసనీయతకు కూడా తూట్లు పొడిచే ప్రయత్నాలు జరిగాయి. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్‌రెడ్డి కూడా సొంత మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ కూడా సొంత మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. అటు జగన్‌రెడ్డి, ఇటు కేసీఆర్ ముఖ్యమంత్రులు అయ్యారు. వారు ముఖ్యమంత్రులు కావడానికి సొంత మీడియా ఎంత ఉపయోగపడిందో తెలియదు కానీ గత ఎన్నికల్లో వారి ఓటమిని మాత్రం తప్పించలేకపోయింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాల విషయానికి వద్దాం!

అంచనా తప్పింది..

ముఖ్యమంత్రి చంద్రబాబును తక్కువ అంచనా వేసిన జగన్ రెడ్డి ఆయన ఉచ్చులో చిక్కుకున్నారు. కుటుంబంలో తలెత్తిన ఆస్తి వివాదాలు, స్వయంగా విజయలక్ష్మి రంగప్రవేశం చేసి ఆస్తుల పంపకంలో షర్మిలకు అన్యాయం జరిగిందని చెప్పడంతో జగన్ రెడ్డి అప్రతిష్ఠపాలయ్యారు. దీంతో సోషల్ మీడియాలో ఉన్మాద మూకను పర్యవసానాలు ఆలోచించకుండా ఆయన రెచ్చగొట్టారు. అదను కోసం ఎదురుచూసిన చంద్రబాబు ఇప్పుడు విశ్వరూపం ప్రదర్శిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్మాదులకోసం వేట మొదలవడంతో జగన్‌రెడ్డి నమ్ముకున్న సోషల్ మీడియా ఉన్మాద మూక కలుగుల్లో దాక్కొనే ప్రయత్నం చేస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు పోలీసులను కిరాయి సైనికులుగా మార్చుకొని ప్రత్యర్థులను వెంటాడిన జగన్‌రెడ్డి ఇప్పుడు నీతి వ్యాఖ్యలు వల్లె వేస్తున్నారు. పోలీసులను బెదిరిస్తున్నారు. సప్త సముద్రాల ఆవల ఉన్నా పట్టుకుంటానని హెచ్చరిస్తున్నారు. తాను పెంచి పోషించిన ఉన్మాద మూక హద్దులు మీరుతోందని గుర్తించడానికి ఆయన నిరాకరిస్తున్నారు. జగన్‌రెడ్డి అధికారంలో ఉండగా ఏ స్థాయిలో వేధింపులకు పాల్పడిందీ, ఇప్పుడు అధికారం పోయిన తర్వాత కూడా అచ్చోసిన ఆంబోతుల్లా విరుచుకుపడటాన్ని ప్రజలు గమనిస్తున్నారు. పోలీసులు అరెస్టు చేస్తున్న సోషల్ మీడియా ఉన్మాదుల్లో తొంభై శాతం మంది ఒకే సామాజికవర్గానికి చెందిన వారు కావడం విశేషం. రాష్ట్రంలో కులోన్మాదాన్ని కూడా జగన్ రెడ్డి ప్రజల్లోకి ఎక్కించారు. ఈ చర్య వల్ల తాము మిగతా సామాజిక వర్గాలకు దూరం అవుతున్నామని ఆ సామాజిక వర్గం ఎంత త్వరగా గుర్తిస్తే వారికి అంత మంచిది. రాజకీయాలతో మతాన్ని ముడిపెట్టకూడదు అన్నట్టుగానే కులాన్ని కూడా ముడిపెట్టకూడదు. అప్పుడే ఆంధ్రప్రదేశ్‌కు మోక్షం లభిస్తుంది.

> 'ఆంధ్రజ్యోతి'పై అసత్య ప్రచారం చేసి, నన్ను బొక్కలో వేయాలని కోరిన జగన్‌రెడ్డికి ఇప్పటికైనా వాస్తవం తెలిసి ఉండాలి. తప్పుడు ఆరోపణలు చేసినందుకు జగన్ రెడ్డి క్షమాపణలు చెబుతారా? లేక బొక్కలోకి వెళతారా? అన్నది ఆయనే తేల్చుకోవాలి.

నైతికతే మా బలం...

జగన్మోహన్ రెడ్డి విలేకరుల సమావేశం పేరిట తాజాగా విడుదల చేసిన వీడియోలో నాపైన కూడా బురద చల్లే ప్రయత్నం చేశారు. నోరు తెరిస్తే అబద్ధాలు మాత్రమే వల్లెవేసే జగన్‌రెడ్డి మా విషయంలో కూడా అలవోకగా అబద్ధం చెప్పారు. పోలీసులు అన్వేషిస్తున్న వర్రా రవీంద్రారెడ్డిని తప్పించడానికి తన భార్య భారతి కడప ఎస్పీకి ఫోన్ చేసినట్టు 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురించారని, సదరు ఫేక్ వార్త ప్రచురించినందుకు నన్ను బొక్కలో వేయాలని పోలీసులను జగన్ డిమాండ్ చేశారు. తీరా చూస్తే 'ఆంధ్రజ్యోతి'లో అటువంటి వార్త ఏదీ ప్రచురితం కాలేదు. నిత్యం అసత్యాలు, అర్ధసత్యాలతో నిండి ఉండే తన రోత మీడియా బాటలోనే 'ఆంధ్రజ్యోతి' కూడా నడుస్తోందని అనుకోవడం జగన్ రెడ్డి వెర్రితనం. నిజంగానే మేము పొరపాటు చేస్తే క్షమాపణ చెప్పే సంస్కారం మాకు ఉంది. అటువంటి సంస్కృతి ఉంటే జగన్‌రెడ్డి దంపతులు ప్రతి రోజూ రోత మీడియాలో వండి వారుస్తున్న అసత్యాలు, అర్ధసత్యాలకు క్షమాపణలు చెబుతూనే ఉండాలి. మురికి కాల్వలో దొర్లే వరాహం రోడ్డు మీద వెళుతున్న వారిని చూసి 'అదేంటీ వారికి నాలాగా మురికంటుకోలేదూ! నాలాగా ఉండకుండా శుభ్రంగా ఉండటం ఏమిటి!' అని ఆశ్చర్యపోతుందట. జగన్‌రెడ్డి వ్యవహారం కూడా అలాగే ఉంది. తాను బొక్కలో ఉండి వచ్చారు కనుక మిగతా వాళ్లందరినీ ఆ బొక్కలోకి తోయాలన్నది ఆయన కోరికలా ఉంది. 'ఆంధ్రజ్యోతి'కి విశ్వసనీయత ఉందని గర్వంగా చెప్పుకోగలం. మీ రోతమీడియాకు ఉన్న విశ్వసనీయత ఏపాటిదో తెలియదా? అందుకే కదా తాజా ఎన్నికల్లో జగన్‌ను ఓటమి నుంచి రోత మీడియా కాపాడలేకపోయింది? తప్పు జరిగినప్పుడు అంగీకరించడానికి నైతిక బలం ఉండాలి. తప్పులు చేస్తూ, అబద్ధాలు చెబుతూ జీవించడానికి అలవాటుపడిన వారు తప్పు చేశామని ఎప్పటికీ గుర్తించలేరు. 'ఆంధ్రజ్యోతి'పై అసత్య ప్రచారం చేసి, నన్ను బొక్కలో వేయాలని కోరిన జగన్‌రెడ్డికి ఇప్పటికైనా వాస్తవం తెలిసి ఉండాలి. తప్పుడు ఆరోపణలు చేసినందుకు జగన్‌రెడ్డి క్షమాపణలు చెబుతారా? లేక బొక్కలోకి వెళతారా? అన్నది ఆయనే తేల్చుకోవాలి. దెయ్యాలు వేదాలు వల్లిస్తే వినడానికి రోతగా ఉంటుంది. ఇప్పుడు జగన్‌రెడ్డి నోటి వెంట ప్రజాస్వామ్యం, విలువలు, రాక్షసత్వం, అరాచకం, పోలీసుల దుర్మార్గం... వంటి మాటలు వినపడుతుంటే రోతగానే ఉంటుంది మరి. భరించక తప్పదు!


> వైసీపీ సోషల్ మీడియా ఉన్మాద మూక వాడే భాషను గమనిస్తే, ఏ సంబంధం లేని వారికి కూడా ఆ బూతుగాళ్లను తన్నాలనిపిస్తుంది. ఇక బాధితుల మనోభావాలు ఎంత దారుణంగా దెబ్బతిని ఉంటాయో ఊహించవచ్చు. తన కూతురు కన్నీళ్లు పెట్టుకోవడాన్ని చూసి తట్టుకోలేకపోయానని పవన్ కల్యాణ్ అన్నారు. రాజకీయాలతో సంబంధంలేని మా బోటి వాళ్ల కుటుంబాలనూ దూషించారు. బూతులను యథేచ్ఛగా వాడారు. ప్రత్యర్థులనుకున్న వారందరిపైనా ఫేక్ వార్తలతో విరుచుకుపడ్డారు. ఇదే అదను కోసం ఎదురుచూస్తున్న చంద్రబాబు తనలోని మరో షేడ్‌ను ప్రదర్శించడం మొదలుపెట్టారు. పవన్ కల్యాణ్ ధర్మాగ్రహాన్ని కూటమిలో చిచ్చుగా అభివర్ణించి మురిసిపోయిన వైసీపీ అనుకూల విశ్లేషకులు నోరు వెళ్లబెట్టే పరిస్థితి వచ్చింది. ఇక సోషల్ మీడియా ఉన్మాద మూకకు చెందిన కొందరు తమను క్షమించమంటూ వేడుకుంటున్నారు.

> ఏ విషయంలోనైనా ఆచితూచి వ్యవహరించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజం. 'ఇనుమును కూడా నానబెడతారు' అని ఆయనపై ఛలోక్తులు వినిపిస్తుంటాయి. అయితే చంద్రబాబు అందరూ అనుకున్నంత మెతక కాదు. అలా కనిపిస్తారంతే! సమయం కోసం వేచిచూస్తారు. ఒక వ్యూహం ప్రకారం అడుగులు వేస్తారు. దీంతో ఆయనది మెతక వైఖరి అని అందరూ భావిస్తారు. అన్ని సమయాలలో ఆయన మెతక వైఖరితో ఉండరు. సోషల్ మీడియా ఉన్మాదులు తన ఉచ్చులో చిక్కే వరకు ఆయన ఓపిక పట్టారు. తెలుగు తమ్ముళ్లు బుసకొడుతున్నా చంద్రబాబు రెచ్చిపోలేదు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను కూటమిలో చిచ్చుగా అభివర్ణించే ప్రయత్నం చేసిన వైసీపీ అనుకూల విశ్లేషకుల దిమ్మ తిరిగేలా పావులు కదిపారు. వైసీపీ అనుకూల విశ్లేషకులు ఒక్కసారిగా రెచ్చిపోయి దాడి చేయడం, అదే సమయంలో పవన్ కల్యాణ్‌లో ఆగ్రహం కట్టలు తెంచుకోవడాన్ని చంద్రబాబు తనకు అనుకూలంగా మలచుకున్నారు. అంతే, రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియా ఉన్మాదుల కోసం వేట మొదలైంది.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

సనాతన ధర్మంలో మనుస్మృతి భాగమా?

> మనుస్మృతిలో ఉన్న కుల ఆధారిత నియమాలే మొత్తం సనాతనధర్మానికి కేంద్రమని విమర్శకులు చాలామంది తప్పుగా భావిస్తున్నారు. వాస్తవానికి, సనాతనధర్మం వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత వంటి వైవిధ్యపూరిత బోధనలను కలిగి ఉంది. ఇవి కుల వ్యవస్థ కంటే, నైతిక సూత్రాలు, వ్యక్తిగత విధులను (స్వధర్మం) గురించి ఎక్కువగా వివరించుతాయి.



సామాజిక మార్పులు, సమన్యాయం అనే కోణాల నుంచి సనాతనధర్మంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే అవి చాలావరకు హిందూ ధర్మ గ్రంథమైన మనుస్మృతిపై కేంద్రీకృతమవుతున్నాయి. హిందూ జీవన విధానంలో మనుస్మృతికి విశేష చారిత్రక ప్రాముఖ్యత ఉన్నది. సమాజంలో అంతస్తులు, కులం, కుటుంబ జీవితంలో మగ–ఆడ పాత్రల గురించి మనుధర్మం చెప్పిన విషయాలు నిశితంగా ప్రశ్నింపబడుతున్నాయి. వర్తమాన కాలంలో వాటి నైతిక అవసరాన్ని విమర్శకులు ఒప్పుకోవడం లేదు. మనుస్మృతిపై ఈ విమర్శ తరచుగా సనాతనధర్మంపై పరోక్ష విమర్శే అవుతోంది. మనుస్మృతిని, సనాతన ధర్మాన్ని ఒకటిగా చేసి సనాతనధర్మాన్ని తప్పుగా అన్వయిస్తున్నారు. మనుస్మృతిలో ఉన్న అసమానతలు సనాతనధర్మంలో భాగమని పొరబడుతున్నారు. సనాతన ధర్మాన్ని వ్యతిరేకిస్తున్నారు. మనుస్మృతిని సనాతనధర్మంతో ఎలా ముడిపెట్టారో, మారుతున్న కాలంలో ఆ అనుసంధానాన్ని, ఈనాటి యోగ్యత, విలువ, నైతిక ప్రమాణాలను బట్టి ఎందుకు పునః పరిశీలించాలో, చాలామంది వాదనలోని పస ఏమిటో అర్థం చేసుకుందాం.

సనాతన ధర్మం హిందూ ఆధ్యాత్మికతకు పునాది. శాశ్వతమైన, అందరికీ వర్తించే సూత్రాలను అది ప్రవచిస్తుంది. అవి: సత్యం, ధర్మం, అహింస, ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నంపై కేంద్రీకృతమై ఉన్నాయి. వ్యక్తిగత విముక్తి (మోక్షం) మీద దృష్టిపెట్టిన సనాతనధర్మం, నీతిమంతమైన జీవనం, ప్రపంచ సామరస్యాన్ని నొక్కి చెబుతుంది. ఒక ప్రత్యేక చరిత్ర గ్రంథమైన మనుస్మృతితో పోలిస్తే, సనాతనధర్మం కాలానుగుణంగా మారే స్వభావం కలిగిన ఒక పెద్ద ఆధ్యాత్మిక వ్యవస్థ.

వేద కాలంలోనే సామాజిక విభజనలపై ప్రాథమిక సూచనలు ఉన్నాయి. వర్ణ అనే పదం ఋగ్వేద కాలంలోనే ముందుకు వచ్చింది. ఋగ్వేదంలోని పురుషసూక్తం మంత్రంలో ఈ విషయం ప్రస్తావించబడింది. ఇది ప్రధానంగా వృత్తి ఆధారంగా ఉండేది కాని వంశ పారంపర్యం కాదు. వృత్తినిబట్టి కుల గుర్తింపు ఎక్కువగా ఉండేది. ఉపనిషత్తుల కాలంలో తాత్విక చింతన, సత్యాన్వేషణ పెరిగాయి. అదే కాలంలో సామాజిక విభజనలూ స్థిరపడటం ప్రారంభమైంది. రామాయణ కాలంలో మన సమాజంలో నాలుగు ప్రధాన వర్ణాలు స్థిరపడ్డాయి : బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు. బ్రాహ్మణులు విద్యాబోధన, వేదాధ్యయనం చేసేవారు. క్షత్రియులు రాజ్యపాలన, యుద్ధ విద్యలో నిష్ణాతులు. వైశ్యులు వాణిజ్యం, వ్యవసాయంతో జీవించేవారు. శూద్రులు ఇతర వర్ణాలకు సేవలు అందించేవారు. అయితే ఈ వ్యవస్థ సులభంగా మారే సౌలభ్యం ఉండేది. చోరుడు అయిన వాల్మీకి మహర్షిగా మారడం అందుకొక ఉదాహరణ. మహాభారత కాలంలో కూడా వర్ణ వ్యవస్థ కొనసాగినా, వ్యక్తి గుణగణాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. కర్ణుడు సూత పుత్రుడిగా పుట్టినా, అతని యోధ గుణాలను గుర్తించి, మహావీరుడిగా గౌరవించారు. ఆ కాలంలో జన్మకంటే కర్మకే ప్రాధాన్యత ఇచ్చిన సమాజం ఉండేది.

బౌద్ధ యుగంలో బుద్ధుడు కుల వ్యవస్థను తీవ్రంగా విమర్శించాడు. ఆయన దృష్టిలో మనిషి విలువ అతని జన్మతో కాదు, కర్మతో నిర్ణయించబడాలి. బౌద్ధ సంఘంలో అన్ని కులాల వారికి ప్రవేశం కల్పించారు. ఇది సమాజంలో సమానత్వ భావనను పెంపొందించింది.

సుమారు క్రీపూ. 200 నుంచి క్రీ.శ. 200 మధ్య కాలంలో విరచితమైన మనుస్మృతి 'మనుధర్మశాస్త్రం'గా సుప్రసిద్ధమయింది. మనుస్మృతి నిర్దేశించిన కుల వ్యవస్థ కఠినమైంది. ప్రతి కులానికి నిర్దిష్ట వృత్తులు, ఆచారాల నిర్ణయాలు, జన్మాధారిత కుల నిర్ణయం, వివాహ నియమాలు, సామాజిక నియంత్రణలు, అంతర్ కుల వివాహాలపై ఆంక్షలు, సామాజిక హోదా పూర్తిగా జన్మ ఆధారితంగా మారింది. ఇది పురాతన హిందూ సమాజానికి వేర్వేరు సామాజిక వర్గాల విధులు, పాలన, మంచి నడవడిక గురించి క్రోడీకరించడానికి ప్రయత్నించింది. ఇది పురాతన హిందూ సమాజాన్ని చాలా ప్రభావితం చేసింది. ఆ కాలంలో సామాజిక క్రమాన్ని నిలబెట్టడానికి కుల వ్యవస్థ, లింగ భేదం ఎలా పనిచేసిందో చూపిస్తుంది. అయితే మనుధర్మ ఆదేశాలు ముఖ్యంగా అంతస్తులు, కులం, స్త్రీ–పురుష విషయాలలో ఈనాటి సమానత్వ విలువలతో పొసగవు. అందుకే సనాతనధర్మంలో మనుస్మృతి స్థానాన్ని పునర్–వ్యాఖ్యానించాలని లేదా పూర్తిగా తిరస్కరించాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి.

మనుస్మృతిపై విమర్శలు, ముఖ్యంగా కుల కోణం నుంచి వ్యక్తమవుతున్న ఆక్షేపణలు సనాతనధర్మం పట్ల అభిప్రాయాలను ఎందుకు ప్రభావితం చేస్తున్నాయి? కాల క్రమంలో కుల వ్యవస్థ మరింత సంక్లిష్టమైంది. ప్రాంతీయ వృత్తులు, జాతి ఆధారంగా ఉపకులాలు ఏర్పడ్డాయి. కుల ఆధారిత వృత్తులు తరతరాలుగా కొనసాగాయి. అస్పృశ్యత వంటి సామాజిక దురాచారాలు బలపడ్డాయి. ప్రాచీన హిందూ సామాజిక నిర్మాణంలో మనుస్మృతి పోషించిన పాత్రను సనాతనధర్మంతో ముడిపెట్టారు. చాలా హిందూ గ్రంథాలు ఆధ్యాత్మిక, నైతిక విలువలను నొక్కి చెప్పినప్పటికీ, మనుస్మృతి చూపించిన సామాజిక ప్రభావం వల్ల హిందుత్వాన్ని కులంతో ముడిపడి ఉన్నదిగా చూస్తున్నారు. ఇదే కుల వ్యవస్థ సనాతనధర్మంలో అంతర్భాగమని భావించేందుకు దారితీస్తోంది.

ఆదిశంకర, రామానుజ, బసవ, వివేకానంద, అంబేద్కర్ వంటి సంస్కర్తలు మనుస్మృతిలోని వివక్షపూరిత అంశాలను బహిరంగంగా విమర్శించారు. అంబేద్కర్ కుల వివక్షను నిరసిస్తూ మనుస్మృతి ప్రతులను బహిరంగంగా తగలబెట్టారు. సామాజిక న్యాయం, మానవ గౌరవంపై ఆధారపడిన ధర్మం కోసం వాదించారు. సనాతనధర్మం కాలానుగుణంగా అందరి మేలుకోసం, అందరినీ కలుపుకుపోయే సమ్మిళిత విలువలతో సరిపోతుందని, మనుస్మృతి నిర్దేశించిన సామాజిక కఠినత్వాలను అధిగమించుతుందని హిందూ మత సంస్కర్తలు వాదించారు. హిందుత్వంపై అవగాహన లోపంతో నవీన విమర్శకులు చాలామంది మనుస్మృతిలో ఉన్న కుల ఆధారిత నియమాలే మొత్తం సనాతనధర్మానికి కేంద్రమని తప్పుగా భావిస్తున్నారు. వాస్తవానికి, సనాతనధర్మం వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత వంటి వైవిధ్యపూరిత బోధనలను కలిగి ఉంది. ఇవి కుల వ్యవస్థ కంటే, నైతిక సూత్రాలు, వ్యక్తిగత విధులను (స్వధర్మం) గురించి ఎక్కువగా వివరించుతాయి.

హిందూ ధర్మ సంప్రదాయానికి ఒకే అధికారిక గ్రంథం లేదు. మనుస్మృతి చారిత్రకంగా సామాజిక నిర్మాణాలను ప్రభావితం చేసినప్పటికీ, భగవద్గీత, ఉపనిషత్తుల వంటి ఇతర గ్రంథాలు ఆధ్యాత్మిక సమానత్వం, వ్యక్తిగత ఎదుగుదల గురించి నొక్కి చెబుతాయి. ఈ గ్రంథాలు ఈనాటి విలువలతో సరిపోతాయి. సామాజికంగా కఠినమైన మనుస్మృతి నియమాల కంటే సనాతనధర్మ ప్రాథమిక విలువలను అవి నొక్కి చెబుతాయి.

మనుస్మృతి మొదట్లో హిందూ సమాజాన్ని రూపొందించినప్పటికీ, దాని సామాజిక సిద్ధాంతాలు, ముఖ్యంగా కులం, స్త్రీ–పురుష సంబంధిత విషయాలు ఆధునిక నైతిక విలువలతో సరిపోవని చాలా మంది నమ్ముతున్నారు. సనాతనధర్మంలోని ప్రధాన విలువలు– సత్యం, ధర్మం, అహింస, నీతిమంతమైన జీవన విధానం మనుస్మృతి నిర్దేశాలను అధిగమిస్తాయి. సామాజిక విలువలు మారుతున్న కొద్దీ హిందూ తత్వశాస్త్రం కూడా ప్రాశస్త్యం కలిగి ఉండేలా చేస్తుంది.

మనుస్మృతిని సనాతనధర్మం నుంచి వేరుచేయవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా అంతస్తులు, కుల, లింగ వివక్షలను సనాతనధర్మం ప్రబోధించలేదని, ప్రోత్సహించదని అర్థం చేసుకోవాలి. హిందూ ధర్మానికి ప్రాతిపదికలుగా వేదాలు, ఉపనిషత్తులను మాత్రమే గుర్తించి గౌరవించాలి.

■ నాగళ్ల శివప్రసాద్



సీప్లేన్ ట్రయల్ రన్‌లో ప్రజలకు సీఎం చంద్రబాబు అభివాదం

గఘనయానం

విజయవాడ-శ్రీశైలం సీప్లేన్ ట్రయల్ రన్ సక్సెస్

- పున్నమిఘాట్ వేదికగా అద్భుత విన్యాసాలు
- ట్రయల్ రన్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ప్రకాశం బ్యారేజీ, పులిచింతల, సాగర్ నుంచి శ్రీశైలం వరకూ..
- సీఎం, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరుల ప్రయాణం
- ట్రయల్ రన్‌కు భారీగా తరలివచ్చిన పర్యాటకులు
- ప్రత్యేక ఆకర్షణగా రెయిన్‌బో రంగుల వెలుగులు



రన్‌వేలు అవసరం లేదు.. విమానాశ్రయాలు అంతకంటే అవసరం లేదు.. నీరుంటే చాలు.. నేరుగా ల్యాండ్ అయిపోతుంది.. టేకాఫ్ అవుతుంది.. ఒక జెట్టీ, వాటర్ డ్రోమ్ ఉంటే చాలు.. రివ్వున ఆకాశంలోకి ఎగిరిపోయి.. అంతే వేగంగా కిందకు దిగిపోతుంది.. పర్యాటకులను అమితంగా ఆకట్టుకునే ఈ సరికొత్త సీప్లేన్ ట్రయల్ రన్ శనివారం అద్భుతంగా జరిగింది. పున్నమిఘాట్ వేదికగా, సుందరమైన కృష్ణాతీరంలో, ప్రకృతి అందాల నడుమ అటూ ఇటూ తిరిగిన ప్లేన్ విన్యాసాలను పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. పర్యాటకంపై సీఎం చంద్రబాబు ప్రసంగం, సప్తవర్ణాలను విరజిమ్మిన బాణసంచా పేలుళ్లు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.





(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పున్నమిఘాట్ వద్ద కృష్ణాతీరంలో శనివారం సీప్లేన్ ట్రయల్ రన్ అద్భుతంగా జరిగింది. ఘాట్‌లోని వాటర్ జెట్టీ వద్ద ఉదయం 10.05 గంటలకు సీప్లేన్‌ను నిలిపి ఉంచి, జెట్టీ వెనుక భాగంలో అధికారిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, బీసీ జనార్దనరెడ్డితో పాటు ఎంపీ కేశినేని చిన్ని, స్పైస్‌జెట్ సీఎండీ అజయ్‌సింగ్, ఐఅండ్‌ఐ రాష్ట్ర, కేంద్ర అధికారులు ప్రసంగించారు. ఈ కార్యక్రమం అయిపోగానే, సందర్శకులు వీక్షించేలా టెంట్ తెరలు తొలగించారు. సరిగ్గా 12.45 గంటలకు సీప్లేన్ సర్వీసు కృష్ణానది నుంచి బయల్దేరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఇతర ఆహ్వానితులు ప్లేన్‌లోకి ఎక్కారు. ప్లేన్‌లోకి ఎక్కేముందు చంద్రబాబు అభివాదం చేయటంతో ప్రజలు హర్షధ్వానాలు చేశారు.

గ్రాండ్ వెల్కమ్

సీప్లేన్ డెమో లాంచ్‌కు భారీ ఏర్పాట్లు చేశారు. ప్రారంభ సూచికగా భవానీ ద్వీపం సమీపంలో కృష్ణా నదిపై గ్రాండ్ ఫైర్‌వర్క్స్ జరిపారు. పడవలపై పెద్ద ఎత్తున ధ్వనిచేస్తూ సప్తవర్ణాలను ఆకాశంలోకి విరజిమ్మారు.

సీప్లేన్ సాగిందిలా..

కృష్ణానదిలో తూర్పు వైపునకు కదిలిన సీప్లేన్, ఆ వెంటనే యూటర్న్ తీసుకుని భవానీ ద్వీపం చెంతకు వెళ్లింది. ద్వీపం టవర్ సమీపంగా వెళ్లి, అక్కడి నుంచి వాయువేగంతో ముందుకు దూసుకెళ్లింది. ప్రకాశం బ్యారేజీతో పాటు నాగార్జున సాగర్, పులిచింతల డ్యామ్‌ల మీదుగా శ్రీశైలం డ్యామ్ వరకు ఈ సీప్లేన్ వెళ్లింది.



కేంద్రమంత్రి రామ్మోహన్, ఎంపీ చిన్నితో చంద్రబాబు

సమస్యల సంక్షేమం

సంక్షేమ వసతి గృహాల్లో వసతులు మృగ్యం

- ఉమ్మడి కృష్ణాలో దారుణమైన పరిస్థితులు
- పెచ్చులూడుతున్న శ్లాబులు, శిథిలావస్థలో భవనాలు
- ఫ్యాన్లు, లైట్లు అరకొరగానే ఏర్పాటు
- బాత్‌రూమ్‌ల పరిస్థితి మరీ దారుణం
- విద్యార్థులకు సరిపోని భోజనాలు
- ఐదు నెలలుగా మెస్ చార్జీలు లేక అవస్థలు
- కొన్నిచోట్ల అప్పులుచేసి వడ్డిస్తున్న వార్డెన్లు
- 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెల్లడైన నిజాలు

ఆంధ్రజ్యోతి పరిశీలన

ఇరుకిరుకు గదులు.. ఎప్పుడు ఊడిపడతాయో తెలియని శ్లాబులు.. తలుపులు లేని బాత్‌రూంలు.. చలిలోనే స్నానాలు.. ఉడికీ ఉడకని భోజనాలు.. చాలీచాలని మెనూ చార్జీలు.. పేరుకే 'సంక్షేమ' వసతి గృహాలు కానీ.. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఏ వసతి గృహం చూసినా అంతా క్షామమే. చాలాచోట్ల ఒక్కో వార్డెన్ రెండు, మూడు వసతి గృహాలను పర్యవేక్షించాల్సి రావడంతో ఎవరెక్కడ పనిచేస్తున్నారో తెలియని పరిస్థితి. అటెండర్లు, వాచ్‌మెన్‌లే వార్డెన్ విధులు నిర్వర్తిస్తున్నారు. గత ఏడాది జూన్‌లో మెనూ చార్జీలు పెంచినా ఏ మూలకూ చాలకపోవడంతో వార్డెన్లు కొసరి, కొసరి ఖర్చు చేస్తున్నారు. పిల్లలు ఎంతమంది ఉన్నారు, ఎంతమందికి భోజనం సిద్ధం చేయాలనే అంశాన్నే పట్టించుకోవడం మానేశారు. విద్యార్థులు కూడా కడుపునిండా తినే పరిస్థితి ఎక్కడా లేదు. ఉమ్మడి జిల్లాలోని పలు వసతి గృహాలను 'ఆంధ్రజ్యోతి' బృందం రెండు రోజుల పాటు పరిశీలించగా, విద్యార్థుల కష్టాలెన్నో వెలుగుచూశాయి.

- ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం/విజయవాడ



కర్రీ పాయింట్ల నుంచి కూరలు

- ప్రకాష్‌నగర్ హాస్టల్‌లో విద్యార్థుల అవస్థలు

ప్రకాష్‌నగర్‌లోని సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహం నిర్వహణ తీరు అధ్వానంగా ఉంది. సుమారు 80 మంది విద్యార్థులుండగా, వరదల సమయంలో 20 మంది ఇళ్లకు వెళ్లిపోయారు. మిగిలిన 60 మంది చాలీచాలని గదుల్లోనే నిద్రపోతున్నారు. ఇక్కడ భోజనం అధ్వానంగా ఉంది. నచ్చక చాలామంది విద్యార్థులు కర్రీ పాయింట్ల నుంచి కూరలు తెచ్చుకుంటున్నారు. కొందరు విద్యార్థులు ఇంటి నుంచి గ్యాస్ స్టవ్‌లు, ఎలక్ట్రికల్ కుక్కర్లను తెచ్చుకుని వండుకుని తింటున్నారు. గదులు, వరండాలు వారం, పది రోజులకోసారి శుభ్రం చేయడం గగనమే. భవనం శిథిలావస్థకు చేరింది. హాస్టల్ వార్డెన్ కానీ, వంట మనుషులు కానీ కనిపించలేదు. కేవలం ఓ అసిస్టెంట్ ఉద్యోగి నిర్వహణలోనే హాస్టల్ నడుస్తోంది.



గుణదల గంగిరెద్దుల దిబ్బ వద్ద ఉన్న బాలుర బీసీ సంక్షేమ వసతి గృహం స్టోర్‌రూమ్‌లో నిద్రిస్తున్న విద్యార్థులు

250 మంది విద్యార్థులు.. 9 గదులు

అందులోనే వసతి, అందులోనే పాఠాలు

వలందపాలెం వసతి గృహంలో పరిస్థితి

మచిలీపట్నంలోని వలందపాలెం బీసీ గురుకుల బాలికల వసతి గృహంలో తొమ్మిది గదులున్నాయి. ఇక్కడ 5 నుంచి 10 వరకు తరగతులున్నాయి. 250 మంది బాలికలు ఉన్నారు. ఈ తొమ్మిది గదుల్లోనే 250 మంది పెట్టెలు ఉన్నాయి. తరగతులు బోధించేందుకు వేరే గదులు లేకపోవడంతో విద్యార్థినుల వసతి గృహాల్లోనే పాఠాలు చెబుతున్నారు. గదిలో నలువైపులా పెట్టెలు, దుస్తులుండగా, గది మధ్యలోని ఖాళీస్థలంలో బాలికలను కూర్చోబెట్టి టీచర్లు పాఠాలు చెబుతున్నారు. నాడు-నేడు రెండో విడతలో భాగంగా రూ.1.40 కోట్ల అంచనాతో అదనపు గదుల నిర్మాణానికి 2022లో పనులు ప్రారంభించినా ఇప్పటికీ పునాదుల దశ దాటలేదు.

- కథనాలు 6లో

దుర్గగుడిలో ఆ విభాగాలకు భలే డిమాండ్

అంతర్గత బదిలీల్లో ప్రధానాలయం, స్టోర్స్‌కే పోటీ

- అధికారులపై ఒత్తిడి.. లేదంటే సిఫారసులు
- తొలి విడతలో ఎనిమిది మందికి స్థానచలనం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో అంతర్గత బదిలీలు జరిగిన ప్రతిసారీ 'టాప్'లో ఉన్న విభాగాలకు పోటీ తీవ్రంగా ఉంటోంది. ఆయా విభాగాల్లో పోస్టింగ్‌లు దక్కించుకోవడానికి అధికారులు, సిబ్బంది విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

ఆ విభాగాలకు పోటీ ఎక్కువ

దేవస్థానంలో సుమారు 24 నుంచి 30 విభాగాల వరకు ఉన్నాయి. ఈ విభాగాల్లో కీలకమైన సీట్లలో కొందరు పాతుకుపోతున్నారు. ఇలాంటి వారిని గుర్తించి కదిపినా తర్వాత మళ్లీ వచ్చి కూర్చుంటున్నారు. ఏఈవోలను మినహాయిస్తే సూపరింటెండెంట్ల దగ్గర నుంచి రికార్డు అసిస్టెంట్ల వరకు ఉపయోగకరంగా

మిగతా 6లో..



ప్రమాదస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు తల్లీకూతురు దుర్మరణం

మృతులు సత్యనారాయణపురానికి చెందినవారు

ఇబ్రహీంపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో తల్లీకూతురు మృతిచెందారు. ఈ ప్రమాదం విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడలోని సత్యనారాయణపురానికి చెందిన కాసుల కవిత (49), ఆమె కుమార్తె హర్షిత (24) కారులో హైదరాబాద్ నుంచి విజయవాడ వస్తున్నారు. వీరు ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెం వద్దకు చేరుకోగానే, కారు వేగంగా వస్తూ ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో తల్లి కవిత అక్కడికక్కడే మృతిచెందగా, కూతురు హర్షిత విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. నందిగామకు చెందిన కారు డ్రైవర్ కొప్పురావూరి సాయికృష్ణ తీవ్రంగా గాయపడగా, ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా, హర్షితకు ఇటీవలే పెళ్లి నిశ్చయమైంది. ఈలోపు ప్రమాదం జరగడంతో సత్యనారాయణపురంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి పంపిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పోరాటాలు.. త్యాగాల ఫలం

ఉమ్మడి కృష్ణాలో 8 మందికి నామినేటెడ్ పదవులు

- సీట్లు త్యాగం చేసిన రావి, దేవదత్‌కు సముచిత గౌరవం
- వైసీపీ భౌతిక దాడులకు వెరవని పట్టాభికి కీలక బాధ్యతలు



కె.పట్టాభిరామ్



ఎస్.దేవదత్



జి.రఘురామరాజు



దూండీ రాకేశ్

పోరాటాలు.. త్యాగాలు.. విధేయతకు పట్టం కట్టారు. కూటమి పార్టీలకు సమన్యాయం చేస్తూ నామినేటెడ్ పదవులను కేటాయించారు. మన రెండు జిల్లాలకు 8 నామినేటెడ్ పదవులు లభించాయి. గత ఐదేళ్లలో టీడీపీ కోసం పోరాడిన వారికి అగ్రతాంబూలం లభించింది. పార్టీ కోసం పోరాడి, భౌతిక దాడులకు గురైన కొమ్మారెడ్డి పట్టాభి, దూండీ రాకేశ్, వీరంకి గురుమూర్తి వంటివారిని, పార్టీ గెలుపు కోసం సీట్లను త్యాగం చేసిన రావి వెంకటేశ్వరరావు, శావల దేవదత్ వంటివారిని అధిష్ఠానం గుర్తించి పదవులకు కేటాయించింది. బీజేపీకి ఒక నామినేటెడ్ పదవి దక్కింది. - (విజయవాడ-ఆంధ్రజ్యోతి)



రావి వెంకటేశ్వరరావు



వీవీ గురుమూర్తి



జి.గోపాలకృష్ణ



మట్టా ప్రసాద్

పట్టాభి పోరాటాలకు దక్కిన గౌరవం

వైసీపీ హయాంలో టీడీపీ నాయకులను తీవ్రస్థాయిలో వేధింపులకు గురిచేశారు. అలాంటి బాధితుల్లో కొమ్మారెడ్డి పట్టాభి ఒకరు. వైసీపీ సర్కార్ అక్రమాలపై బలంగా తన వాణి వినిపించిన

మిగతా 6లో..

రెండు జిల్లాల నుంచి నామినేటెడ్ పదవులు దక్కింది వీరికే..

1. ఏపీ గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా వీరంకి గురుమూర్తి (టీడీపీ-తోట్లవల్లూరు)
2. ఏపీ స్టేట్ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా గొట్టుముక్కల రఘురామరాజు (టీడీపీ-విజయవాడ)
3. ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్ (టీడీపీ-తిరువూరు)
4. ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు (టీడీపీ-గుడివాడ)
5. ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ (టీడీపీ-పామర్రు)
6. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ (టీడీపీ-విజయవాడ)
7. మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మట్టా ప్రసాద్ (బీజేపీ-మచిలీపట్నం)
8. ఏపీ ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేశ్ (టీడీపీ-విజయవాడ)



కెవ్వు కేక్

స్టార్ హోటళ్లలో కేక్ మిక్సింగ్ సందడి మొదలైంది. డిసెంబరులో జరిగే క్రిస్మస్, ఇయర్ ముగింపు వేడుకలకు అవసరమైన కేక్‌లను చెఫ్‌లు సిద్ధం చేస్తున్నారు. నగరంలోని నోవాటెల్ హోటల్‌లో శనివారం కేక్ మిక్సింగ్ కార్యక్రమం సందడిగా జరిగింది. వైన్, రకరకాల డ్రైఫ్రూట్స్‌తో కేక్ తయారీని ప్రారంభించారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

సమస్యల సంక్షేమం



ఆంధ్రజ్యోతి పరిశీలన



అంగలూరు బీసీ సంక్షేమ బాలికల కళాశాల వసతిగృహంలో స్లాబ్‌పెచ్చులు ఊడిపడుతున్న వంటగది

- ప్రభుత్వ వసతి గృహాల్లో వసతులు కరువు
- డోర్లు, నిర్వహణలేని మరుగుదొడ్లతో అవస్థలు
- పెచ్చులూడి పడుతున్న భవనాల కింద భయం భయంగా..
- అద్దె భవనాల్లో అరకొర వసతులే దిక్కు
- 'ఆంధ్రజ్యోతి' బృందం విజిట్‌తో వెలుగులోకి అనేక సమస్యలు

పేద విద్యార్థుల ఉన్నత చదువులే లక్ష్యంగా ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు కరువయ్యాయి. డోరు, నిర్వహణ లేని మరుగుదొడ్లతో అవస్థలు పడుతున్నారు. చాలీచాలని గదుల్లో పెచ్చులూడి పడుతున్న భవనాల కింద భయం భయంగా గడుపుతున్నారు. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నిధులు మంజూరు కాక మొండి పిల్లర్లు, మొండి గోడలతో వసతి గృహాల భవనాలు దర్శనమిస్తున్నాయి. 'ఆంధ్రజ్యోతి' జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన విజిట్‌లో అనేక విషయాలు వెలుగుచూశాయి.



రెడ్డిగూడెం బీసీ బాలుర వసతిగృహంలో విరిగిన కిటికీల తలుపులు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ : మచిలీపట్నం బీసీ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థినుల హాస్టల్ భవనం పునాదుల్లోనే మిగిలిపోయింది. 2019లో అప్పట్లో మంత్రిగా ఉన్న కొల్లు రవీంద్ర బీసీ విద్యార్థినులకు హాస్టల్ కమ్ స్కూల్‌ను వలందపాలెంలో ప్రారంభించారు. 240 మంది విద్యార్థులు ఉన్న ఈ స్కూల్‌లో సరైన వసతి సదుపాయాలు కల్పించక పోవడంతో పగటి పూట తరగతి గదుల్లో పాఠాలు చదువుకుంటున్నారు, రాత్రిపూట అదే తరగతి గదుల్లో నిద్రిస్తున్నారు. హాస్టల్ విద్యార్థినులకు అదనపు భవనాలు నిర్మించేందుకు గత ప్రభుత్వం ముందుకు రాలేదు. చాలీచాలని నిధులను భవన నిర్మాణాలకు మంజూరు చేశారు. దీంతో కాంట్రాక్టర్ పునాదులు నిర్మించి పనులు నిలిపివేశారు. ఎని విది గదులు నిర్మించేందుకు చాలినంత నిధులు మంజూరు చేయలేదు. దీంతో పునాదులు నిర్మించగా, మిగిలిన 20 లక్షలను అప్పటి అధికారులు హాస్టల్ భవనం రిపేర్లు, మరుగుదొడ్ల రిపేర్లకు ఆ నిధులు డైవర్ట్ చేశారు. దీంతో హాస్టల్ భవనం నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. విద్యార్థుల సమస్యలు సమస్యలుగానే ఉండిపోయాయి. పగటిపూట చదువులు, రాత్రి పూట నిద్ర ఒకే గదిలో కొనసాగించాల్సి వస్తోంది.

●అంగలూరులోని బీసీ బాలికల సంక్షేమ కళాశాల వసతిగృహంలో 40 మంది డైట్ కళాశాల విద్యార్థినులు ఉంటున్నారు. వసతి గదుల్లో స్లాబు పెచ్చులూడి వర్షం వస్తే నీరు కారుతూ ఉన్నాయి. ఎప్పుడు పెచ్చులు రాలి పడతాయోనని భయం గుప్పెట్లో విద్యార్థినులు ఉంటున్నారు. విద్యుత్ వైరింగ్‌లోకి నీరు వెళ్లి ఫ్యానులు ఎప్పటికప్పుడు కాలిపోతున్నా పట్టించుకోవడంలేదు. లైట్లు పోతే విద్యార్థినులే తెచ్చి వేసుకుంటున్నారు. బోరులో నీరు ట్యాంక్‌కు ఎక్కడానికి మోటారు సరిగా పనిచేయకపోవడంతో కుళాయి నుంచి విద్యార్థులు మోసుకెళుతున్నారు. కొన్ని బాత్రూమ్‌లకు డోరులే లేవు. ఉన్న వాటికి గడియలు లేవని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక రీడింగ్ డైనింగ్ గదుల్లో గోడలు స్లాబులో నీరు కారి నానిపోయి పాకుడు పట్టి ఎప్పుడు కూలిపోతాయో తెలియని దుస్థితిలో ఉన్నాయి. వంట గది దీ అదే దుస్థితి.

●మొవ్వ మండలంలో మొవ్వలో నాలుగు, కూచిపూడిలో రెండు మొత్తం ఆరు హాస్టళ్లు ఉండగా, సగం మంది ఇంచార్జ్ వార్డెన్ల ఆధ్వర్యంలో హాస్టల్స్ నడుస్తున్నాయి. మొవ్వ ఎస్సీ బాలుర వసతిగృహంలో శ్లాబ్ పెచ్చులూడిపోయి కిటికీలు విరిగిపోయి పైపులైన్లు పూడుకుపోయి బాత్ రూమ్‌లు సరైన వసతులు లేక అస్తవ్యస్తంగా ఉన్నాయి. మొవ్వ బీసీ వసతిగృహంలో బాత్ రూమ్‌ల తలుపులు విరిగిపోయాయి. ఫ్లోరింగ్ పగిలిపోయింది. కాంపౌండ్ వాల్ లేదు.

● పామర్రు టీకేఆర్ పాలిటెక్నికల్ కళాశాలలో నడుస్తున్న బీసీ కళాశాల బాలికల వసతిగృహంలో 84 మందికి గాను కేవలం 28 మందే ఉన్నారు. 15 మందికి సరిపడే ఆహారాన్ని 28 మందికి వడ్డిస్తున్నారు.

● చల్లపల్లిలో బీసీ బాలుర వసతిగృహం అద్దె భవనంలో కొనసాగుతోంది. మోపిదేవి మండలంలో ఎస్సీ బాలికల ప్రత్యేక వసతిగృహం, బాలుర వసతిగృహం, బీసీ బాలుర ఆశ్రమ వసతిగృహాల విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జిల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.



మచిలీపట్నం బీసీ వెల్ఫేర్ స్కూల్ కమ్ హాస్టల్‌లో విద్యార్థినుల అవస్థలు

● అవనిగడ్డ శివారు సీతాయిలంకలోని బీసీబాలుర వసతిగృహానికి కాంపౌండ్ వాల్ లేదు. అవనిగడ్డ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం 1976లో నిర్మించిన భవనంలోనే కొనసాగుతోంది. గదుల్లో పెచ్చులూడుతున్నాయి.

●తిరువూరు పట్టణంలోని పలు వసతి గృహాలు అద్దెభవనాల్లో అరకొర సౌకర్యాలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎస్సీబాలికల హాస్టల్-1లో గదులు రిపేర్లకు గురి అవ్వడంతో ఉన్న కొద్దిపాటి గదుల్లో ఉంటున్నారు. ఆవరణలో వేసిన నాపరాళ్లు పగిలిపోయాయి. బాలికల హాస్టల్-2లో ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారు. అక్కడ సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థినులు అసౌకర్యాల నడుమ వసతి పొందుతున్నారు.

● మైలవరంలో బీసీ బాలికల వసతి గృహం భవనం శ్లాబులు పెచ్చులూడి పోతున్నాయి. క్లాస్ రూమ్స్‌లో కూడా శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో విద్యార్థునులు బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్ల దీస్తున్నారు. మొత్తం 113 మంది విద్యార్థులను ఉన్నారు. మొత్తం 8 బాత్ రూమ్స్‌లో కేవలం రెండు మాత్రమే పని చేస్తున్నాయి. బీసీ బాలుర వసతి గృహంలో 150 మంది ఉన్నాయి. 59 మంది విద్యార్థులు ఉన్న ఈవసతి గృహంలో 10 బాత్ రూమ్స్ ఉన్నాయి. అయితే డోర్స్ సరిగ్గా లేవు.

● రెడ్డిగూడెంలో బీసీ బాలుర వసతిగృహంలో మొత్తం 25 మంది విద్యార్థులు ఉన్నారు. తొమ్మిది టాయిలెట్స్, తొమ్మిది బాత్ రూమ్స్ ఉన్నాయి. వీటిలో 2 మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. వాటర్ ట్యాంక్ మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉంది. బక్కెట్లతో నీళ్ల తీసుకొని వెళ్లి స్నానాలు చేయాల్సి వస్తుంది. కిటికీల తలుపులు పగిలి ఉన్నాయి.

● విస్సన్నపేట మండలంలో మొత్తం 4 వసతి గృహాలు ఉండగా వాటిలో బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థులు రాకపోవడంతో రెండేళ్ల క్రితం మూత పడింది. సోషల్ వెల్ఫేర్ బాలుర వసతిగృహంలో ప్రహరీ గోడ లేకపోవడంతో తరచూ విష కీటకాలు వస్తున్నాయని భయం వేస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. మొత్తం 18 మంది విద్యార్థులు ఉన్నారు. విస్సన్నపేట ఏఎంసీ గోదాం పక్కనే ఉన్న సోషల్ వెల్ఫేర్ బాలికల వసతిగృహానికి రక్షణ అంతంత మాత్రమే.

● వత్సవాయిలో ప్రభుత్వం సాంఘిక సంక్షేమ వసతిగృహంలో నాలుగు బాత్ రూమ్‌లకు తలుపులు లేవు. మరో నాలుగింటికి తలుపులు విరిగిపోయాయి. రెండు మాత్రమే వినియోగించుకుంటున్నారు. శానిటేషన్ సరిగ్గా లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టడం లేదు. వసతి వెనుక భాగంలో భవనం కిటికీల రెక్కలు విరిగిపోవడం వల్ల కోతులు గదుల్లోకి ప్రవేశిస్తున్నట్లు విద్యార్థులు ఆవేదన చెందారు. ఆహారం అందించడంలో వార్డెన్ శ్రద్ధ చూపడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.



జగ్గయ్యపేట ఎస్టీ హాస్టల్‌లో పనిచేయని ఆర్వోప్లాంట్



అవనిగడ్డ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో లోపల పెచ్చులూడిపోతున్న ప్రదేశం

● జగ్గయ్యపేటలో బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ప్రధాన హాస్టళ్లు ఒకే చోట ఏర్పాటు చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ జనరల్, కళాశాల ఎస్సీ విద్యార్థుల వసతి గృహాలు వసతులు, సౌకర్యాల లేమితో కునారిల్లు తున్నాయి. ఆరు మరుగుదొడ్లు, స్నానపు గదులు సెప్టిక్ ట్యాంకు కుంగిపోవటంతో పనిచేయటం లేదు. ఆరుబయటే పిల్లలు స్నానాలు చేయాల్సి వస్తుంది. కళాశాల వసతిగృహం దారుణంగా ఉంది. నాలుగేళ్లుగా వినియోగంలోలేని పాత ఎస్టీ హాస్టల్ భవనాన్ని కేటాయించారు. బాత్‌రూంలు డోర్‌లు కాని, మరుగు దొడ్లు కాని జుగుప్సాకరంగా ఉన్నాయి. పేరుకు 24 మంది చేరినా పదిమందిలోపే ఉంటున్నారు. స్నానాలు కూడా పెద్ద పిల్లలు అయి ఆరు బయట చేయాల్సి వస్తుంది. ఆర్వో ప్లాంట్ చెడిపోవటంతో మునిసి పాలిటి నీరు, బోరు నీరే తాగుతున్నారు.

●గన్నవరం మండలంలో బీసీ బాలుర జనరల్, కళాశాల, బాలికల జనరల్, కళాశాల, ఎస్సీ మూడు బాలుర, నాలుగు బాలికల వసతి గృహాలు ఉండేవి. పాలకులు వసతి గృహాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించటంతో శిథిలావస్థకు చేరాయి. గన్నవరం బీసీ వసతి గృహాన్ని పూర్తిగా మూసివేశారు. అక్కడ జనరల్, కళాశాల బాలుర విద్యార్థులు ఉండేవారు. ఆ భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులు రాలటంతో మూసివేశారు. ఎస్సీ బాలికల స్పెషల్ వసతి గృహాన్ని కూడా మూసివేయటంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎస్సీ జనరల్ హాస్టల్‌ను మూసివేసి శిథిలావస్థకు చేరిన స్పెషల్ వసతి గృహంలోనే నిర్వహిస్తున్నారు. పెచ్చులు ఎప్పుడు ఊడిపడతాయో దిక్కుతోచని స్థితిలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. ముస్తాబాద బాలికల వసతి గృహం మరుగుదొడ్ల వైపు ప్రహరి గోడ కూలి మూడేళ్లు అవుతుంది. ఆ వైపు గ్రీన్ మ్యాట్ కట్టారు. దావాజీగూడెం వసతి గృహాల్లో పరిశుభ్రత అంతంతమాత్రంగానే ఉంది. కారిడార్‌లు, రూములు శుభ్రం చేయటం లేదు. గొల్లనపల్లి బాలుర వసతి గృహంలో మరుగు దొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి.



గన్నవరం మండలం ముస్తాబాద ఎస్సీ బాలికల వసతి గృహం వద్ద కూలిన ప్రహరీ

రాష్ట్ర స్థాయి ఉత్తమ టీచర్లుగా
నలుగురు ఎంపిక
11వ తేదీన అవార్డుల అందజేత

మచిలీపట్నం,నవంబరు9(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు-2024గా ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన నలుగురు టీచర్లను ప్రభుత్వం ఎంపికచేసింది. వీరికి ఈనెల 11వతేదీన జాతీయ విద్యాదినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో జరిగే కార్యక్రమంలో అవార్డులను అందజేయనున్నారు. కృష్ణాజిల్లాకు సంబంధించి ఉయ్యూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గుడి వెంకటరమణ, పామర్రు మండలం ప్రాకర్ల ఎంపీపీఎస్ పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న రాయన శివరామప్రసాద్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి జగ్గయ్యపేట మునిసిపాలిటీలోని 20వవార్డులోని జీవీజే జెడ్పీఉన్నత పాఠశాలలో స్కూల్‌అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)గా పనిచేస్తున్న గార్లపాటి చంద్రశేఖర్, విజయవాడ జక్కంపూడిలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న కె.నెహ్రూ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోనున్నారు.

శస్త్ర చికిత్స వికటించి మహిళ మృతి

ఇబ్రహీంపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొండపల్లి మాతా నర్సింగ్ హోమ్‌లో శస్త్ర చికిత్స వికటించి చందర్లపాడు మండలం కాండ్రపాడు గ్రామానికి చెందిన దూలం మాధవి (25) అనే యువతి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతూ కొండపల్లి మాతా నర్సింగ్ హోమ్‌లో చికిత్స నిమిత్తం జాయిన్ అయ్యింది. కడుపులో కణిత వల్లే నొప్పి అని చెప్పి వైద్యుడు దేవదాస్ రెడ్డి ఆమెకు శస్త్ర చికిత్స చేశాడు. అయితే అది కాస్త వికటించడంతో ఆమెను విజయవాడలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్ష చేసిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయంపై పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేదు. ఈ విషయంపై డాక్టర్ దేవదాస్ రెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పేషెంట్ ఆపరేషన్ ట్రిస్ వల్లే మరణించింది తప్ప ఆపరేషన్ వికటించి కాదు అని చెప్పారు. తన కొడుకును కోల్పోయింది కూడా అదే కారణం చేత అని ఆయన వివరించారు.

ఇక దుర్భేద్య అమరావతి!

విజయవాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దుర్భేద్య అమరావతి దిశగా వడిగా అడుగులు పడుతున్నాయి. అమరావతి రాజధానిని శాశ్వత వరద రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు వీలుగా సీఆర్‌డీఏ కీలక నిర్ణయం తీసుకుంది.. వరద నిర్వహణ డిజైన్లకు సీఆర్‌డీఏ శనివారం ఆమోదముద్ర వేసింది. అమరావతిలో వరద నిర్వహణ పనులకు రూ. 2062 కోట్ల అంచనా వ్యయంతో డిజైన్లను ఆమోదించింది. వరద నిర్వహణ చర్యలలో భాగంగా రాజధానిలోని కొండవీడు వాగు, పాలవాగుల లోతు పెంచటంతో పాటు, వెడల్పు కూడా పెంచేందుకు వీలుగా డిజైన్లను రూపొందించటం జరిగింది. ఈ డిజైన్లను నెదర్లాండ్స్ సంస్థ ఆర్కాడిస్ రూపొందించగా.. టాటా కన్సల్టెంగ్ ఇంజనీర్లు కూడా ప్రముఖ పాత్ర పోషించారు. వరద నిర్వహణ ప్రణాళికకు సంబంధించిన సమగ్ర నివేదికను కూడా నెదర్లాండ్స్ సంస్థ అందించింది. టెక్నికల్ కమిటీ ఆమోదం కూడా దీనికి లభించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 2015 - 19 లోనే దీనికి అడుగులు పడ్డాయి. అప్పట్లో 100 సంవత్సరాల వర్షపాతాన్ని ప్రామాణికంగా తీసుకోవటం జరిగింది. ఇరవై నాలుగు గంటల వర్షపాతం 222 మిల్లీమీటర్లను పరిగణనలోకి తీసుకున్నారు. భవిష్యత్తును కూడా దృష్టిలో ఉంచుకుని ఈ విలువను చాలా ఎక్కువగానే అప్పట్లో తీసుకున్నారు. అప్పట్లోనే కొండవీటి వాగు, పాల వాగుల వెడల్పు, లోతులను పెంచి విస్తరించాలని నిర్ణయం తీసుకున్నారు. దీనికి అనుగుణంగా పంపింగ్ స్టేషన్లను కూడా ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించింది. రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు కూడా అప్పట్లో ఈ ప్రతిపాదనలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ కూడా వరద నిర్వహణ ప్రణాళికలను సమీక్షించి ఆమోదించింది. ఈ పనులు చేపట్టే క్రమంలోనే ఎన్నికలు వచ్చాయి. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతి రాజధాని విధ్వంసానికి పాల్పడింది. కిందటి ఐదేళ్ళు వైసీపీ ప్రభుత్వం అమరావతి రాజధానిని దశల వారీగా కూకటివేళ్ళతో సహా పెకిలించివేసింది. అమరావతి వరద ప్రణాళికలను అప్పుడే వైసీపీ ప్రభుత్వం అమలు చేసి ఉంటే ప్రస్తుతం ఆర్థిక భారం పడేది కాదు. ప్రస్తుత ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం చూస్తే 25 - 30 శాతం మేర పెరిగిపోయింది. దీంతో అన్ని పన్నులతో కలిపి చూస్తే రూ. 2062.78 కోట్ల వ్యయం అవుతోంది.

సమన్వయంతో పనిచేద్దాం

విజయవాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : దసరా ఉత్సవాల్లో ఎదురైన సమస్యలు ఉత్పన్నం కాకుండా సమిష్టిగా భవానీ దీక్షలను విజయవంతంగా ముగించాలని అధికారులు నిర్ణయించారు. విజయవాడ ఎంజీ రోడ్డులో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో దుర్గగుడి ఈవో రామారావు, ఈఈ కోటేశ్వరరావు తదితరులతో పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభమయ్యే భవానీ దీక్షల స్వీకరణ నుంచి డిసెంబరు 25న జరిగే దీక్షల విమరణ ఏర్పాట్లపై చర్చించారు. భవానీలు దసరా ఉత్సవాల్లో భారీగా వచ్చినందున ఈసారి దీక్షలకు అదేవిధంగా వచ్చే అవకాశాలు ఉన్నాయని భావించారు. రద్దీని ముందుగా అంచనావేసి గుర్తించడానికి డ్రోన్లను ఉపయోగిస్తామని సీపీ చెప్పారు. క్యూలైన్లు, గిరిప్రదక్షిణ, లడ్డూ కౌంటర్ల ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఆదివారం నాటికి మొత్తం పూర్తవుతాయని ఈవో రామారావు చెప్పారు. డీసీపీ గౌతమీ షాలి, ఏడీసీపీ రామకృష్ణ, ఏసీపీలు దుర్గారావు, బంగార్రాజు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసి ఏసీఏ నూతన కార్యవర్గం

విశాఖపట్నం స్పోర్ట్సు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) నూతన అపెక్స్ కార్యవర్గ సభ్యులు శనివారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), కార్యదర్శి సానా సతీష్‌బాబు, కోశాధికారి డి.శ్రీనివాస్‌లు గవర్నర్‌ను కలిసి సంఘం కార్యకలాపాలను వివరించారు. మంగళగిరిలోని క్రికెట్ స్టేడియాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకువచ్చేలా పనులు జరుగుతున్నాయని, ఇతర కార్యకలాపాల పనులను ప్రణాళికబద్ధంగా ముందుకు తీసుకువెళుతున్నామని వివరించారు.

ప్రభుత్వ విద్యావ్యవస్థను కాపాడుకుందాం
యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల ప్రారంభంలో ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు



గన్నవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడుకునేందుకు ఉపాధ్యాయులు, నిరుద్యోగ యువత సంఘటితమై ముందుకు సాగాలని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. విద్యా రంగంపై జరిగే కుట్రను ఎప్పటికప్పుడు వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. గన్నవరం రోటరీక్లబ్ ఆడిటోరియంలో షేక్ సాబ్జి వేదికపై కృష్ణాజిల్లా స్వర్ణోత్సవ మహాసభలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.కనకారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడారు. గన్నవరం ఉద్యమాల పురిటిగడ్డ అని, ఉపాధ్యాయ ఉద్యమాలను ఇక్కడ ఉర్రూతలూగించారని గుర్తుచేశారు. ప్రజా నేతలు పుచ్చలపల్లి సుందరయ్య, అట్లూరి శ్రీమన్నారాయణ స్ఫూర్తితో ఎర్రజెండా ప్రజా పోరాటాలు సాగిస్తూనే ఉందన్నారు.

దుర్గగుడిలో ఆ విభాగాలకు భలే డిమాండ్

(5వ పేజీ తరువాయి)

ఉండే సీట్లలోనే కొనసాగుతున్నారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ కొద్దిరోజుల క్రితం రాష్ట్రంలోని అన్ని దేవస్థానాలకు ప్రత్యేక ఉత్తర్వులు ఇచ్చారు. ఆయా దేవస్థానాల్లో ఉండే విభాగాల్లో ప్రతి మూడు నెలలకోకసారి అధికారులు, సిబ్బందిని అంతర్గతంగా మార్చాలని ఆదేశాలిచ్చారు. దీంతో తమకు ప్రధానాలయంలో గానీ, స్టోర్స్‌లో గానీ పోస్టింగ్ ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇక్కడ పనికాదని తెలిశాక వివిధ మార్గాల్లో సిఫార్సులు చేయిస్తున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఎందుకంత పోటీ..?

ప్రధానాలయం, స్టోర్స్ విభాగాలను ఉద్యోగులు బలంగా కోరుకోవడానికి వెనుక అనేక కారణాలు ఉన్నాయి. ఆలయానికి వచ్చే వీఐపీలు, ప్రముఖుల దర్శన, ఆశీర్వచన వ్యవహారాలను ప్రధానాలయం సిబ్బంది చూస్తారు. దీనివల్ల ప్రతిఫలంతో పాటు పరపతి పెరుగుతుంది. ఆలయ పోటులో తయారయ్యే ప్రసాదాల్లో వినియోగించే సరుకులను స్టోర్స్ విభాగం కొనుగోలు చేస్తుంది. వాటి సరఫరాను కాంట్రాక్టుకు ఇచ్చినప్పటికీ నాణ్యత లేని సరుకులను ఆయా సంస్థలు సరఫరా చేస్తాయి. ఈ విషయంలో స్టోర్స్‌లోని సిబ్బంది రాజీపడటంతో ముడుపులు బలంగా ముడతాయి.

సమూలంగా మారిస్తేనే..

ఇంద్రకీలాద్రిపై కొన్నాళ్లపాటు అంతర్గత బదిలీలకు అర్థం వేరుగా ఉండేది. బదిలీలు జరిగినట్టుగా చూపించినా ఉద్యోగులు మాత్రం అదే సీట్లలో ఉండేవారు. తర్వాత అంతర్గత బదిలీల్లో సీట్లు కదిలినప్పటికీ తిరిగి మూడు, ఆరు నెలల తర్వాత మళ్లీ పాత సీట్లలోకి వచ్చేవారు. ఇతర దేవస్థానాల నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చిన వారికి ప్రాధాన్యమైన సీట్లు దక్కకుండా, స్థానికత ఉన్న ఉద్యోగులు చక్రం తిప్పుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. అలాగే, ఇక్కడి నుంచి బదిలీ అయిన ఉద్యోగులు ఏదో ఒకలా పైరవీలు నడుపుకొని తిరిగి డిప్యూటేషన్లపై ఇంద్రకీలాద్రికి వస్తున్నారు. దీంతో వివిధ దేవస్థానాల నుంచి వచ్చిన సిబ్బంది ఇంద్రకీలాద్రిపై పనిచేయడానికి విముఖత చూపిస్తున్నారు. ముఖ్యంగా ఎస్టాబ్లిష్‌మెంట్‌లో ఉన్న సిబ్బందిపై తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి. ఉద్యోగుల సర్వీసు వ్యవహారాలకు సంబంధించిన ఫైళ్లన్నీ ఈ విభాగం నుంచే అధికారుల టేబుళ్లపైకి వెళ్తుంటాయి. కొన్ని ఫైళ్లను ఈ విభాగంలోని సిబ్బంది తొక్కిపెట్టి ఉంచుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నాడు ఈ విభాగాలను శాసించిన అధికారులకు శిష్యులుగా ఉన్నవారు ఇక్కడ పనిచేస్తుండటంతో పాతకాల పద్ధతులే నడుస్తున్నాయని కొందరు ఉద్యోగులు చెబుతున్నారు. ఫలితంగా అంతర్గత బదిలీల్లో ఉద్యోగులకు సమన్యాయం జరగడం లేదన్న భావన కొంతమందిలో ఉంది. దేవస్థానంలో పనిచేసే ప్రతి ఉద్యోగినీ మొత్తం అన్ని విభాగాలకు బదిలీ చేసినప్పుడే అందరికీ సమన్యాయం జరుగుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, శనివారం జరిగిన అంతర్గత బదిలీల్లో తొమ్మిది మందికి స్థానచలనం కలిగింది.

పోరాటాలు.. త్యాగాల ఫలం

(5వ పేజీ తరువాయి)

పట్టాభిపై అదేస్థాయిలో వైసీపీమూకలు దాడులకు దిగాయి. 2020, అక్టోబరు-2021 ఫిబ్రవరి, అక్టోబరుల్లో, 2023 ఫిబ్రవరిలో పట్టాభిపై భౌతిక దాడులు జరిగాయి. ఆయన ఇంటిపై రెండుసార్లు దాడిచేసి, ధ్వంసం చేశారు. తప్పుడు కేసులు పెట్టి 25 రోజులు ఆయన్ను రాజమండ్రి సెంట్రల్ జైల్లో నిర్బంధించారు. ఎట్టకేలకు పట్టాభి పోరాటాలను పార్టీ గుర్తించింది. ఆయన్ను కీలకమైన స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ చైర్మన్‌గా నియమించింది.

'రావి' త్యాగఫలం

గుడివాడ నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు రావి వెంకటేశ్వరరావుకు వేర్ హౌసింగ్ కార్పొరేషన్ బాధ్యతలు అప్పగించారు. ఐదేళ్లపాటు గుడివాడలో వైసీపీ నేత, అప్పటి మంత్రి కొడాలి నాని అక్రమాలు, అరాచకాలపై పోరాటాలు చేసిన రావి చివరి నిమిషంలో తన ఎమ్మెల్యే సీటును ఎన్ఆర్ఐ వెనిగండ్ల రాముకు త్యాగం చేశారు. ఆయన త్యాగానికి పార్టీ గుర్తింపునిచ్చింది.

డూండీ రాకేశ్ కష్టానికి ప్రతిఫలం

ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన డూండీ రాకేశ్ సైతం గత ఐదేళ్లలో పార్టీ కోసం కష్టపడ్డారు. ఆయనపైనా వైసీపీ మూకలు భౌతిక దాడులు చేశాయి. తప్పుడు కేసులు బనాయించాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశ్యులను ఏకంచేసి, వారిని టీడీపీ ఓటుబ్యాంకుగా మలచడంలో రాకేశ్ ఎంతో కృషి చేశారు.

గురుమూర్తికి గుర్తింపు

తోట్లవల్లూరుకు చెందిన బీసీ నాయకుడు వీరంకి గురుమూర్తి సైతం పార్టీ కోసం ఎన్నో పోరాటాలు చేశారు. టీడీపీ యువనేత లోకేశ్‌ను తోట్లవల్లూరు పోలీసుస్టేషన్‌లో నిర్బంధించినప్పుడు, చంద్రబాబు అరెస్టు సమయంలో ఆందోళనలు చేసినందుకు గురుమూర్తిపై కేసులు నమోదు చేసి, ఆయన్ను ఏ1గా ఉంచారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలతో సమావేశాలు పెట్టి, వారిని పార్టీవైపు ఆకర్షించడంలో గురుమూర్తి కృషి ఉంది. ఈయనకు గౌడ కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించింది.

రఘురామరాజు కృషితో..

బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా నియమితులైన గొట్టుముక్కల రఘురామరాజు టీఎన్‌టీయూసీలో పనిచేస్తూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన కార్మికుల సమస్యలపై పోరాటాలు చేశారు. వైసీపీ హయాంలో ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ రంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో పోరాటాలు చేసి రాష్ట్రవ్యాప్తంగా పేరు సంపాదించారు.

పార్టీ సేవలో దేవదత్

తిరువూరు నియోజకవర్గానికి చెందిన శావల దేవదత్ పార్టీ కోసం ఐదేళ్ల నియోజకవర్గంలో శ్రమించారు. ఆయనకు చివరి నిమిషంలో సీటు దక్కలేదు. కొలికపూడి శ్రీనివాసరావు కోసం ఆయన సీటును త్యాగం చేశారు.

విధేయుడిగా గోపాలకృష్ణ

నాటక అకాడమీ చైర్మన్‌గా నియమితులైన గుమ్మడి గోపాలకృష్ణ టీడీపీకి విధేయుడిగా గుర్తింపు పొందారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రాష్ట్రవ్యాప్తంగా తిరుగుతూ వైసీపీ అరాచకాలను సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఎండగడుతూ వచ్చారు. అలాగే, మచిలీపట్నానికి చెందిన బీజేపీ నేత మట్టా ప్రసాద్‌కు మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ బాధ్యతలు అప్పగించారు.

విజయవాడ తూర్పు

వరద బాధితులకు నిత్యావసర కిట్లు పంపిణీ

లబ్బీపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ శ్రీదుర్గ ఆధ్వర్యంలో గవర్నరుపేటలోని ఎల్ఐసీ కార్యాలయం ఆవరణలో శనివారం వరద బాధితులకు నిత్యావసర కిట్లను అందజేశారు. రోటరీ ఇంటర్నేషనల్ గ్రాంటు రూపంలో ఇచ్చిన లక్ష ఇరవై వేల విలువగల కిట్లను 60 కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కె.వి.శ్రీనివాసరావు, ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ కె.శివనాగేశ్వరరావు, రోటరీ జిల్లా 3020 డిస్ట్రిక్ట్ కేబినెట్ మెంబర్ రవీంద్ర, రోటరీ జిల్లా మాజీ గవర్నర్ ఎంసీ దాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యం కోసం రోజూ నడవాలి

వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ మురళీమోహన్‌రావు

పటమట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యం కోసం అందరూ నడక అలవాటు చేసుకోవాలని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ వల్లూరుపల్లి మురళీమోహన్‌రావు సూచించారు. పటమటలోని వాకర్స్ అసోసియేషన్ ఆఫ్ పటమటను శనివారం ఆయన సందర్శించారు. డబ్ల్యూఏపీ అధ్యక్షులు పరుచూరి అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో మురళీమోహన్‌రావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం వాకర్స్ ఇంటర్నేషనల్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ చిన్నం రామకృష్ణ, ఫౌండర్ ప్రెసిడెంట్ ఎంవీ రావ్, గౌరవాధ్యక్షులు వీవీ రామారావు, రావి కృష్ణారావు, కోశాధికారి చిట్టిబొమ్మ శ్రీనివాస్, తుమ్మల ధనలక్ష్మి, తోట లక్ష్మి, అనిత, శోభారాణి, వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కేంద్రం సందర్శన

గుణదల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 26వ డివిజన్ పరిధిలోని హిందీ కళాశాల ఆవరణలో ఓటర్ల నమోదు కేంద్రాన్ని శనివారం 26వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్ సందర్శించారు. ఓటరు నమోదు, చిరునామా మార్పు లేదా ఇంటి పేరు తప్పులు సరిచేసుకునే అవకాశం ఇక్కడ ఉందని చెప్పారు. ఓటరుగా నమోదు చేసుకున్న వారు రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటుహక్కును సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, శశి పాల్గొన్నారు.

సంతానలేమికి కారణాలపై సదస్సు

పటమట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సంతానలేమికి స్త్రీ, పురుషలిద్దరిలో లోపాలు కారణం కావచ్చునని ప్రముఖ ఇన్‌ఫెర్టిలిటీ డాక్టర్ సీహెచ్ సుష్మ తెలిపారు. డాక్టర్ సమరం అధ్యక్షతన శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆమె శనివారం సంతానలేమికి కారణాను వివరించారు. ఆధునిక కాలంలో సంతానలేమి సమస్య ఎక్కువగా ఉందని, కొందరిలో శారీరక సమస్యలు కారణం అయితే, మరికొందరిలో జీవనశైలి అన్నారు. వివాహమై ఏడాదైనా గర్భం దాల్చకపోతే వైద్యులను సంప్రదించాలన్నారు. డాక్టర్ మారు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆటోనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగల మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 నుంచి 10.30 వరకు ఆటోనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఏడుకొండలు తెలిపారు. గణపతిఆశ్రమం వీధి, పీ అండ్ టీ కాలనీలోని అన్ని రోడ్లు, కోనేరు బుల్లయ్య వీధి, చెన్నుపాటి అప్పారావు వీధి, గద్దెరామస్వామి వీధి, కాలేషావలి ఆసుపత్రి రోడ్డు, హిందూ కార్యాలయం వెనుక వీధి, తంగేళ్లమూడివారి వీధి, హైస్కూల్ రోడ్డు, ఆర్ఆర్ గార్డెన్, విజయనగర్ కాలనీ,రామినేనివారి వీధిలో విద్యుత్ ఉండదన్నారు.









ఆటోనగర్ అసోసియేషన్లు క్లస్టర్లుగా మారాలి

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ సూచన

వన్‌టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లోని అసోసియేషన్ల వారంతా క్లస్టర్లుగా మారాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సూచించారు. ఐలా, ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్, విజయవాడ టైర్ రీ ట్రేడర్స్, వల్కనైజింగ్ సంక్షేమ సంఘం నాయకులు గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ శివనాథ్‌ను శనివారం కలిశారు. అదనపు పన్ను భారం కలిగిస్తున్న 5, 6 నెంబర్ల జీవోలను రద్దు చేయాలని, లారీల కోసం మహానాడు రోడ్డుకు ప్రత్యామ్నాయంగా మరో రోడ్డును ఐలా నాయకులు కోరారు. బీఎస్ 6 మోడల్ వాహనాలు రావడంతో పనులు తగ్గిపోయాయని, ఆయా కంపెనీలతో మాట్లాడి సాంకేతిక పరంగా శిక్షణ ఇప్పించాలని ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఎంపీ స్పందిస్తూ సీఎస్ఆర్ నిధులను వినియోగించి లారీ కంపెనీల ద్వారా శిక్షణ ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. మహానాడురోడ్డుకు ప్రత్యామ్నాయంగా మరో రోడ్డు ఏదైనా ప్రతిపాదిస్తే అధికారులతో మాట్లాడి అభివృద్ధి చేస్తామన్నారు. ఆటో మొబైల్ రంగంలోని అసోసియేషన్ల వారంతా క్లస్టర్లుగా ఏర్పడితే సబ్సిడీలు పొందవచ్చని తెలిపారు. రానున్న కాలంలో ఆటోమొబైల్ రంగానికి మంచి భవిష్యత్తు ఉందని, అందుకు అనుగుణంగా సాంకేతికంగా అప్ గ్రేడ్ కావాల్సిన అవసరముందన్నారు. ఐలా మాజీ ఛైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, కార్యదర్శి శివనాగేశ్వరరావు, ఆయా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.


ఆటోనగర్‌లోని పలు అసోసియేషన్ల ప్రతినిధులతో మాట్లాడుతున్న విజయవాడ ఎంపీ శివనాథ్



ఎన్ఎస్ఎంలో మౌంట్ జెనిత్ క్రీడా పోటీలు ప్రారంభం


మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న వివిధ పాఠశాలల విద్యార్థులు

పటమట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పటమట ఎన్ఎస్ఎం పాఠశాలలో మౌంట్ జెనిత్ పేరిట 35వ జాతీయ స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీలు శనివారం ప్రారంభం అయ్యాయి. ఈ పోటీల్లో 30 పాఠశాలలు నుంచి 1200 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని, ఈ నెల 11 వరకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ముఖ్య అతిథులు రెవరెండ్ బ్రదర్ ఫైన్ అలెక్స్, క్లీన్‌కృష్ణా, గోదావరి కెనాల్స్ ఎండీ డాక్టర్ కిషోర్‌కుమార్‌లు జెండా ఊపి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి తదనుగుణంగా వారికి అభిరుచి ఉన్న క్రీడలపట్ల శిక్షణ అందించాలన్నారు. బ్రదర్ ఫైన్ అలెక్స్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో విద్యార్థులకు సమానమైన అవకాశాలు కల్పించాలని సూచించారు. పాఠశాల మొదటి రోజున జరిగిన అథ్లెటిక్స్ ఫలితాల్లో 1500 మీటర్ల బాలుర పరుగులో సెయింట్ గాబ్రియెల్‌స్కూల్ ఖాజీపేట (ప్రథమ), ఎస్ఎస్ఎం స్కూల్ విజయవాడ(ద్వితీయ), సెయింట్ మార్క్స్ టౌన్ హైస్కూల్ హైదరాబాద్(తృతీయ)స్థానాలు సాధించాయి. 800 మీటర్ల బాలికల విభాగంలో లిటిల్ ఫ్లవర్ స్కూల్ హైదరాబాద్(ప్రథమ), ఆల్‌సెయింట్స్ స్కూల్ హైదరా బాద్ (ద్వితీయ), మౌంట్‌ఫోర్డ్ స్కూల్ గోపాలపురం (తృతీయ స్థానం)లు వశం చేసుకున్నాయి.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాయప్పరెడ్డి, రెవరెండ్ బ్రదర్ మోంటీ, బ్రదర్ బాలారెడ్డి, పూణే ప్రావిన్స్ ప్రొవిన్షియల్ సుపీరియర్ జైకె జెర్వాసిస్, బ్రదర్ సంతోష్‌కుమార్, బ్రదర్ షాజన్ ఆంటోనీలు పాల్గొన్నారు.

మెస్సీయ ఫెలోషిప్ సేవలు అభినందనీయం: ఎమ్మెల్యే గద్దె


కుట్టుమిషన్ల పంపిణీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సంస్థ ప్రతినిధులు సజ్జా రత్నకుమార్, జ్యోతి

ఆటోనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన మహిళల్ని బలోపేతం చేసి, వారి కుటుంబా లకు అండగా నిలిచేందుకు మెస్సీయ ఫెలోషిప్ సంస్థ చేసున్న కృషి అభినందనీయమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. శనివారం ఆటోనగర్ వందడుగుల రోడ్డులోని మెస్సీయ ఫెలోషిప్‌లో కమల ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా కుట్టు విఎషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 60 మంది మహిళలకు ధ్రువపత్రాలు, 25 మంది మహిళలకు కుట్టు మిషన్లను ఎమ్మెల్యే గద్దె చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మెస్సీయ ఫెలోషిప్ సంస్థ సేవలను కొనియాడారు. వీరిని ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాలను చేసేందుకు ముందుకు రావాలని కోరారు. మెస్సీయ ఫెలోషిప్ ఛైర్మన్ సజ్జా రత్నకుమార్, కోఆర్డినేటర్ సజ్జా జ్యోతి, కుట్టుమిషన్ శిక్షకులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేకులషెడ్డు నిర్మాణానికి భూమిపూజ

కృష్ణలంక: తూర్పు పరిధి 22వ డివిజన్ కృష్ణలంక దోబీఖానా వద్ద రూ.13 లక్షల అంచనా వ్యయంతో రేకుల షెడ్డు నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోబీఖానాలో నీటి సౌకర్యం కల్పించడంతో పాటుగా దుస్తులు శుభ్రం చేసుకొనేందుకు రేకుల షెడ్డు నిర్మాణం చేస్తున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, టీడీపీ నాయకులు పి.అన్నారావు, తోట శ్రీను, నడికుప్పల శివ, కొండేటి వెంకట్రావ్, శివ, పాల్గొన్నారు.

సోషలిస్టు నాయకుడికి గద్దె పరామర్శ

ప్రభుత్వాసుపత్రి: అనారోగ్య కారణాలతో ఆయుష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సోషలిస్టు నాయకుడు, సమతా పార్టీ జాతీయ మాజీ అధ్యక్షుడు వాసిరెడ్డి కృష్ణారావును శనివారం తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

ఎస్ఆర్ఆర్‌లో ఎన్‌సీసీ శిక్షణ ప్రారంభం



గుణదల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ ఇచ్చే కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఎన్‌సీసీలో ప్రతిభకనబర్చిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని, వారికి ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా ఉంటుందని తెలిపారు. గడచిన కొద్ది కాలం నుంచి కొన్ని అవాంతరాల వల్ల కళాశాలలో ఎన్‌సీసీ శిక్షణ నిలిపివేశామని, తిరిగి నేటి నుంచి శిక్షణ కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందేందుకు 29మంది ముందుకు వచ్చారని, శిక్షణ ఇచ్చేందుకు వైమానిక దళాధికారులు సూరజ్, హరీష్‌లు వచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ కళాశాల ఎన్‌సీసీ విభాగాధిపతి డాక్టర్ ఎం.మాల్యాద్రి పాల్గొన్నారు.

సిద్ధార్థ మహిళా కళాశాలలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డే

లబ్బీపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మహిళా కళాశాలలో శనివారం కళాశాల వాణిజ్య విభాగం, మేనేజ్‌మెంట్ విభాగం, ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సంయుక్త ఆధ్వర్యంలో ఎంట్రప్రెన్యూర్‌షిప్ డే జరిగింది. ఈ సందర్భంగా ఎంట్రప్రెన్యూరియల్ ఇండియా ఎ పాషనేటింగ్ విజన్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాసా గ్రూప్ డైరెక్టర్ కొరటాల ప్రీతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుట్టుకతోనే 60శాతం ఎంటర్‌ప్రెన్యూర్‌గా పుడతారని, ప్రపంచంలో ఉన్న ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో తక్కువగా ఎంటర్‌ప్రెన్యూర్స్ ఉన్నారని, ఆ సంఖ్య పెరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ ట్రైనర్ శివస్వాతి, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మాధవి, వి.సంధ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బంధువుల ఇంటికొచ్చిన వ్యక్తి అదృశ్యం

ఆటోనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటికి వచ్చిన వ్యక్తి అదృశ్యంపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన సుబ్రహ్మణ్యేశ్వరరావు సూపర్ మార్కెట్ నడుపుతున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో విజయవాడలో ఉన్న ఇంటిని అమ్మేందుకు ఈనెల 8న నగరానికి వచ్చాడు. శుక్రవారం సాయంత్రం అయ్యప్పనగర్లోని తన తోడల్లుడు రామకృష్ణ ఇంటికి వెళ్లాడు. అందరూ కలిసి భోజనం చేసిన తర్వాత పడుకున్నాడు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో రామకృష్ణ చూడగా సుబ్రహ్మణ్యేశ్వరరావు కనపడలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. హైదరాబాద్‌లోని వారి కుటుంబ సభ్యులకు చేయగా అక్కడకు రాలేదని తెలిపారు. ఎంత వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో శనివారం మధ్యాహ్నం పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి సుబ్రహ్మణ్యేశ్వరరావు కోసం గాలిస్తున్నట్లు సీఐ పవన్ కిషోర్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 565



సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు




సభలో ప్రసంగిస్తున్న మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేశ్



సభలో ప్రసంగిస్తున్న స్పైస్ జెట్ సీఎండీ అజయ్ సింగ్ తదితరులు



సీ.. ఫ్లై.. ఫుల్ జోష్



విజయవాడ పున్నమీఘాట్ నుంచి శ్రీశైలం పాపనాశనం వరకు నిర్వహించిన సీ ప్లేన్ డెమో లాంచ్ విజయవంతమైంది. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి దుర్గేశ్ అందులో ప్రయాణించారు. పైనుంచి కృష్ణాతీరం, సహజ సంపద చూసి అబ్బురపడ్డారు. ప్రతి ఒక్కరూ ఈ నయనానందాన్ని పొందాలన్నారు.




నీటిలో టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్న సీ ప్లేన్



జ్యోతి వెలిగిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్, టికెట్ తీసుకుంటున్న సీఎం



సీ ప్లేన్‌లో ప్రయాణిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్, మంత్రి దుర్గేశ్



సీ ప్లేన్ వద్దకు వస్తున్న ఎంపీ శివనాథ్ (చిన్ని)




నీటి సంఘాలకు ఎన్నికళ

సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 13న ఓటర్ జాబితాను విడుదల చేసి 20న నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రెండుసార్లు ఎన్నికలు జరగ్గా రాష్ట్ర విభజన తరువాత చంద్రబాబు హయాంలో ఒకసారి జరిగాయి. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాలను రద్దు చేయడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో నాలుగోసారి ఈ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో రాష్ట్రంలోని రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

నాలుగోసారి ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం

- ఉమ్మడి జిల్లాలో ఎన్ఎస్ఆర్ కింద 17 డీసీలు, 106 నీటి వినియోగ సంఘాలు
- డెల్టాలో 32 డీసీలు, 220 నీటి సంఘాలు
- సిద్ధమవుతున్న ఓటర్ల జాబితా

నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు కౌంట్‌డౌన్ మొదలవుతోంది. అధికారులు ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకం కారణంగా జాబితాలను మొత్తం సవరించుకుని సరికొత్తగా తయారు చేసుకోవాల్సి వస్తోంది. నీటి సంఘాల ఎన్నికలకు ఈనెల 20న నోటిఫికేషన్ వెలువడనుంది. ముందుగా ఓటర్ల జాబితా సవరణలు, తుది ఓటర్ల జాబితా ప్రచురణ నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు 29 రోజుల షెడ్యూల్‌ను జలవనరుల శాఖ విడుదల చేసిన విషయం తెలిసిందే. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సాగునీటి సంఘాలను నిర్వీర్యం చేసింది. జలవనరుల శాఖకు అనుబంధంగా ఉండే సాగునీటి వ్యవస్థను ముక్కచెక్కలు చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో 1997లో అప్పటి సీఎం చంద్రబాబు వివిధ రాష్ట్రాల్లోని సాగునీటి వ్యవస్థలపై అధ్యయనం చేయించి ఒక చట్టాన్ని తెచ్చారు. రాష్ట్రంలో రైతుల నీటిపారుదల వ్యవస్థల యాజమాన్య చట్టాన్ని రూపొందించారు. అదే ఏడాది మొదటిసారిగా ఎన్నికలు జరిగాయి. తర్వాత 2008లో సీఎంగా ఉన్న వైఎస్ఆర్ చట్టానికి కొన్ని సవరణలు చేసి ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర విభజన తర్వాత 2015లో ఈ ఎన్నికలు జరిగాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ నీటి సంఘాలకు, ప్రాజెక్టు కమిటీలకు 6 నెలల పదవీకాలం ఉండగానే 2020లో రద్దు చేసింది. తర్వాత సాగునీటి సంఘాల ఊసు ఎత్తలేదు. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ప్రాజెక్టు కమిటీ, డిస్ట్రిబ్యూటరీ కమిటీ, నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి జలవనరుల శాఖ ప్రత్యేక అధికారులను నియమించింది. ఓటర్ల జాబితా సవరణ, ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఈనెల 13న ఓటర్ల జాబితాను విడుదల కానుంది. పొలం సాగులో ఉండి, సర్వే నంబర్, పాస్‌పుస్తకం ఉంటే ఆ రైతును ఓటరుగా పరిగణిస్తారు. ఈ పరిణామంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో భారీ, మధ్యతరహా, సూక్ష్మ నీటి పారుదల వ్యవస్థలున్నాయి. వీటన్నింటికీ త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయి.




ఇదీ స్వరూపం

భారీ నీటిపారుదల వ్యవస్థ

ఉమ్మడి కృష్ణాడెల్టాలో 7లక్షల 72వేల 538 ఎకరాల ఆయకట్టు ఉంది. లక్షా 54వేల 150 ఎకరాల ఆయకట్టు విభజిత ఏలూరు జిల్లాలో ఉంది. ఈ మొత్తం డెల్టా పరిధిలో 34 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 218 నీటి వినియోగదారు సంఘాలున్నాయి. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో 9 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 49 నీటి వినియోగదారు సంఘాలుండగా, విభజిత కృష్ణా జిల్లాలో 25 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 169 నీటి వినియోగదారు సంఘాలున్నాయి. ప్రధాన కార్యాలయం విజయవాడలో ఉంది.

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ భారీ నీటిపారుదల వ్యవస్థలోకి వస్తుంది. ఇందులో మొత్తం 2 జోన్లుంటాయి. దీని పరిధిలో 3లక్షల 62వేల ఎకరాల ఆయకట్టు ఉంది. దీనికో ప్రాజెక్టు కమిటీ, 17 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 106 నీటి వినియోగదారు సంఘాలుంటాయి. ప్రధాన కార్యాలయం నూజివీడులో ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో ఎన్టీఆర్ నాగార్జునసాగర్ ఎడమ


నాగార్జున సాగర్ ఎడమ కాల్వ

కాల్వ రెండు జోన్లుగా ఉంటుంది. జోన్-2లో జగ్గయ్యపేట, తిరువూరు, నందిగామలో సగభాగం ఉండగా, జోన్-3లో నూజివీడు, గన్నవరం, మైలవరం, నందిగామలో మరికొంత భాగం ఉన్నాయి. నీటి సంఘాలకు ఎన్నికైన సభ్యులు నీటి వినియోగ సంఘాల అధ్యక్షులను ఎన్నుకుంటారు. ఈ నీటి వినియోగ సంఘాలు డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటారు. ఈ డీసీలన్నీ కలిపి ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటాయి.

మధ్యతరహా ప్రాజెక్టు

జగ్గయ్యపేట కేంద్రంగా మున్నేరు నది ప్రాజెక్టు ఉంది. దీని పరిధిలో ఒక ప్రాజెక్టు కమిటీ, 9 నీటి వినియోగదారు సంఘాలుంటాయి. దీని కింద ఎలాంటి డిస్ట్రిబ్యూటరీ కమిటీలుండవు. ఈ ప్రాజెక్టు పరిధిలో 2,131 ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది.

సూక్ష్మ నీటిపారుదల వ్యవస్థ

ఇది 3 జిల్లాల పరిధిలో ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు ఈ కేటగిరిలోకి వస్తాయి. ఒక్కో చెరువు కింద వందెకరాల భూమి సాగులో ఉంటే దాన్ని సూక్ష్మ నీటిపారుదల వ్యవస్థలో చేర్చుతారు. ఎన్టీఆర్ జిల్లాలో 151 చెరువులుండగా, కృష్ణా జిల్లాలో 28, ఏలూరు జిల్లాలో 91 చెరువులున్నాయి. వాటి పరిధిలో మొత్తం 30వేల ఎకరాల భూమి సాగులో ఉంది. ఈ చెరువుల పరిధిలో 270 నీటి వినియోగదారుల సంఘాలున్నాయి.


మాట్లాడుతున్న యూబీఐ చీఫ్ జీఎం చందర్ మోహన్ మినోచా

ఆర్థిక వృద్ధికి చోదకశక్తులు

- ఎంఎస్ఎంఈల అభివృద్ధికి ప్రభుత్వాల చేయూత
- యూబీఐ చీఫ్ జీఎం చందర్ మోహన్ మినోచా

కృష్ణలంక, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక యూనిట్లు (ఎంఎస్ఎంఈ) దేశ ఆర్థికవృద్ధి చోదకశక్తులని, వీటి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనందిస్తున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని యూబీఐ చీఫ్ జీఎం (ముంబై) చందర్ మోహన్ మినోచా అన్నారు. కేంద్ర ప్రభుత్వ జాతీయ ఎంఎస్ఎంఈ క్లస్టర్ అవుట్‌రీచ్ కింద ఏపీ ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ భాస్కరరావు ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం శనివారం నగరంలోని ఐలాపురం కన్వెన్షన్ సెంటర్‌లో బంగారు ఆభరణాల వ్యాపారవేత్తలు ఇందులో పాల్గొన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హెచ్ఆర్ విభాగ చీఫ్ జనరల్ మేనేజర్ (ముంబై) కీలకోపన్యాసం చేస్తూ వివిధ బ్యాంకు పథకాలతో పాటు ఎంఎస్ఎంఈ యూనిట్ల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై చర్చించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ ఎ.సుధాకర్, బంగారు ఆభరణాల వర్తక సంఘం ప్రతినిధిగా విశ్వకర్మ గోల్డ్‌స్మిత్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ డి.శ్రీనివాసరావు, యూబీఐ రీజనల్ హెడ్ ఎం.శ్రీధర్, డిప్యూటీ రీజనల్ హెడ్ హరీష్ బేతా, ఎన్టీఆర్ జిల్లా ఎల్‌డీఎం కె.ప్రియాంక పాల్గొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దేశంలోని దాదాపు 195 కేంద్రాలకు చెందిన ఎంఎస్ఎంఈ వ్యవస్థాపకులతో వర్చువల్‌గా సంభాషించగా పాల్గొన్న అతిథులు వీక్షించారు.

తప్పుడు పోస్టింగులపై చర్యలు తీసుకోండి

- సీపీని కలిసిన వైసీపీ నేతలు

విజయవాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్, ఆయన కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టింగ్‌లు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ నేతలు పోలీసు కమిషనర్ రాజశేఖరబాబును కోరారు. పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, డిప్యూటీ మేయర్లు అవుతు శైలజ, బెల్లం దుర్గ తదితరులు పోలీసు కమిషనర్‌ను శనివారం సాయంత్రం కలిసి వినతిపత్రం ఇచ్చారు. తప్పుడు విషయాలతో జగన్ కుటుంబంపై పోస్టింగ్‌లు పెడుతున్నారన్నారు.

ప్రజారోగ్య పనులు అభినందనీయం

- ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



ప్రభుత్వాసుపత్రి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య కార్యక్రమా లు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఆయు ష్ ఆసుపత్రిలో వరల్డ్ ఇమ్యూనైజేషన్ డే సందర్భంగా శనివారం ఆయన వాక్సినేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గా ల ప్రజలను దృష్టిలో పెట్టుకుని వయస్సును బట్టి వ్యాధులు రాకుండా ఉండడానికి ముఖ్యంగా పుట్టబోయే శిశువుల భద్రతను దృష్టిలో ఉంచుకొని గర్భిణులకు టీకాలు అవసరమని ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఒక్క రూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎండీ డాక్టర్ కె.గోపాలకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాస్, మేనేజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.



అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న నేతలు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- మున్సిపల్ టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అఫీషియల్స్ అసోసియేషన్

గవర్నర్‌పేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేసే ఉద్యోగులు ఎదుర్కొంటున్న కేసులు, డీపీఎంఎస్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించేలా కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అఫీషియల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తెలిపారు. అసోసియేషన్ సర్వసభ సమావేశం శనివారం స్థానిక హోటల్‌లో జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో ఉద్యోగులు సమావేశానికి హాజరయ్యారు. అధ్యక్షత వహించిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నగరాల అభివృద్ధిలో ప్రణాళికా విభాగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. భవన యజమానులకు నష్టపరిహారం, టీడీఆర్ బాండ్లు అందిస్తున్నట్లు వివరించారు. క్రమశిక్షణ, నిజాయితీతో పనిచేసే ఉద్యోగులందరికీ అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. అసోసియేషన్ జోనల్ అధ్యక్షుడు వసీం బేగ్ మాట్లాడుతూ రోడ్ల విస్తరణలో కొన్నిసార్లు ఉద్యోగులు ప్రైవేట్ కేసులు కూడా ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లానింగ్ సెక్రటరీలను అసోసియేషన్‌లో సభ్యులుగా చేర్చుకోవాలని కమిటీకి సూచించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మోహన్‌బాబు, కోశాధికారి కృష్ణ, సభ్యులు రాజ్యలక్ష్మి, నేతలు పి. నాయుడు, శైలజ, సంజీవ్, రత్నకుమార్ పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామికి సహస్ర లింగార్చన

వన్‌టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలోని మల్లేశ్వరస్వామి సన్నిధిలో కార్తీకమాసం సందర్భంగా భక్తి ప్రపత్తులతో సకల జనులకు మల్లేశ్వర స్వామి అనుగ్రహప్రాప్తి కలిగి సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని సంకల్పం చెబుతూ వివిధ అర్చన అభిషేకాలను నిర్వహిస్తున్నారు. శనివారం అర్చకులు సహస్రలింగార్చన చేశారు. అభిషేకాదులు, బిల్వపత్ర పూజ నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా ప్రతిరోజూ ఆకాశదీప దర్శనం ఉంటుంది. ఈ క్రమంలో శనివారం ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపాన్ని ధ్వజారోహణం చేసే ముందు అర్చకులు శుభసంకల్పం చెప్పారు.


సహస్రలింగార్చన నిర్వహిస్తున్న అర్చకస్వాములు



కళావేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

హృద్యంగా సాగిన నృత్యప్రదర్శన

దుర్గగుడి కళావేదికపై విజయవాడకు చెందిన కూచిపూడి నృత్య అకాడమీ వారిచే నృత్య ప్రదర్శన హృద్యంగా సాగింది. రత్తయ్య శర్మ శిష్యురాలు కొండవీటి శ్రీదేవి ఆధ్వర్యంలోని 15 మంది కళాకారుల బృందం పలు కీర్తనలకు నాట్యం చేశారు. సోలో భరతనాట్యంలో కోరపాటి అనిత కాళికాదేవిగా నాట్యం చేసి అలరించారు. ఈవో రామారావు బృందాన్ని అభినందించారు. ప్రసాదం, చిత్రపటం, సర్టిఫికెట్లు అందజేశారు. చెరువు ఆదినారాయణ రంగస్థల యాంకర్‌గా వ్యవహరించారు. డిప్యూటీ ఈవో రత్నరాజు పాల్గొన్నారు.


నిత్యాన్నదానానికి రూ 5 లక్షల విరాళం

దుర్గగుడిలో నిత్యాన్నదానానికి హైదరాబాద్ కోకాపేటకు చెందిన తుమ్మల శ్రీనివాస్ సంపత్ శనివారం ఆలయానికి విచ్చేసి రూ.5 లక్షల విరాళం అందజేశారు. శ్రీనివాస్ సంపత్, దుర్గ పేరిట అన్నవితరణ చేసేందుకు ఈవో రామారావును కలిసి చెక్కు రూపంలో విరాళమిచ్చారు. డిప్యూటీ ఈవో రత్నరాజు, దేవదాయశాఖ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి వివేక్ పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానంతరం దాతకు ఆశీర్వచనం, ప్రసాదం, శేషవస్త్రం, దుర్గమ్మ చిత్రపటం అందజేశారు.

జూన్ 2025 నాటికి విమానాశ్రయం కొత్త టెర్మినల్

- పౌర విమానయాన శాఖ అధికారులకు టార్గెట్ నిర్దేశించిన సీఎం చంద్రబాబు నాయుడు
- ఉండవల్లిలోని తన నివాసంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, అధికారులతో చర్చలు
- సమావేశంలో పాల్గొన్న ఐఅండ్ఐ మంత్రి బీసీ జనార్ధన రెడ్డి
- డిజైన్లపై సీఎం అసంతృప్తి.. కూచిపూడి, సంస్కృతి ప్రతిబింబించేలా ఉండాలని సూచన

విజయవాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో శాశ్వత ప్రాతిపదికన నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్‌ను 2025 జూన్ నాటికి ఎట్టి పరిస్థితులలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. శనివారం ఉండవల్లిలోని తన నివాసంలో ఎయిర్‌పోర్టు విస్తరణ పనులపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ఐఅండ్ఐ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి, పౌర విమానయాన శాఖ అధికారులు, రాష్ట్ర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనులపై విమానయాన శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. రూ.611 కోట్ల వ్యయంతో చేపడుతున్న న్యూ ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనులు ప్రస్తుతం 58.50 శాతం మేర పూర్తయినట్టు వివరించారు. నూతన ఏటీసీ టవర్‌ను రూ. 85కోట్లతో నిర్మిస్తున్నామని, ఇప్పటికి 52శాతం మేర పనులు పూర్తయినట్టు వివరించారు. ఇదే సందర్భంలో డిజైన్లపై చర్చ నడిచింది. అమరావతి శైలి, కూచిపూడి నాట్యరీతులు ఇతర స్థానిక సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా తుది డిజైన్లను అప్పటి టీడీపీ ప్రభుత్వం ఓకే చేసింది. మళ్లీ దీనిపై ఏమైందో కానీ డిజైన్లపై చర్చ జరిగింది. డిజైన్లలో ఏమైనా మార్పు జరిగిందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సీఎం చంద్రబాబు మాత్రం విమానాశ్రయ నూతన టెర్మినల్ బిల్డింగ్ కూచిపూడితో పాటు సంస్కృతి ప్రతిబింబించేలా ఉండాలని సూచించారు. హస్తకళల ప్రతి రూపాలు ఇంటీరియర్ పనులలో కల్పించాలని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా మరో 5 చోట్ల ఎయిర్ స్ట్రిప్స్ తేవాలన్న ఆలోచనలో ఉన్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ అధికారులకు సీఎం చంద్రబాబు చెప్పారు. మూలపేట, కుప్పం, దగదర్తి, తాడేపల్లిగూడెంతో పాటు అనంతపురం - తాడిపత్రి మధ్యలోనూ ఒక ఎయిర్‌స్ట్రిప్‌ను తీసుకు వచ్చే ఆలోచనలో ఉన్నామని, రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా తగిన సహకారం కావాలని పౌర విమానయాన శాఖ అధికారులకు చెప్పారు.


డిజైన్లు పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

రైస్ పుల్లింగ్ పేరుతో మోసం

- మహిళ నుంచి రూ. 15 లక్షల నగదు, 94 గ్రాముల బంగారం వసూలు
- నలుగురిపై కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైస్ పుల్లింగ్ పేరుతో ఓ మహిళను మోసగించిన నలుగురు వ్యక్తులపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. గొల్లపూడి ప్రాంతానికి చెందిన సూరిశెట్టి సౌజన్య ఐదేళ్ల క్రితం భర్త చనిపోవడంతో ఒంటరిగా ఉంటుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న సౌజన్య వద్ద నగరానికి చెందిన షేక్ ఆసీఫ్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో కొంతకాలం క్రితం పురాతన విగ్రహాలు వస్తువులు తనకు తెలిసిన వారి వద్ద ఉన్నాయని వాటిని రైస్‌పుల్లింగ్ పరీక్షలు చేసి ఇతర దేశాలకు అవిస్తే రూ.కోట్ల ఆదాయం వస్తుందని ఆసీఫ్ నమ్మబలికాడు. అతడి మాయ మాటలకు సౌజన్య రైస్‌పుల్లింగ్‌పై ఆసక్తి చూపించింది. ఇదే అదునుగా భావించిన ఆసీఫ్ అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన కె.రమేష్‌కుమార్, మహంకాళి యశ్వంత్, మహంకాళి భార్గవ్ ముగ్గురు వ్యక్తులను పరిచయం చేశాడు. పురాతన వస్తువులకు రైస్‌పుల్లింగ్ పరీక్షలు చేశామని అనుకూల ఫలితాలు వచ్చాయని అందుకు డబ్బులు ఖర్చవుతాయని సౌజన్యను నమ్మబలికి ఆమె నుంచి దఫదఫాలుగా రూ.15 లక్షలు నగదు, 93 గ్రాముల బంగారపు ఆభరణాలు వసూలు చేశారు. ఎంతకూ ఆదాయాన్ని చూపించకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఏడు నగరాల్లో ఈవెంట్స్

అల్లు అర్జున్, రశ్మిక కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న 'పుష్ప ద రూల్' చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ యర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్నారు. వచ్చే నెల5న ప్రపంచ వ్యాప్తంగా 12 వేల స్ర్కీన్లలో భారీ ఎత్తున విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమా ప్రమోషనల్ ఈవెంట్స్‌ను ఇండియాలోని ఏడు మేజర్ సిటీస్.. పాట్నా, కొలకతా, చెన్నై, కొచ్చి, బెంగళూరు, ముంబై, హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు నిర్మాతలు చెప్పారు.

గద్దలకొండ గణేశ్‌లా గుర్తుండిపోతుంది

వరుణ్‌తేజ్



"గద్దల కొండ గణేశ్ చిత్రం విడుదలయ్యాక జనాలు నన్ను 'వరుణ్' అని కాకుండా 'గణేశ్' అనే పిలిచారు. నటుడిగా నాకది పెద్ద ప్రశంస. పాత్ర పేరుతో మనల్ని పిలిస్తే నటుడిగా వచ్చే సంతృప్తే వేరు. ఒక నటుడికి అంతకంటే ఆనందం మరొకటి ఉండదు. ఇప్పుడు 'మట్కా' చిత్రంలో నేను పోషించిన వాసు పాత్ర కూడా ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది' అని వరుణ్‌తేజ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా కరుణకుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'మట్కా'. ఈ నెల 14న 'మట్కా' చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా వరుణ్‌తేజ్ మీడియాతో ముచ్చటించారు.

● బర్మా నుంచి వైజాగ్‌కు శరణార్థిగా వచ్చిన వాసు అనే అబ్బాయి కథే మట్కా. 1958 నుంచి 1982 వరకూ మట్కా సామ్రాజ్యంలో అతను అంచెలంచెలుగా ఎదిగిన తీరును సినిమాలో ఆసక్తికరంగా చూపించబోతున్నాం.

● కరుణకుమార్ మంచి విజన్ ఉన్న దర్శకుడు. ఈ సినిమాతో ఆయనకు ఇంకా మంచి పేరు వస్తుంది. ముంబైకి చెందిన రతన్ ఖత్రీ జీవితం ఆధారంగా కరుణకుమార్ ఈ కథ రాసుకున్నారు. మన నేటివిటీకి తగ్గట్టు కథలో, హీరో పాత్రలో మార్పులు చేశాడు. ఆయనతో నా పాత్ర గురించి తరచూ చర్చించేవాణ్ణి. చాలా సార్లు స్ర్కిప్ట్ చదివాను. వాసు ఎలా కూర్చుంటాడు, ఎలా నడుస్తాడు, ఎలా సిగరెట్ కాలుస్తాడు అనేదానిపై ఒక అంచనాకు వచ్చా.

● వాసు లాంటి పాత్ర పోషించడం నటుడిగా నాకు సవాల్ వి సిరింది. ఇందులో నాలుగు గెటప్స్‌లో కనిపిస్తాను. ఓల్డ్ క్యారెక్టర్ కోసం ఏఐ రిఫరెన్స్ తీసుకున్నాం.

ధూం ధాంగా అలరిస్తోంది

చేతన్ కృష్ణ




చేతన్ కృష్ణ, హెబ్బాపటేల్ జంటగా నటించిన 'ధూం ధాం' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా శనివారం చిత్ర బృందం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. చేతన్ కృష్ణ మాట్లాడుతూ 'ప్రేక్షకులు సినిమా చాలా బావుంది అని మెచ్చుకుంటున్నారు. థియేటర్స్ హౌస్‌ఫుల్ అవ్వడం సంతోషాన్నిస్తోంది. మా సినిమా ధూం ధాంగా ప్రేక్షకులను అలరిస్తోంది' అని చెప్పారు. దర్శకుడు సాయికిశోర్ మచ్చా మాట్లాడుతూ "ధూం ధాం' సినిమా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అంటున్నారు. ప్రతి సెంటర్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. వెన్నెల కిశోర్, బెనర్జీ పాత్రలు ప్రేక్షకులకు బాగా నచ్చాయి' అన్నారు. నిర్మాత ఎం.ఎస్ రామ్‌కుమార్ మాట్లాడుతూ 'పెద్ద సినిమాల మధ్య 'ధూం ధాం'లాంటి చిన్న సినిమా నిలదొక్కుకోవడమే గొప్ప విషయం. అలాంటిది మా సినిమా మంచి వసూళ్లను రాబడుతోంది. కుటుంబ ప్రేక్షకులు మా సినిమాను బాగా ఆస్వాదిస్తున్నారు' అని తెలిపారు.



శంకర్‌తో పనిచేయడం అదృష్టం

రామ్ చరణ్

హీరో రామ్ చరణ్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'గేమ్ ఛేంజర్'. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో జనవరి 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శనివారం లక్నోలో మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామ్ చరణ్ మాట్లాడుతూ 'ఈ రోజు డైరెక్టర్ శంకర్‌ని వి ఎస్ అవుతున్నాం. ఆయన మూవీ ఫైనల్ పనుల్లో బిజీగా ఉన్నారు. ఆయనతో కలిసి పనిచేయడం నా అదృష్టం. ఇండియాలో లక్నో చాలా పెద్ద నగరం. ఇక్కడ మనుషుల మనసులు కూడా చాలా పెద్దవి. మా గత చిత్రాన్ని పెద్ద మనసుతో ఆదరించారు. ఈ రోజు ఇక్కడ టీజర్ లాంచ్ జరగడం ఆనందంగా ఉంది' అని అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ' శంకర్‌తో పని చేయాలని ఎప్పటి నుంచో అనుకున్నాను. పైగా అది రామ్ చరణ్‌తో అవ్వడం మరింత ఆనందంగా ఉంది' అని అన్నారు. ఎస్‌జె సూర్య, అంజలి, కియారా అద్వానీ మాట్లాడుతూ సంక్రాంతికి వస్తున్న ఈ సినిమాను ఆదరించారించాలని ప్రేక్షకులను కోరారు.













బిజినెస్

అరబిందో ఫార్మా లాభం రూ.817 కోట్లు


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అరబిందో ఫార్మా.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.7,796 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.817 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 8 శాతం (రూ.7,219 కోట్లు), లాభం 8.6 శాతం (రూ.752 కోట్లు) వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో అమెరికా వ్యాపారం 4.3 శాతం వృద్ధితో రూ.3,530 కోట్లకు చేరుకుంది. కంపెనీ మొత్తం వ్యాపారంలో అమెరికా వాటా 45.3 శాతంగా ఉంది. యూరప్ ఫార్ములేషన్స్ వ్యాపారం కూడా 19 శాతం వృద్ధితో రూ.2,105 కోట్లకు చేరుకుంది. ఈ కాలంలో ఆర్ అండ్ డీపై కంపెనీ రూ.410 కోట్లు వెచ్చించింది.

పరమేశు బయోటెక్ రూ.600 కోట్ల ఐపీఓ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్‌లోని దేవరపల్లి కేంద్రంగా పనిచేసే పరమేశు బయోటెక్ రూ.600 కోట్ల నిధుల సమీకరణ కోసం త్వరలో పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. ఈ మేరకు సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఇష్యూలో భాగంగా రూ.520 కోట్ల మొత్తానికి కొత్తగా ఈక్విటీ షేర్లు జారీ చేయనుండగా మిగతా రూ.80 కోట్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా సమీకరించనుంది. ఐపీఓ ద్వారా సమీకరించే నిధులతో మధ్యప్రదేశ్‌లో రూ.330 కోట్లతో కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. అలాగే మరో రూ.85 కోట్లను రుణాల చెల్లింపు సహా సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం వినియోగించనుంది.

బ్యాండ్, బాజా, బరాత్..!

- డిసెంబరులోగా రూ.4.25 లక్షల కోట్ల వ్యాపారం
- వచ్చే యాభై రోజుల్లో 35 లక్షల పెళ్లిళ్లు
- సీఏఐటీ, ప్రభుదాస్ లీలాధర్ నివేదిక వెల్లడి



దేశవ్యాప్తంగా పెళ్లిళ్ల సీజన్ మొదలైంది. దేశంలోని వ్యాపారాలకూ ఈ సీజన్ మరింత జోష్ ఇస్తోంది. ఈ నవంబరు-డిసెంబరు మధ్య కాలంలో దేశవ్యాప్తంగా దాదాపు 35 లక్షల పెళ్లిళ్లు జరగబోతున్నట్టు అఖిల భారత వ్యాపారుల సమాఖ్య (సీఏఐటీ) అంచనా వేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది మూడు లక్షలు ఎక్కువ. ఈ బ్యాండ్ బాజాల కోసం వధూవరుల తల్లిదండ్రులు ఎంత లేదన్నా ఈ రెండు నెలల్లో రూ.4.25 లక్షల కోట్లు ఖర్చు చేస్తారని ప్రభుదాస్ లీలాదర్ అనే బ్రోకరేజీ సంస్థ వెల్లడించింది. ఇందుకు సంబంధించి 'బ్యాండ్, బాజా, బరాత్ అండ్ మార్కెట్స్' పేరుతో ఒక నివేదిక విడుదల చేసింది.

ఏటా రూ.10.96 లక్షల కోట్ల ఖర్చు

మన దేశంలో ఏటా దాదాపు కోటి జంటలు వివాహ బంధంతో ఒకటవుతుంటాయి. ఈ సంఖ్య ఏటా 7 నుంచి 8 శాతం చొప్పున పెరుగుతోంది. దేశంలో పెళ్లిళ్ల ఖర్చులు ఏటా ఎంత లేదన్నా 13,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.10.96 లక్షల కోట్లు) వరకు ఉంటాయని అంచనా. టర్నోవర్‌పరంగా చెప్పాలంటే వెడ్డింగ్ పరిశ్రమ మన దేశంలో నాలుగో పెద్ద పరిశ్రమ. ఈ ఏడాది జనవరి 15 నుంచి జూలై 15 వరకు దేశవ్యాప్తంగా దాదాపు 42 లక్షల పెళ్లిళ్లు నమోదయ్యాయి. ఇందుకోసం వధూవరుల తల్లిదండ్రులు రూ.5.5 లక్షల కోట్ల వరకు ఖర్చు చేసి ఉంటారని సీఏఐటీ అంచనా. మరోవైపు కేంద్ర బడ్జెట్‌లో పసిడిపై దిగుమతి సుంకాన్ని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించడంతో ఖర్చులు మరింత పెరిగాయి.

డెస్టినేషన్ వెడ్డింగ్‌కు గిరాకీ

గతంలో పెళ్లిళ్లు అన్నీ వధూవరుల ఇంట్లో లేదా దగ్గరలోని కల్యాణ మండపాల్లో జరిగేవి. ఇప్పుడు ఈ ట్రెండ్ మారిపోతోంది. ఆర్థిక స్థోమతను బట్టి రాజస్థాన్ లేదా గోవా ఇందుకు వేదికలవుతున్నాయి. సెలబ్రిటీలైతే విదేశాల్లో తమ పిల్లల పెళ్లిళ్లు ధూమ్‌ధామ్‌గా చేస్తున్నారు. దీంతో కనీసం పిల్లల పెళ్లిళ్లు అయినా మన దేశంలో చేయండని ప్రధాని మోదీ ఇటీవల సెలబ్రిటీలకు విజ్ఞప్తి చేయాల్సి వచ్చింది. మరోవైపు ఈ మధ్య కాలంలో వెడ్డింగ్ ప్లానర్లకూ గిరాకీ పెరిగింది. బంధుమిత్రులకు టిక్కెట్ల బుకింగ్, విడిది సదుపాయల నుంచి కల్యాణ మండపాల అలంకరణ, వధూవరుల మేకప్ వరకు అన్నీ వీరే చూసుకుంటారు.

స్టాక్ మార్కెట్‌పై ప్రభావం

దసరా, దీపావళి వంటి పండగల సీజన్‌తో పాటు పెళ్లిళ్ల సీజన్‌లో మన దేశంలో వినియోగం తారాస్థాయికి చేరుకుంటుంది. ఈ సమయంలో రిటైల్, ఆతిథ్య రంగం, ఆటోమొబైల్ కంపెనీలు మరింత బిజినెస్ చేస్తుంటాయి. ఈ ప్రభావం స్టాక్ మార్కెట్‌నూ ప్రభావితం చేస్తుంది. మెట్రో సిటీల్లో వినియోగం తగ్గడంతో అనేక ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్లు ప్రస్తుతం నేలచూపులు చూస్తున్నాయి. కనీసం ఈ పెళ్లిళ్ల సీజన్ అయినా కలిసొస్తుందని ఈ కంపెనీలు గంపెడాశలు పెట్టుకున్నాయి.

ఫ్రెషర్స్ నైపుణ్యాలపై జీసీసీల దృష్టి

గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాలు (జీసీసీ) నియామకాల జోరు పెంచాయి.ముఖ్యంగా కృత్రిమ మేధ(ఏఐ),మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), డేటా సైన్స్‌పై పట్టున్న ఫ్రెషర్ల కోసం ఈ కంపెనీలు ప్రత్యేక దృష్టి పెట్టాయి. ఈ రంగాలపై పట్టున్న ఫ్రెషర్లు దొరికితే ఐటీ, ఐటీఈఎస్ కంపెనీల కంటే అధిక జీతాలు ఇచ్చి మరీ ఆఫర్ లెటర్లు ఇస్తున్నాయి. ఈ ప్యాకేజీ ఎంత లేదన్నా ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలతో పోలిస్తే 30% వరకు ఎక్కువగా ఉన్నట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఇలాంటి నైపుణ్యాల్లో విద్యార్థులకు చక్కటి శిక్షణ ఇస్తున్న ఇంజనీరింగ్ కాలేజీలు, బిజినెస్ స్కూల్స్, జనరల్ డిగ్రీలు ఆఫర్ చేసే కాలేజీలకు జీసీసీలు క్యూ కడుతున్నాయి.

కిమ్స్ హాస్పిటల్స్ ఆదాయం రూ.782 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్).. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.782 కోట్ల రెవెన్యూపై రూ.121 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో రెవెన్యూ 655 కోట్లు ఉండగా లాభం రూ.101 కోట్లుగా ఉంది. సెప్టెంబరు త్రైమాసికంలో మహారాష్ట్రలోని నాసిక్ హాస్పిటల్ అందుబాటులోకి రాగా కేరళలోని కన్నూర్‌లో తొలి హాస్పిటల్‌ను ప్రారంభించినట్లు కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ బీ భాస్కర్ రావు తెలిపారు. అందరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావటంపై ప్రధానంగా దృష్టి సారించామని, అందుకు తగ్గట్టుగానే తాము ముందుకు సాగుతున్నట్లు ఆయన వివరించారు.

గుంటూరులోనూ కిమ్స్: ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులోకి కిమ్స్ హాస్పిటల్స్ అడుగుపెడుతోంది. గుంటూరుకి చెందిన ఇన్‌సిగ్నియా హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా హాస్పిటల్ కార్యకలాపాలు, మేనేజ్‌మెంట్ బాధ్యతలను కిమ్స్ చేపట్టనుంది. కిమ్స్ శిఖర పేరుతో ఈ హాస్పిటల్‌ను నిర్వహించనుంది. ఇన్‌సిగ్నియా 150 పడకలతో ఈ హాస్పిటల్‌ను నిర్వహిస్తోంది. ఈ హాస్పిటల్‌ను 200 పడకలకు విస్తరించే అవకాశం ఉందని తెలిపింది.

దివీస్ లాభంలో 46% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దివీస్ లేబొరేటరీస్.. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.510 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.348 కోట్లు)తో పోల్చితే లాభం 46.5 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా రూ.1,995 కోట్ల నుంచి రూ.2,444 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో ఫారెక్స్ లాభాలు రూ.11 కోట్ల నుంచి రూ.29 కోట్లకు పెరిగాయని పేర్కొంది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన కంపెనీ రూ.2,407 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.518 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. సెప్టెంబరుతో ముగిసిన ప్రథమార్థానికి గాను కంపెనీ రూ.4,640 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.940 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

జీఎస్‌టీలో ఫారమ్ డీఆర్‌సీ-03ఏ అంటే..?



ఇదీ GST

రాంబాబు గొండాల

మహిమ ఇండస్ట్రీస్ తయారీ రంగంలో ఉన్న కంపెనీ. కొన్ని ఉల్లంఘనలకు సంబంధించి సదరు కంపెనీకి డిపార్ట్‌మెంట్ ఒక నోటీస్ ఇవ్వటం జరిగింది. దీని ఆధారంగా రూ.లక్షకు గాను ఆర్డర్ జారీ చేశారు. దీంతోపాటుగా వడ్డీ, పెనాల్టీ కట్టాల్సిందిగా అదే ఆర్డర్‌లో ఇవ్వటం జరిగింది. ఇప్పుడు మహిమ ఇండస్ట్రీస్ ముందు రెండు దారులు ఉన్నాయి. ఒకటి ఆర్డర్‌లో ఉన్న మొత్తం ప్రభుత్వానికి చెల్లించటం కాగా, రెండోది ఆ ఆర్డర్‌ను సవాల్ చేస్తూ అప్పీల్ దాఖలు చేయటం. అయితే, కంపెనీ ఆడిటర్ సలహా మేరకు అప్పీల్ చేయకుండా ఆర్డర్‌లో మొత్తాన్ని డీఆర్‌సీ-03 ద్వారా చెల్లించింది. కొంతకాలం తర్వాత జీఎస్‌టీ పోర్టల్ (కామన్ పోర్టల్)లో చూస్తే ఇంకా రూ.లక్ష.. వడ్డీ, జరిమానాతో సహా బాకీ ఉన్నట్లుగా తన లయబిలిటీ లెడ్జర్‌లో కనబడింది. తాము చెల్లించాల్సిన మొత్తం చెల్లించిన తర్వాత కూడా ఇంకా బకాయి ఉండటం ఏమిటి?

ఇది అర్థం చేసుకోవటానికి ముందుగా అసలు డీఆర్‌సీ-03 అంటే ఏమిటి? దీన్ని ఎప్పుడు ఉపయోగించాలి? వివరాలు మీకోసం. ఒక పన్ను చెల్లింపుదారుడు, తాను చెల్లించాల్సిన పన్నును ఎప్పటికప్పుడు రిటర్న్ దాఖలు చేయటం ద్వారా చేయాలి. ఇది అందరికీ తెలిసిందే. అలాకాకుండా, తాను అప్పటి వరకు కట్టాల్సిన దాని కంటే తక్కువ కట్టినట్లు భావిస్తే ఆ తేడా మొత్తాన్ని డీఆర్‌సీ-03 ద్వారా చెల్లించాలి. ఉదాహరణకు ఒక వ్యక్తి 18 శాతం పన్ను కట్టాల్సి ఉండగా అవగాహనా లోపంతో లేదా ఏదేనీ కారణంతో తక్కువ పన్ను అంటే 12 శాతమో, 5 శాతమో కట్టారనుకుందాం. ఈ తేడాను కొంతకాలం తర్వాత తమంతట తామో లేదా డిపార్ట్‌మెంట్ ఆడిట్ లేదా స్క్రూటినీ ద్వారా తెలిసినప్పుడు ఆ మొత్తాన్ని డీఆర్‌సీ-03 చెల్లించాలి. అంటే రిటర్న్‌లో చూపిన మొత్తాన్ని కాకుండా ప్రభుత్వానికి అదనంగా చెల్లించాల్సింది ఏమైనా ఉంటే ఆ మొత్తాన్ని డీఆర్‌సీ-03 ద్వారా కట్టాల్సి ఉంటుంది.

అయితే, నోటీస్ ఇచ్చి ఆర్డర్ ద్వారా డిమాండ్ చేసిన మొత్తం ఏమైనా ఉంటే డీఆర్‌సీ-03 ద్వారా కాకుండా కామన్ పోర్టల్‌లో సంబంధిత డిమాండ్ దగ్గర క్లిక్ చేసి అందులోని సూచనల మేరకు చెల్లించాలి. అప్పుడు మాత్రమే ఆ బకాయి మొత్తం చెల్లించినట్లుగా పరిగణించి సిస్టమ్ పెండింగ్ బకాయిని సున్నాగా చూపిస్తుంది. ఇక్కడ మహిమ ఇండస్ట్రీస్ చేసిన పొరపాటు ఏమిటంటే.. కామన్ పోర్టల్‌లో బకాయి సెక్షన్‌లోకి వెళ్లి చెల్లించే బదులుగా డీఆర్‌సీ-03 ద్వారా పన్ను చెల్లించారు. దీనివల్ల సిస్టమ్‌లో ఆ మేరకు సర్దుబాటు జరగలేదు. దీన్ని సరిదిద్దటానికి అధికారుల దగ్గర కూడా ఎలాంటి అవకాశం లేదు. ఈ ఇబ్బంది ఒక్క మహిమ ఇండస్ట్రీస్‌కు మాత్రమే కాదు. చాలా మంది పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొంటున్నారు. ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇటీవల డీఆర్‌సీ-03ఏ ఫారమ్ ప్రవేశపెట్టింది.

ఈ డీఆర్‌సీ-03ఏ అనేది ఇప్పటి వరకు తాము డీఆర్‌సీ-03 ద్వారా చెల్లించిన మొత్తాన్ని పెండింగ్ బకాయితో సర్దుబాటు చేసుకోవటానికి ఉపయోగపడుతుంది. ఈ విధంగా సర్దుబాటు చేయటానికి తొలుత కామన్ పోర్టల్‌లోకి లాగిన్ అయ్యి వరుసగా 'సర్వీసెస్', 'యూజర్ సర్వీసెస్', 'మై అప్లికేషన్స్', ఫారమ్ జీఎస్‌టీ డీఆర్‌సీ-03ఏ క్లిక్ చేసి తాము ఏ డీఆర్‌సీ-03 ద్వారా పన్ను చెల్లించారో దాని వివరాలు.. సర్దుబాటు చేయాల్సిన వివరాలు, సర్దుబాటు చేయాల్సిన మొత్తం తదితర వివరాలు దాఖలు చేయటం ద్వారా ఇంతకుముందు డీఆర్‌సీ-03తో చెల్లించిన మొత్తాన్ని సర్దుబాటు చేయవచ్చు. అయితే ఇక్కడ కింది విషయాలు గుర్తు పెట్టుకోవాలి.

ఒక్క డీఆర్‌సీ-03 ద్వారా చెల్లించిన మొత్తాన్ని ఒకటి కంటే ఎక్కువ ఆర్డర్స్‌కు లేదా ఒకటి కంటే ఎక్కువ డీఆర్‌సీ-03 లను ఒక్క ఆర్డర్‌కు వాడవచ్చు. అయితే ప్రతి డీఆర్‌సీ-03కి ఒక్కొక్క డీఆర్‌సీ-03ఏ వాడాలి. ఆర్డర్‌లోని బకాయి కోసం కాకుండా వేరే నిమిత్తం చెల్లించిన డీఆర్‌సీ-03లోని మొత్తాన్ని ఆర్డర్‌లోని బకాయి కోసం ఉపయోగించకూడదు. అంటే, ఉదాహరణకు ఆడిట్ జరిగే సమయంలో ఒక వ్యక్తి రూ.2 లక్షలు పన్ను తక్కువ కట్టినట్లుగా గుర్తించారనుకుందాం. ఆడిట్ జరిగే సమయంలోనే సదరు వ్యక్తి రూ.లక్ష డీఆర్‌సీ-03 ద్వారా చెల్లించాడు. ఆ మొత్తాన్ని ఆర్డర్‌లో సర్దుబాటు చేసి మిగతా రూ.లక్షకు ఆర్డర్ ఇచ్చారనుకుందాం. ఇప్పుడు మొదట చెల్లించిన రూ.లక్షను బకాయి ఉన్న రూ.లక్షకు సర్దుబాటు చేయకూడదు. ఎందుకంటే రూ.లక్ష.. అధికారులే సర్దుబాటు చేసి ఆర్డర్ ఇచ్చారు కాబట్టి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,360 ▼	72,750 ▼	1,03,000 ▲
ముంబై	77,382 ▲	70,882 ▲	91,130 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

10వ తేదీ			
హైదరాబాద్	555	విజయవాడ	565
వరంగల్	557	గోదావరి	560
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	115
వరంగల్	110	గుంటూరు	115
కరీంనగర్	110	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	100
కర్నూలు	110	నెల్లూరు	100
విశాఖపట్నం	111	అనంతపురం	100
గోదావరి	115		

స్పోర్ట్స్

పంకజ్ @ 28

భారత స్టార్‌దే ప్రపంచ బిలియర్డ్స్ టైటిల్



న్యూఢిల్లీ: ప్రపంచ టైటిళ్లను అలవోకగా నెగ్గడం అలవాటుగా మార్చుకున్న భారత స్టార్ క్యూయిస్ట్ పంకజ్ అద్వానీ ఖాతాలో మరో ట్రోఫీ. ఇప్పటికే అత్యధిక టైటిళ్లతో అందనంత ఎత్తులో నిలిచిన పంకజ్.. మరోసారి ప్రపంచ చాంపియన్‌గా అవతరించాడు. శనివారం దోహా వేదికగా జరిగిన ఐబీఎస్ఎఫ్ ప్రపంచ బిలియర్డ్స్ చాంపియన్‌షిప్ ఫైనల్లో పంకజ్ 4-2తో ఇంగ్లండ్ ఆటగాడు రాబర్ట్ హాల్‌ను చిత్తుచేశాడు. బెంగళూరుకు చెందిన 39 ఏళ్ల పంకజ్‌కు ఇది రికార్డుస్థాయిలో 28వ ప్రపంచ టైటిల్ కావడం విశేషం. కాగా, అతనికిది వరుసగా ఇది ఏడో టైటిల్. ఓవరాల్‌గా బిలియర్డ్స్‌లో 19వ సారి ప్రపంచ విజేతగా నిలిచిన పంకజ్.. మరో తొమ్మిది టైటిళ్లను ప్రపంచ స్నూకర్ విభాగంలో సాధించాడు.

హర్మన్, శ్రీజేష్‌కు ఎఫ్ఐహెచ్ స్టార్ అవార్డులు





లసాన్నె (స్విట్జర్లాండ్): భారత హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మాజీ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్ అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) స్టార్ అవార్డులను గెలుచుకున్నారు. ఈ ఏడాదికిగాను ఉత్తమ ఆటగాడిగా హర్మన్‌ప్రీత్, ఉత్తమ గోల్‌కీపర్‌గా శ్రీజేష్ నిలిచారు. హర్మన్‌ప్రీత్, శ్రీజేష్.. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ కాంస్య పతకం నెగ్గడంలో కీలకపాత్ర పోషించారు. ఆ విశ్వక్రీడల్లో హర్మన్ ఏకంగా పది గోల్స్ సాధించాడు. ఇక టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన జట్టులోనూ సభ్యుడైన శ్రీజేష్.. పారిస్ క్రీడల తర్వాత హాకీకి రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

దిగ్గజంతో జతకట్టిన నీరజ్

కొత్త కోచ్‌గా యాన్ జెలెన్నీ




న్యూఢిల్లీ: స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా కొత్త కోచ్‌తో జత కట్టాడు. చెక్ రిపబ్లిక్‌కు చెందిన మూడుసార్లు ఒలింపిక్ చాంపియన్, ప్రపంచ రికార్డు గ్రహీత అయిన 58 ఏళ్ల యాన్ జెలెన్నీ నీరజ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. ఇన్నాళ్లూ నీరజ్‌తో పనిచేసిన క్లాస్ బర్తోనీజ్ (జర్మనీ) కుటుంబ కారణాల రీత్యా కోచ్ పదవి నుంచి ఇటీవలే వైదొలగిన సంగతి తెలిసిందే. క్లాస్ హయాంలోనే నీరజ్ ఒలింపిక్స్‌లో స్వర్ణం, రజతం, ప్రపంచ చాంపియన్‌షిప్‌తో పాటు అనేక టైటిళ్లు నెగ్గాడు. 1992, 1996, 2000 ఒలింపిక్స్‌లో స్వర్ణాలు గెలిచిన జెలెన్నీ.. 1993, 1995, 2001లో ప్రపంచ చాంపియన్‌గా నిలిచాడు. అంతేకాదు.. ఈటెను 98.48 మీటర్ల దూరం విసిరి అప్పట్లో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు.

పాక్‌కు వెళ్లేది లేదు!

చాంపియన్స్ ట్రోఫీపై బీసీసీఐ

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు భారత జట్టు పాకిస్థాన్‌కు వెళ్లడం కుదరదని బీసీసీఐ తేల్చిచెప్పింది. ఈమేరకు తమ నిర్ణయాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి తెలిపినట్టు ఈఎస్‌పీఎన్ వెబ్‌సైట్ వెల్లడించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు ఈ మెగా టోర్నీ పాక్‌లోని మూడు వేదికల్లో జరుగుతుంది. పాక్‌లో పర్యటించేందుకు భారత ప్రభుత్వం నుంచి తమకు అనుమతి లభించలేదని బోర్డు పేర్కొంది. దీంతో ఐసీసీ, పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సిందే. దీని ప్రకారం హైబ్రిడ్ పద్ధతిన టీమిండియా ఆడే మ్యాచ్‌లను యూఏఈకి తరలించే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. మరోవైపు హైబ్రిడ్ పద్ధతికి తాము వ్యతిరేకమని శుక్రవారమే పీసీబీ చైర్మన్ మొహిసిన్ నక్వీ పేర్కొనడం గమనార్హం.

రెండో స్థానానికి టైటాన్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) తాజా సీజన్‌లో తెలుగు టైటాన్స్ వరుసగా నాలుగో విజయాన్ని ఖాతాలో వేసుకొని పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది. సొంతగడ్డపై జరిగిన ఆఖరి మ్యాచ్‌లో టైటాన్స్ టేబుల్ టాపర్ పుణెరి పల్టాన్స్‌కు షాకిచ్చింది. శనివారం ఇక్కడ జరిగిన ఈ పోరులో టైటాన్స్ 34-33తో డిఫెండింగ్ చాంపియన్ పుణెరి పల్టాన్స్‌పై నెగ్గింది. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 40-29తో బెంగళూరు బుల్స్‌పై గెలిచింది. ఇక, ఈ సీజన్ రెండో అంచె పోటీలు ఆదివారం నుంచి నోయిడాలో జరగనున్నాయి.

అర్జున్, హారిక గేమ్‌లు డ్రా

చెన్నై: తెలుగు జీఎం ఇరిగేసి అర్జున్ చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో రెండో డ్రాను నమోదు చేశాడు. శనివారం జరిగిన ఐదో రౌండ్‌లో పర్హామ్ మగ్సూద్లు (ఇరాన్)తో తలపడిన అర్జున్ 44వ ఎత్తు తర్వాత డ్రాకు అంగీకరించాడు. ప్రస్తుతం అర్జున్ 4 పాయింట్లతో టాప్‌లో నిలవగా, లెవాన్ 3.5 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఇక, చెన్నై గ్రాండ్‌మాస్టర్ చాలెంజర్స్ ఐదో రౌండ్‌లో వైశాలితో గేమ్‌ను ద్రోణవల్లి హారిక డ్రాగా ముగించింది. టోర్నీలో ప్రణవ్ (4.5 పాయింట్లు) టాప్‌లో ఉండగా, హారిక (1) ఆఖరి స్థానంలో నిలిచింది.

ఆదుకున్న భరత్, విహారి

ఉత్తరాఖండ్‌తో ఆంధ్ర రంజీ డ్రా

విజయనగరం (ఆంధ్రజ్యోతి): కేఎస్ భరత్ (90 బంతుల్లో 92), హనుమ విహారి (189 బంతుల్లో 66) అద్భుత ఇన్నింగ్స్‌తో ఆంధ్ర జట్టు ఉత్తరాఖండ్‌తో రంజీ మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. 321 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆంధ్ర విజయానికి 35 పరుగుల దూరంలో నిలిచిపోయింది. నాలుగో రోజైన శనివారం ఓవర్‌నైట్ స్కోరు 8/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు ఆట ఆఖరికి 93 ఓవర్లలో 6 వికెట్లకు 286 పరుగులు చేసింది. భరత్, విహారి, కర్ణ్ షిండే అర్ధ శతకాలతో ఆదుకున్నారు. ఒకవైపు విహారి ఆచితూచి ఆడుతుంటే మరోవైపు భరత్ బౌండ్రీలతో చెలరేగాడు. ఈ జోడీ ఐదో వికెట్‌కు 136 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఆంధ్ర విజయంపై ఆశలు కల్పించింది. విజయానికి సరిగ్గా 45 రన్స్ కావాల్సిన తరుణంలో తొలుత విహారి, మరో ఆరు పరుగుల తేడాలో భరత్‌ను అవుట్ చేసి ఉత్తరాఖండ్ దెబ్బ కొట్టింది. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన ఆధిక్యంతో ఉత్తరాఖండ్‌కు 3 పాయింట్లు, ఆంధ్రకు ఒక పాయింట్ లభించాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ 338, ఆంధ్ర 146కు ఆలౌటయ్యాయి. రెండో ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ 128/9కి డిక్లేర్ చేసింది.

ఆసీస్ 'ఏ' క్లీన్‌స్వీప్

భారత్ 'ఏ'కు మరో ఓటమి
జురెల్ పోరాటం వృథా



కోన్‌స్టాస్ (73 నాటౌట్)

మెల్‌బోర్న్: ధ్రువ్ జురెల్ (68) వరుసగా రెండో అర్ధసెంచరీతో రాణించినా.. భారత్ 'ఏ'కు ఓటమి తప్పలేదు. శనివారం ముగిసిన రెండో అనధికార టెస్టులో ఆస్ట్రేలియా 'ఏ' 4 వికెట్ల తేడాతో గెలిచింది. అలాగే సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. 168 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆతిథ్య జట్టు 47.5 ఓవర్లలో 169/4 స్కోరుతో నెగ్గింది. కోన్‌స్టాస్ (73 నాటౌట్), వెబ్‌స్టర్ (46 నాటౌట్) రాణించారు. అంతకుముందు భారత్ 'ఏ' 73/5 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించగా జురెల్ అద్భుత పోరాటం ప్రదర్శించాడు. నితీశ్ (38)తో కలిసి ఆరో వికెట్‌కు 94 పరుగులు సమకూర్చాడు. కోటియన్ (44), ప్రసిద్ధ్ (29) పర్వాలేదనిపించగా.. తమ రెండో ఇన్నింగ్స్‌ను 229 పరుగుల వద్ద ముగించింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 161, ఆసీస్ 223 రన్స్ చేశాయి.

• సెమీస్‌లో కిరణ్‌కు నిరాశ

ఇక్సాన్ సిటీ (కొరియా): భారత యువ షట్లర్ కిరణ్ జార్జ్ కొరియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఫైనల్‌కు చేరడంలో విఫలమయ్యాడు. శనివారం జరిగిన సెమీఫైనల్లో కిరణ్ 12-21, 20-22తో టాప్‌సీడ్, ప్రపంచ ఐదో ర్యాంకర్ కున్లావత్ వితిడ్‌సార్న్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలయ్యాడు.

• రిత్విక్ జోడీ పోరు ముగిసె

న్యూఢిల్లీ: తెలుగు టెన్నిస్ ఆటగాడు రిత్విక్ చౌదరికి మోసెలె ఓపెన్‌లో నిరాశ ఎదురైంది. ఫ్రాన్స్‌లోని మెట్జ్ సిటీలో శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీస్‌లో రిత్విక్-ఫ్రాన్సిస్కో కాబ్రెల్ (పోర్చుగల్) జోడీ 3-6, 6-7 (4-7)తో ఫ్రాన్స్ జంట అల్బానో ఒలివెట్టి-హెర్‌బర్ట్ చేతిలో ఓటమి పాలైంది.

టాప్ లేపాల్సిందే..

టాపార్డర్ ఫామ్‌పై ఆందోళన

ఓపెనర్ శాంసన్‌పై అధిక భారం

మరో విజయంపై భారత్ దృష్టి
నేడు దక్షిణాఫ్రికాతో రెండో టీ20



రాత్రి 7.30 నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో

గెబెహా: నాలుగు టీ20ల సిరీస్‌ను ఘనంగా ఆరంభించిన టీమిండియా మరో విజయంపై దృష్టి సారించింది. శాంసన్ మెరుపు శతకానికి తోడు స్పిన్నర్ల మాయతో జట్టు తొలి టీ20లో 61 పరుగుల తేడాతో భారీ విజయాన్నందుకుంది. తాజాగా ఆదివారం దక్షిణాఫ్రికాతో జరిగే రెండో మ్యాచ్‌లోనూ అదే జోరును కొనసాగించాలనుకుంటోంది. అయితే గతేడాది ఇక్కడ జరిగిన ఏకైక టీ20లో భారత్ 5 వికెట్ల తేడాతో ఓడింది. ఇక జట్టు బ్యాటింగ్ ఆశించిన మేర ఆకట్టుకోలేకపోతోంది. శాంసన్ మినహా మరే బ్యాటర్ కూడా దర్బన్‌లో ప్రభావం చూపలేదు. తను మాత్రమే అలవోకగా భారీ సిక్సర్లతో పరుగుల వరద పారించాడు. ముఖ్యంగా టాపార్డర్‌లో నిలకడలేమిపై టీమ్ మేనేజ్‌మెంట్ ఆందోళనగా ఉంది. ఓపెనర్ అభిషేక్ శర్మ అవకాశాలను సద్వినియోగం చేసుకోలేక వరుసగా స్వల్ప స్కోర్లకే వెనుదిరుగుతున్నాడు. జింబాబ్వేపై శతకం తర్వాత వరుసగా ఏడు మ్యాచ్‌ల్లోనూ 20లోపే అవుటయ్యాడు. ఈనేపథ్యంలో నేటి మ్యాచ్ అతడికి అత్యంత కీలకం కానుంది. తిలక్ వేగంగానే ఆడుతున్నా భారీ స్కోర్లుగా మలచాల్సిన అవసరం ఉంది. కెప్టెన్ సూర్యకుమార్, హార్దిక్ కూడా త్వరగానే పెవిలియన్‌కు చేరారు. కాగితంపై బ్యాటింగ్ ఆర్డర్ పటిష్టంగానే కనిపిస్తున్నా 36 పరుగుల వ్యవధిలోనే చివరి ఆరు వికెట్లను కోల్పోవడం.. మిడిల్, లోయరార్డర్ ఆటతీరును చాటిచెప్పినట్టయ్యింది. అందుకే నేటి మ్యాచ్‌లో ఈ బలహీనతను అధిగమించాలనుకుంటోంది.

రాణిస్తున్న బౌలర్లు: బ్యాటర్ల ఫామ్ ఎలా ఉన్నా ఇక్కడి పిచ్‌లపై పెద్దగా అనుభవం లేని బౌలర్లు మాత్రం అదరగొట్టారు. కేవలం 141 పరుగులకే ప్రత్యర్థిని కట్టడి చేయగలిగారు. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి బంగ్లాదేశ్‌పై చూపిన ఫామ్‌ను ఇక్కడా కొనసాగించాడు. బిష్ణోయ్ కూడా మూడు వికెట్లతో ఆకట్టుకున్నాడు. పేసర్లు అర్ష్‌దీప్, అవేశ్ ఆరంభ, ముగింపులో ఇబ్బందిపెడుతున్నారు. అందుకే పటిష్ట బౌలింగ్ లైనప్‌తో రెండో మ్యాచ్‌ను కూడా భారత్ తమ ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది.


ఒత్తిడిలో సఫారీ: తొలి టీ20 పరాభవంతో ఆతిథ్య దక్షిణాఫ్రికా నిరాశలో మునిగింది. టీ20 వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత భారత్ చేతిలో ఆ జట్టుకిది వరుసగా రెండో ఓటమి. అయితే ప్రధాన ఆటగాళ్లు డికాక్, పేసర్లు రబాడ, నోకియా స్పిన్నర్ షంసీ లేకపోవడం జట్టు ప్రదర్శనపై ప్రభావం చూపింది. విండీస్‌తో సిరీస్ ఓటమి, ఐర్లాండ్‌తో సిరీస్ సమం తర్వాత భారత్‌తో మ్యాచ్‌లు ఆ జట్టుకు సవాల్‌గా మారాయి. మరోవైపు బ్యాటింగ్‌లో ఏ బ్యాటర్ కూడా 25 పరుగులు దాటలేకపోయాడు. రెండో టీ20లోనైనా సీనియర్ బ్యాటర్లు క్లాసెన్, మిల్లర్, కెప్టెన్ మార్‌క్రమ్ తమ స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శించాలనుకుంటున్నారు. ఇక బౌలర్లు కూడా శాంసన్ ధాటిని అడ్డుకోలేకపోయినా డెత్ ఓవర్లలో మాత్రం ప్రభావం చూపారు.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, శాంసన్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్, హార్దిక్, రింకూ సింగ్, అక్షర్, అర్ష్‌దీప్, బిష్ణోయ్, వరుణ్, అవేశ్.
దక్షిణాఫ్రికా: హెన్‌డ్రిక్స్, రికెల్టన్, మార్‌క్రమ్ (కెప్టెన్), స్టబ్స్, క్లాసెన్, మిల్లర్, జాన్సెన్, కేశవ్, కొట్జీ, పీటర్, బార్ట్‌మన్.

పిచ్, వాతావరణం

ఇక్కడి సెయింట్ జార్జి పిచ్ కూడా మ్యాచ్ జరిగే కొద్దీ స్పిన్‌కు అనుకూలించనుంది. ఆరంభంలో మాత్రం బ్యాటర్లకు సహాయకంగా ఉండనుంది. అందుకే టాస్ గెలిచిన జట్టు మొదట బ్యాటింగ్‌కు దిగే అవకాశం ఉంది. సగటు స్కోరు 135 మాత్రమే. సాయంత్రం చిరు జల్లులకు ఆస్కారముంది.



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
రిటర్న్ ఆఫ్ ది కింగ్	డాక్యుమెంటరీ మూవీ	నవంబర్ 13
హాట్ ఫ్రాస్ట్	వెబ్‌సిరీస్	నవంబర్ 13
ఎమిలియా పెరెజ్	వెబ్‌సిరీస్	నవంబర్ 13
కోబ్రా కై	వెబ్‌సిరీస్	నవంబర్ 15
మైక్ టైసన్ వర్సెస్		
పాల్ జాక్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 15
అమెజాన్ ప్రైమ్		
ఇన్ కోల్డ్ వాటర్	వెబ్‌సిరీస్	నవంబర్ 12
క్రాస్	వెబ్‌సిరీస్	నవంబర్ 14
జియో సినిమా		
సెయింట్ డెనిస్		
మెడికల్	వెబ్‌సిరీస్	నవంబర్ 13
ది డే ఆఫ్ ది జాకాల్	వెబ్‌సిరీస్	నవంబర్ 15
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 12
ఆన్ ఆల్మోస్ట్ క్రిస్మస్ స్టోరీ	యానిమేషన్ మూవీ	నవంబర్ 15
ఆపిల్ టీవీ ప్లస్		
బ్యాడ్ సిస్టర్స్	వెబ్‌సిరీస్	నవంబర్ 13
సిలో	వెబ్‌సిరీస్	నవంబర్ 15
సోనీ లివ్		
ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్	హిందీ సిరీస్ (తెలుగు డబ్బింగ్)	నవంబర్ 15
లయన్స్ గేట్ ప్లే ఆపరేషన్ బ్లడ్‌హంట్	హాలీవుడ్ మూవీ (తెలుగు డబ్బింగ్)	నవంబర్ 15

అర్ధరాత్రి స్వాతంత్ర్యం



లారీ కాలిన్స్, డొమినిక్ లాపియర్ రాసిన 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్ పుస్తకం' ఆధారంగా అదే పేరుతో హిందీలో ఓ వెబ్‌సిరీస్ తెరకెక్కింది. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన వేళ దేశ విభజన నాటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సాగుతుంది. విభజనను ఆపేందుకు గాంధీ చేసిన ప్రయత్నాలు, జిన్నాను ఒప్పించేందుకు ఆయన చేసిన ప్రతిపాదనలు విఫలమయిన తీరును ఇందులో ఆవిష్కరించనున్నారు. నిఖిల్ అద్వానీ దర్శకత్వం వహించారు.

సండే సెలబ్రిటీ



'సార్, లక్కీ భాస్కర్' సినిమాలతో రెండు వరస విజయాలను సాధించిన దర్శకుడు వెంకీ అట్లూరి. సినిమా నిర్మాణంతో పాటు తన చిన్నతనం గురించి కూడా ఎన్నో విశేషాలను ఆయన 'నవ్య'తో పంచుకున్నారు.

కంచె వేసుకోవాలి

చిన్నతనం...

నేను పుట్టింది.. పెరిగింది హైదరాబాద్‌లో. నాన్నగారు అట్లూరి సుబ్బారావు సుమారు 45 సంవత్సరాల క్రితమే హైదరాబాద్ వచ్చేశారు. నాకు చిన్నప్పటి నుంచి చదవటం కన్నా.. ఎవరైనా చెబుతుంటే కథలు వినటం ఇష్టం. సినిమాలంటే చాలా ఆసక్తి ఉండేది కానీ ఇంట్లో ఎక్కువగా చూడనిచ్చేవారు కారు. వేసవి సెలవుల్లోనే సినిమాలు చూసేవాడిని. నేను సినీ రంగంలోకి వస్తానని.. దర్శకుడిని అవుతానని ఎప్పుడూ అనుకోలేదు. అన్నీ ఒక దాని వెనక ఒకటి యాదృచ్ఛికంగా జరిగిపోయాయి. నా చదువు పూర్తయిన తర్వాత ఉప్పలపాటి నారాయణ రావు గారి సినిమాలో హీరోగా అవకాశం వచ్చింది. కానీ ఆ సినిమా ఆడలేదు. ఏం చేయాలో తెలియని సందిగ్ధత. రెండేళ్ల తర్వాత 'స్నేహగీతం'లో మాటలు రాయటానికి అవకాశం వచ్చింది. ఆ సినిమా బాగానే ఆడింది. దానితో రచయితగా స్థిరపడాలనుకున్నా. కథలు రాసేవాడిని. ఒకసారి ఉషాకిరణ్ మూవీస్ బ్యానర్ కోసం ఒక కథ తయారు చేశా. వెళ్లి చెప్పా. అప్పుడు వాళ్లు "కథ బావుంది. నువ్వు హీరో కావాలనుకుంటున్నావా? డైరక్షన్ చేస్తావా?' అని అడిగారు. అప్పటి దాకా నాకు దర్శకత్వం చేయాలనే ఆలోచనే లేదు. ఆ రోజు వాళ్ల మాటలు నా జీవితాన్ని మలుపు తిప్పాయి.

మంచి నటుడిని కాదు...

నేను మంచి నటుడిని కాదు. మంచి రచయితను. దర్శకుడిని. ఆ విషయం తెలుసుకున్న తర్వాత నటించకూడదని నిర్ణయించుకున్నా. నటన, దర్శకత్వం- ఈ రెండింటిలోను శారీరకంగా నటన చాలా కష్టం. నటులకు శారీరక శ్రమ చాలా ఎక్కువ ఉంటుంది. దర్శకులకు మానసిక ఒత్తిడి చాలా ఉంటుంది. ఇక దర్శకత్వం విషయానికి వస్తే- మనకంటూ ఒక మంచి టీం ఉండాలి. ప్రణాళికాబద్ధంగా షూటింగ్ జరిగేలా చూసుకోవాలి. ఇవి రెండూ లేకపోతే చాలా నష్టం జరుగుతుంది. ముఖ్యంగా భారీ బడ్జెట్ సినిమాల విషయంలో ఈ జాగ్రత్తలు తీసుకోవాలి. షూటింగ్ ఒక పది రోజులు లేటు అయినా పర్వాలేదు. కానీ షూటింగ్ జరుగుతున్న సమయంలో పది నిమిషాలు లేటు కాకూడదు. ఒక రోజు సెట్‌లో మూడు గంటలు ఆలస్యమైతే మూడు లక్షలు పోతాయి. అందువల్ల షూటింగ్ సమయంలో ప్రతి నిమిషం విలువైనదే!

నిజంగానే కథనాయికలు...

నా సినిమాల్లో కథనాయికలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. వాళ్ల ఆత్మవిశ్వాసంతో ఉంటారు. ఇప్పటి వరకు నేను రాసిన కథలన్నీ ఆలా కలిసి వచ్చాయి. సాధారణంగా ఒక సినిమా పూర్తయిన పది రోజుల దాకా ఒక శూన్యత ఆవరిస్తుంది. ఆ శూన్యతలోనే రకరకాల ఆలోచనలు వస్తూ ఉంటాయి. వాటిలో కొన్ని మనను ఉత్తేజపరుస్తాయి. కొన్ని మనతో పాటే ప్రయాణం చేస్తూ ఉంటాయి. ఇలా ఎక్కువ కాలం ప్రయాణం చేసిన ఆలోచన ఎప్పుడూ ఒక మంచి కథను పునాది వేస్తుంది. నేను నా కథలన్నింటినీ అలాగే ఎంపిక చేసుకుంటా! ఉదాహరణకు 'లక్కీ భాస్కర్' కథనే తీసుకుందాం. ఆర్థిక నేరాలకు సంబంధించిన సినిమాలు, వెబ్‌సిరీస్‌లు చాలా తక్కువ వచ్చాయి. ఆర్థిక నేరాలకు సంబంధించి.. ముఖ్యంగా 90ల నేపథ్యంలో జరిగిన నేరాలకు సంబంధించి సినిమా చేయాలనే ఆలోచన వచ్చినప్పుడు- అందుబాటులో ఉన్న సినిమాలు, వెబ్ సిరీస్‌లన్నీ చూశాను. వీటిలో చాలా పదాలు.. వాటి వెనకున్న అర్థాలు సామాన్య ప్రజలకు అర్థం కావు. ఉదాహరణకు సెక్యూరిటీస్ అనే పదం ఉందనుకుందాం. అది చాలా మందికి అర్థం కాదు. అందువల్ల నేను తీసే సినిమాలో భాష అందరికీ అర్థం కావాలనుకున్నా. చాలా సంక్లిష్టమైన కథను సులభంగా అందరికీ అందించాలనుకున్నా. లక్కీ భాస్కర్ కథను నాలుగు సార్లు రాసుకున్నా. కొన్ని సీన్లు అయితే పది సార్లు రాసిన సందర్భాలు కూడా ఉన్నాయి.

కథ రాసేదిలా...

నేను కథ రాసేటప్పుడు ప్రేక్షకులకు ఏం కావాలి అనే విషయం గురించి ఆలోచించను. రెండో సారి చదివితే నాకు అర్థం అవుతోందా? లేదా? అనే విషయం పైనే దృష్టి పెడతాను. అందరి మాదిరిగానే నాకు కూడా- "నా స్క్రిప్ట్ అందరి నచ్చాలి" అనుకుంటాను. కానీ అందరికీ నచ్చేలా రాయాలనుకుంటే - మొత్తానికే మోసం వస్తుంది. ఎక్కడో ఒక చోట మనకు మనం కంచె వేసుకోవాలి. పక్కవాళ్లకు నచ్చుతుందా లేదా అనే భయంతో రాస్తే సృజనాత్మకత దెబ్బతింటుంది. ఇక నా ఉద్దేశంలో హాస్యరస పూరిత సినిమా చేయటం కష్టం. సినిమాల్లో రాసే హాస్యం వరకు పర్వాలేదు. మొత్తం సినిమా అంతా హాస్యం పడించాలంటే కష్టం. నా దృష్టిలో నేను డ్రామా బాగా పండిస్తాను.



- నాకు బిగ్ 4... చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్‌లంటే చాలా ఇష్టం. వాళ్ల సినిమాలు చిన్నప్పుడు చాలా ఉత్సాహంగా చూసేవాడిని. వాళ్లను చిన్నస్థాయి దేవుళ్లలా కొలిచేవాడిని. ఇక కాలేజీకి వచ్చిన తర్వాత అజిత్‌గారంటే ఇష్టం ఏర్పడింది.
- భవిష్యత్తు సినిమాల గురించి ఇంకా ఏం అనుకోలేదు. సితార ఎంటర్‌టైన్ మెంట్స్‌కు మరో సినిమా చేయాల్సి ఉంది. దానికి కూడా కథ రాయాలి.

• సివిఎల్ఎన్ ప్రసాద్

హద్దులు లేని సినిమా



ఒకప్పుడు భారతీయ సినిమా అంటే బాలీవుడ్ చిత్రాలే. కాని ఇవాళ తెలుగు సినిమాలన్నీ పాన్ ఇండియా చిత్రాలే. మన హీరోలంతా పాన్ ఇండియా కథానాయకులు అవుతున్నారు. 'బాహుబలి', 'ఆర్‌ఆర్‌ఆర్', 'పుష్ప' వంటి సినిమాలు జాతీయ స్థాయిలో సత్తా చాటాయి. ఈ చిత్రాలు తెలుగు సినీ పరిశ్రమకు కొండంత విశ్వాసాన్ని ఇచ్చాయి. ఆ స్ఫూర్తితోనే తెలుగు సినిమాలు పాన్ ఇండియా స్థాయిలో రూపుదిద్దుకుంటున్నాయి. ద్వితీయ శ్రేణి హీరోలు సైతం పాన్ ఇండియా సినిమాలకే సై అంటున్నారు.

ప్రాంతీయ భాషల్లో ఆకట్టుకున్న మూవీస్ కూడా పాన్ ఇండియా సినిమాలుగా రూపాంతరం చెందుతున్నాయి. కాన్సెప్ట్ బాగుంది, ఫ్యాన్స్ ఆదరిస్తారన్న నమ్మకం కుదిరితే చాలు...మన సినిమాలను ఇతర భాషల్లోకి డబ్ చేసి రిలీజ్ చేస్తున్నారు. సరైన కంటెంట్, చక్కటి విజువలైజేషన్, ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్, గ్రాఫిక్ ఎఫెక్ట్స్.. ఇవి ఉంటే చాలు... సినిమాకు భాష, ప్రాంతీయ సరిహద్దులు అడ్డురావని మన తెలుగు సినిమాలు నిరూపిస్తున్నాయి. ప్రస్తుతం టాలీవుడ్ నుంచి రాబోయే సినిమాల కోసం దేశం అంతా ఎదురుచూస్తోంది.

ఇప్పుడు దేశంలో ఏ భాష మాట్లాడే వారైనా తెలుగు సినిమాలు అంటే తెగ ఆసక్తి కనబరుస్తున్నారు. పాన్ ఇండియా మూవీస్‌తో నార్త్, సౌత్ అనే తేడా లేకుండా పోయింది. దాంతో ఏ భాషలో లేని విధంగా తెలుగు చిత్రపరిశ్రమలో పాన్ ఇండియా సినిమాల నిర్మాణం జరుగుతోంది. ఇప్పటికే తెలుగు నుంచి ప్రభాస్, ఎన్టీఆర్, అల్లు అర్జున్, రామ్ చరణ్ పాన్ ఇండియా స్టార్లుగా గుర్తింపు సాధించారు. వీరు నటిస్తున్న ప్రతీ సినిమా పాన్ ఇండియా స్థాయిలో రూపుదిద్దుకుంటోంది. వీరితోపాటు పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు, రాజమౌళి సినిమాతో మహేశ్ బాబు పాన్ ఇండియా కేటగిరీలోకి తొలిసారిగా అడుగుపెడుతున్నారు. మరోవైపు ఎన్టీఆర్ 'వార్-2' సినిమా ద్వారా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వబోతున్నారు.



సౌత్ నార్త్ అనే తేడా లేదు

సాధారణంగా మన పెద్ద హీరోలు నటించిన చిత్రాలు కర్ణాటకలో, తమిళనాట విడుదలవుతుంటాయి. కానీ, రాజమౌళి 'బహుబలి' సిరీస్ సినిమాలతో సౌత్ నార్త్ అనే హద్దులు చెరిగిపోయాయి. ఇప్పుడు సౌత్‌తోపాటు నార్త్ ఇండియాలోనూ మన సినిమాల పట్ల తెగ ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. బిహార్‌తోపాటు బెంగాల్‌లోనూ విడుదలవుతున్నాయి. కొవిడ్ అనంతరం ఈ ట్రెండ్ తారా స్థాయికి చేరుకుంది. 2022లో తెలుగు నుంచి అరడజనుకు పైగా పాన్ ఇండియా సినిమాలు విడుదల కాగా... ఒకటి, రెండు మినహా మిగతావన్నీ ఘన విజయం సాధించాయి. వీటిలో ఆర్ఆర్ఆర్, మేజర్, కార్తికేయ2, సీతారామం చిత్రాలు బ్లాక్ బస్టర్ అయ్యాయి. 2023లో కూడా నార్త్ ఇండియాలో బాలీవుడ్ కంటే సౌత్ ఇండియన్ సినిమాలే ఎక్కువగా విజయవంతమయ్యాయి. అందులోనూ టాలీవుడ్ చిత్రాల సంఖ్యే ఎక్కువగా ఉంది. 2024లోనూ ఇండియన్ బాక్సాఫీస్‌ని తెలుగు సినిమా శాసించిందనే చెప్పాలి.

- ప్రభాస్ నటించిన కల్కి- '2898 ఎడి' రూ.1200 కోట్ల కలెక్షన్స్ సాధించింది. బాలీవుడ్‌లో రూ.250 కోట్లకు పైగా రాబట్టి, అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఇక్కడ అతిపెద్ద ఓపెనింగ్స్ రాబట్టిన మూవీగా నిలిచింది.
- ఆర్ఆర్ఆర్ తర్వాత ఎన్టీఆర్ నటించిన పాన్ ఇండియా సినిమా 'దేవర'. జనతా గ్యారేజ్ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత కొరటాల శివ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇందులో జాన్వీకపూర్ హీరోయిన్. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటించాడు. ఈ సినిమా సెప్టెంబరులో విడుదలైంది. కర్ణాటకలో రూ.16 కోట్లు, తమిళనాడులో రూ.3 కోట్లు, కేరళలో కోటి రూపాయలు వసూలు చేస్తే...ఒక్క హిందీ వర్షన్‌కే రూ.24 కోట్ల రూపాయల వసూళ్లు వచ్చినట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది.
- అల్లు అర్జున్ హీరోగా నటించిన పుష్ప-2 కోసం యావత్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ మూవీ డిసెంబరు 5న విడుదల అవుతోంది. సౌత్ ఇండియా విషయం ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. అయితే నార్త్ ఇండియాతోపాటు పశ్చిమ బెంగాల్‌లో కూడా సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ రెండు ప్రాంతాల్లో ఇప్పటికే రూ.450 కోట్లకు పైగా ప్రీ రిలీజ్ బిజినెస్ అయింది.
- కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన పీరియాడిక్ థ్రిల్లర్ మూవీ 'క'. దీపావళి సందర్భంగా భారీ కాంపిటీషన్‌లో విడులైన ఈ మూవీకి పాజిటివ్ టాక్ వచ్చింది. దాంతో పాన్ ఇండియా రిలీజ్‌కు రెడీ అవుతున్నారు మేకర్స్.

రాబోతున్న పాన్ ఇండియా చిత్రాలు

- శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున కలసి నటించిన మల్టీస్టారర్ 'కుబేర' విడుదలకు సిద్ధమవుతోంది. డిసెంబరులో ఈ చిత్రం విడుదల కానున్నట్లు సమాచారం.
- నాగ చైతన్య హీరోగా గీతా ఆర్ట్స్ బేనర్‌పై నిర్మించిన 'తండేల్' ఫిబ్రవరి 7న విడుదలవుతోంది.
- శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ నటించిన 'గేమ్ చేంజర్' సంక్రాతికి రానుంది.

ఇతర భాషల వారికీ అవకాశం



పాన్ ఇండియా ట్రెండ్ కారణంగా ఇప్పుడు బాలీవుడ్ హీరోయిన్లు దీపికా పదుకొణే, జాన్వీకపూర్, కియరా అద్వానీ తదితరులు ఇప్పటికే తెలుగు సినిమాల్లో నటించారు. తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి తెరకెక్కుతున్న సినిమాల్లో బాలీవుడ్‌తో పాటు వివిధ సినీ ఇండస్ట్రీలకు చెందిన నటీ నటులకు అవకాశాలు దక్కుతున్నాయి. కొంతమంది బాలీవుడ్‌లో కంటే తెలుగు మూవీస్‌లో బాగా రాణిస్తున్నారు. వరుసగా అవకాశాలు వస్తుండటంతో ఇక్కడే బిజీ అయిపోతున్నారు. త్వరలో రాబోతున్న పుష్ప-2, గేమ్ చేంజర్, హరిహర వీరమల్లు వంటి భారీ బడ్జెట్ చిత్రాల్లో బాలీవుడ్‌తో పాటు తమిళ, మలయాళీ, కన్నడ ఆర్టిస్టులు పనిచేస్తున్నారు.

ఐరన్ కావాలా..! ఇవి తినండి

మహిళల్లో ఐరన్ లోపం అనేది సర్వసాధారణంగా కనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణం పోషకాహారం లోపమే. ఐరన్ లోపంవల్ల రక్తహీనత, నీరసం, రోగనిరోధక వ్యవస్థ సరిగా పనిచేయకపోవడం వంటి సమస్యలు వస్తాయి. వీటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన ఆహారం గురించి తెలుసుకుందాం!

పప్పు ధాన్యాలు

కందిపప్పు, మినపప్పు, పెసరపప్పు, వేరుశనగ వంటి పప్పుల్లో ఐరన్ మినరల్ ఎక్కువగా ఉంటుంది. వీటిని ఉడికించి సూప్‌లు, సలాడ్స్ రూపంలో తీసుకోవచ్చు. రోజుకొక పప్పు రకాన్ని సైడ్ డిష్‌గా ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. ఇవి శరీరానికి కావాల్సిన ఐరన్‌ను అందించడమే కాకుండా జీర్ణక్రియ సజావుగా ఉండేలా చేస్తాయి.



పాలకూర

వంద గ్రాముల ఉడికించిన పాలకూరలో 2.7 మిల్లీ గ్రాముల ఐరన్ ఉంటుంది. పాలకూరను సలాడ్స్‌లో, స్మూతీల్లో, ఇతర వంటకాల్లో భాగంగా చేర్చుకుని తరచూ తింటే శరీరానికి అవసరమైన న్యూట్రియెంట్స్, ఆగ్జలేట్లు పూర్తిగా అందుతాయి. వీటితోపాటు ఎ, సి, కె విటమిన్లు కూడా లభిస్తాయి.

రెడ్ మీట్

ఇందులో శరీరం త్వరగా గ్రహించే హేమే ఐరన్ ఉంటుంది. రెడ్‌మీట్‌ను మితంగా రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి ప్రోటీన్లు, బి విటమిన్ కూడా అందుతాయి.

గుమ్మడి గింజలు

వంద గ్రాముల గుమ్మడి గింజల్లో 3.3 మిల్లీ గ్రాముల ఐరన్ ఉంటుంది. వీటిలో న్యూట్రియెంట్స్ యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యానికి అవసరమైన హెల్దీ ఫ్యాట్స్‌ను అందిస్తాయి. గుమ్మడి గింజలను పచ్చిగా, వేయించుకొని తినవచ్చు. సలాడ్స్‌లో కలుపుకోవచ్చు.

క్వినోవా

ఇందులో ఐరన్‌తోపాటు మెగ్నీషియం, మాంగనీస్, ఫైబర్, ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఇది గ్లూటెన్ లేని ధాన్యం. దీనిని మెయిన్ డిష్ కింద వారానికి రెండు సార్లు తీసుకున్నా మంచి ఫలితం ఉంటుంది.

బరువు తగ్గండిలా...

ఆరోగ్యంగా ఉంటూనే బరువు తగ్గడమనేది పెద్ద సవాల్. చాలామంది బరువు తగ్గాలని రకరకాల వ్యాయామాలు, వాకింగ్ చేస్తుంటారు. అయినా ప్రయోజనం ఉండదు. మరికొంతమంది తినడం మానేస్తుంటారు. దీనివల్ల ఆరోగ్యం పాడయ్యే ప్రమాదముంది. రోజువారీ తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేర్పులు చేసుకుంటూ కొన్ని జాగ్రత్తలు పాటిస్తే సులభంగా బరువు తగ్గవచ్చు. వాటి గురించి తెలుసుకుందాం!

బ్రేక్‌ఫాస్ట్

మనం ఉదయం తీసుకునే అల్పాహారం రోజంతా ఉత్సాహంగా ఉండేలా చేస్తుంది. అయితే కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండే ఇడ్లీ, వడ వంటివి కాకుండా ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. డ్రై ఫ్రూట్స్, నట్స్, పాలకూర, టోఫుతో కూడిన సలాడ్స్; మొలకెత్తిన గింజలు, పండ్ల రసాలు, పప్పు ధాన్యాలు, పన్నీరు, గ్రుడ్లు, యోగర్ట్ తీసుకోవడం మంచిది. ప్రోటీన్లు ఆకలిని నియంత్రించి వేగంగా బరువు తగ్గేందుకు దోహదం చేస్తాయి.

ఫైబర్

ప్రేగులలో సమస్యలను నివారించి జీర్ణక్రియను మెరుగుపరచడంలో ఫైబర్ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. శరీరంలో జీవక్రియలను పెంచి క్రొవ్వు పేరుకోకుండా చేస్తుంది. ఫైబర్ అధికంగా లభించే ఆకు కూరలు, పండ్లు, తృణధాన్యాలు, చిక్కుళ్లను తరచూ తినడం వల్ల శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.

కార్బోహైడ్రేట్స్

ఇవి శరీరానికి శక్తిని అందించే ప్రాథమిక పోషకాలు. అయినప్పటికీ వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలో క్రొవ్వు పెరుగుతుంది. బరువు తగ్గడంలో భాగంగా మనం ఎంచుకొని తీసుకునే ఆహారం నుంచి లభించే కార్బోహైడ్రేట్స్ శరీరానికి సరిపోతాయి. అదనంగా అవసరం లేదు. కాబట్టి కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండే బియ్యం, గోధుమలతో తయారు చేసిన ఆహారాన్ని తినడం తగ్గించాలి.



నీరు

ప్రతి రోజూ శరీరానికి అవసరమైన నీరు త్రాగినపుడే అవయవాలన్నీ సరిగా పనిచేసి వ్యర్థాలను బయటికి పంపుతాయి. రోజుకు కనీసం ఎనిమిది గ్లాసుల నీరు త్రాగితే ప్రేగు కదలికలు సక్రమంగా ఉండి శరీరంలో టాక్సిన్స్ పేరుకోవు. ఉదయాన్నే ఓ గ్లాసు గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల కూడా బరువు నియంత్రణలో ఉంటుంది.

వ్యాయామం

బరువు పెరగకుండా ఉండాలంటే ప్రతిరోజూ కనీసం అరగంట వ్యాయాయం చేయాలి. వెయిట్ లిఫ్టింగ్, స్క్వాట్స్, స్ట్రెచర్స్ చేయడం వల్ల శరీరంలోని అనవసర క్రొవ్వులు కరగిపోతాయి. రక్తప్రసరణ వ్యవస్థ మెరుగవుతుంది. కండరాలు దృఢంగా మారతాయి. ఉదయం వేళల్లో వాకింగ్, రన్నింగ్ కూడా మంచి ఫలితాన్నిస్తాయి.

నిద్ర

సరిగా నిద్రపోకపోవడం వల్ల శరీరంలో కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తయి ఒత్తిడిని కలిగిస్తుంది. దీనివల్ల బరువు పెరిగే అవకాశం ఉంటుంది. ప్రతిరోజూ కనీసం ఏడు నుంచి తొమ్మిది గంటలు నిద్రించడం వల్ల అంతర్గత అవయవాలు విశ్రాంతి పొంది శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

సమయపాలన

బరువు తగ్గాలనుకునేవారు ఎక్కువసేపు ఆకలితో ఉండకూడదు. భోజనానికి గంట ముందు ఏదైనా ప్రోటీన్ ఫుడ్ తినడం మంచిది. ప్రతిరోజూ ఒకే సమయానికి భోజనం పూర్తిచేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గకుండా శరీరంలో డీహైడ్రేషన్ ఏర్పడకుండా ఉంటాయి.

మేని మెరుపులకు...

తెల్లని చర్మం కోసం తయారవుతున్న లోషన్లు, క్రీముల్లో రసాయనాలుంటాయనే విషయం అందరికీ తెలిసిందే! వాటితో దుష్ప్రభావాలకు గురవకుండా ఉండటానికి సహజసిద్ధ చిట్కాలున్నాయి. అవే ఇవి...



- ఎండలోకి వెళ్లేటప్పుడు చర్మాన్ని కప్పి ఉంచాలి. ఇందుకోసం స్కార్ఫ్ వాడుకోవాలి. ద్విచక్ర వాహనాలను నడిపేవాళ్లు తప్పనిసరిగా స్కార్ఫ్, హెల్మెట్ వాడుకోవాలి.
- రోజుకి 8 నుంచి 10 గ్లాసుల నీళ్లు తాగాలి.
- 7 నుంచి 8 గంటల నిద్ర తప్పనిసరి.
- తాజా పళ్ల రసాలు, ఆకు కూరలు, కూరగాయలు తీసుకోవాలి.
- వాతావరణ కాలుష్యానికి దూరంగా ఉండాలి.
- చక్కెర వాడకం తగ్గించాలి.
- 16 ఏళ్ల లోపు యువతులు ఎలాంటి సౌందర్య సాధనాలూ వాడకూడదు.
- ఇంట్లో తయారు చేసుకుని వేసుకునే ప్యాక్స్ వల్ల తాత్కాలిక ఫలితం మాత్రమే ఉంటుంది.
- చర్మానికి సంబంధించిన ఎలాంటి సమస్య వచ్చినా సొంత వైద్యం మాని చర్మ వైద్యులను సంప్రదించాలి.

'దొర'కునా ఇటువంటి సేవ!

తెలుగుకు వెలుగులు అద్దిన ఆంగ్ల దొర బ్రౌన్
జీవితం, జీతం..రెండూ సాహితీలక్ష్మి సేవకే
నేడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి

(కడప - ఆంధ్రజ్యోతి)

చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తండ్రి డేవిడ్ బ్రౌన్ క్రైస్తవ మత ప్రచారకుడు. క్రైస్తవ మత ప్రచారంలో భాగంగా డేవిడ్ బ్రౌన్ కుటుంబం 1762లో ఇండియా చేరుకుంది. 1798 నవంబరు 10న డేవిడ్ దంపతులకు సీపీ బ్రౌన్ కలకత్తాలో జన్మించారు. తండ్రి మరణానంతరం బ్రౌన్ కుటుంబం తిరిగి ఇంగ్లాండు వెళ్లిపోయింది. 1812లో సీపీ బ్రౌన్ సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. ఇంగ్లాండులోని హేల్‌బరి కళాశాలలో శిక్షణ పొందారు. అనంతరం 1817లో బ్రౌన్ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రానికి వచ్చారు. అప్పటికి ఆయనకు తెలుగు రాదు. ఈస్టిండియా కంపెనీలో ఉద్యోగంలో చేరారు. ఆయనకు ఉద్యోగ విధుల్లో భాగంగా తెలుగు నేర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 1817 ఆగస్టు 17న తొలిసారి తెలుగుభాష గురించి విన్నారు. తొలిరోజుల్లో వెలగపూడి కోదండరామయ్య పంతులు వద్ద బ్రౌన్ తెలుగు భాష నేర్చుకున్నారు. 1820 ఆగస్టులో కడప డిప్యూటీ కలెక్టరుగా చేరారు. బ్రౌన్ కడపకు రాకముందు ఆయనకు తెలుగు కంటే హిబ్రూ, పార్సీ, గ్రీకు, లాటిన్ భాషలు బాగా తెలుసు. కృషి, పట్టుదలతో తెలుగును నేర్చుకున్నారు. 1824 నాటికి, తెలుగుకావ్యాలు చదివి అర్థం చేసుకునే స్థాయికి వచ్చారు. వేమన పద్యాలను సేకరించి పుస్తకంగా ముద్రించారు. 'ద వర్సెస్ ఆఫ్ వేమన' పేరిట వీటిని ఇంగ్లీషులో ప్రచురించారు.


కడపలో సీపీ బ్రౌన్ నివాసం ఉన్న బంగ్లా

సొంత డబ్బు వెచ్చించి సాహిత్య శోధన...

కడప అప్పట్లో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఉండేది. బ్రౌన్ కొన్నాళ్లు ఇక్కడ పనిచేసిన తర్వాత చిత్తూరు, గుంటూరు, మచిలీపట్నం, తిరునల్వేలి ప్రాంతాలకు వెళ్లారు. మళ్లీ 1826లో కడపకు వచ్చారు. బ్రౌన్ తెలుగు భాషపై పరిశోధనలు చేశారు. ప్రాచీన సాహిత్య సేకరణ, తాళపత్ర గ్రంథాల పరిష్కరణకు నడుం బిగించారు. వీటిని సేకరించి, వ్యాఖ్యానాలు రాసేందుకు పండితులను నియవించుకున్నారు. వీరికి సొంత డబ్బులు ఇచ్చేవారు. ఒకరకంగా జీతం మొత్తం తెలుగు భాషా సేవకే వెచ్చించారు. జీతం సరిపోక అప్పులు కూడా చేశారని అంటారు. అలా పరిష్కరించిన వాటిని బ్రౌన్ ముద్రించేవారు.

బ్రౌనే లేకుంటే..

మనుచరిత్ర, రంగనాధ రామాయణం, పాండితారాధ్య చరిత్ర, దశావతార చరిత్ర లాంటి కావ్యాలు బ్రౌన్ కృషివలనే మనకు అందుబాటులోకి వచ్చాయి. 1844లో వసుచరిత్ర, 1851లో మనుచరిత్ర ప్రచురించారు. జూలూరు అప్పయ్యశాస్త్రి చేత వీటికి వ్యాఖ్యానాలు రాయించారు. 1852లో పల్నాటి వీరచరిత్ర పుస్తకం ప్రచురించారు.

శుభవార్త మానం, బైబిల్ కథలు తెలుగులోకి అనువదించారు. 1164 వేమన పద్యాలు సేకరించి వాటికి పదకోశం తయారు చేశారు. మొట్టమొదటి వేమన శతకం ప్రచురించింది వీరే. తెలుగు- ఇంగ్లీషు, ఇంగ్లీషు-తెలుగు నిఘంటువులు రూపొందించారు. ఇప్పటికీ సీపీ బ్రౌన్ నిఘంటువులు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు 'ఏ గ్రామర్ ఆఫ్ తెలుగు లాంగ్వేజీ' అనే వ్యాకరణ గ్రంథం రాశారు. ఇతిహాసాలు, పురాణాలు, శతకాలు, వీరగాథలు, నిర్వచన వచన కావ్యాలు, ద్విపద కావ్యాలకు ప్రాణం పోశారు. లండన్‌లోని ఇండియన్ హౌస్ లైబ్రరీలో ఉన్న దాదాపు రెండువేల దక్షిణభారత గ్రంథాలను మద్రాస్‌కు తెప్పించారు. 1854లో ఉద్యోగ విరమణ అనంతరం ఆయన తిరిగి లండన్ వెళ్లిపోయి అక్కడే స్థిరపడ్డారు. 1865లో లండన్ యూనివర్సిటీలో తెలుగు ప్రొఫెసర్‌గా చేరారు. బ్రౌన్ 12 డిసెంబరు 1884న చనిపోయారు. ఆయన అవివాహితుడు.


బ్రౌన్ సేకరించిన అరుదైన తాళపత్ర గ్రంథాలు

తులనాత్మకతలో తొలి అడుగులు

ప్రాచీన కావ్యాల ముద్రణ, అధ్యయనంలో పాశ్చాత్య రీతిని బ్రౌన్ అనుసరించారు. ఉదాహరణకు సింగన రాసిన అహల్యచరిత్ర, సుముఖం వెంకటకృష్ణ రచించిన అహల్య సంక్రమణ విలాసం పుస్తకాలను దగ్గర పెట్టుకుని.. తులనాత్మక అధ్యయనం చేయించారు. ఈ తరహా పరిశీలన బ్రౌన్ ద్వారానే తెలుగు సమాజానికి పరిచయం అయింది. తెలుగువారికి ఇష్టమైన వసుచరిత్ర, మనుచరిత్ర కావ్యాలు జూలూరి అప్పయ్యపంతులతో పరిష్కరించి ముద్రించారు. ఆంధ్రమహాభాగవతం శుద్ధ ప్రతిని తప్పులు లేకుండా రాయించారు. 1840లో భాగవతాన్ని బ్రౌన్ స్వయంగా ముద్రించారు. 1848లో హయగ్రీవ శాస్త్ర పూర్వ భాగవతం ముద్రించారు.



కడపలో సీపీ బ్రౌన్ గ్రంథాలయం

డిప్యూటీ కలెక్టర్‌గా సీపీ బ్రౌన్ పలు ప్రాంతాల్లో పనిచేసినా.. ఆయన కడపలో ఎక్కువకాలం ఉన్నారు. ఆయన చనిపోయిన దాదాపు వందేళ్ల తర్వాత కడపలో సీపీ బ్రౌన్ సేవలను వెలుగులోకి తెచ్చేందుకు జానమద్ది హనుమచ్ఛాస్త్రి రంగంలోకి దిగారు. బ్రౌన్ తెలుగు భాషకు ఆకుంఠిత దీక్షతో ఎలా అయితే శ్రమించారో.. జానమద్ది కూడా ఎంతగానో శ్రమించి కడపలో బ్రౌన్ గ్రంథాలయం ఏర్పాటుచేశారు. ఆయన కడపలో నివసించిన బంగ్లా ఉన్న స్థలంలో ఇప్పుడు సీపీ బ్రౌన్ గ్రంథాలయం ఉంది. ఇక్కడ ఎన్నో సాహిత్య పుస్తకాలతో పాటు తాళపత్ర గ్రంథాలు, విజ్ఞాన సంపద నిక్షిప్తమై ఉంది.



కడపలో బ్రౌన్ నివాసం ఉన్న బంగ్లాలో ఏర్పాటు చేసిన సీపీ బ్రౌన్ గ్రంథాలయం

బ్రౌన్ సేవలు వెలకట్టలేనివి



తెలుగు భాషా సేవలో జీవితాన్ని తరింపజేసుకున్న గొప్ప భాషా సేవకులు సీపీ బ్రౌన్. ఆంగ్లేయుడుగా పుట్టినా తన జీవితాన్ని, జీతాన్ని తెలుగుభాషా సాహిత్యాల పునరుద్ధరణకు వెచ్చించారు. బ్రౌన్ గొప్పతనాన్ని కొలవడానికి కొలమానాలు లేవు. వేమన కవిత్వంలోని సామాజిక రుగ్మతలను తొలగించే లక్షణం చూసి బ్రౌన్ ఆశ్చర్యపోయారు. లభ్యమవుతున్న తాళపత్ర గ్రంథాలు చాలా మటుకు బ్రౌన్ సేకరించినవే. దేశం నలుచెరగుల నుంచి వీటిని తెప్పించి భద్రపరిచారు. పండితుల చేత వాటిని పరిష్కరించి కాగితాలపై రాయించి ఆంధ్ర సాహిత్య లక్ష్మికి భాగ్య భాండాగారం ఏర్పరిచారు. ఆ దొర లేకుంటే చెదలు పట్టి ఆంధ్ర గ్రంథాలు ఏమయ్యేవో!

- ఎన్.ఈశ్వర్‌రెడ్డి, తెలుగు ప్రొఫెసర్, యోగివేమన యూనివర్శిటీ



సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

వలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోండి

» రూ.10 వేల గౌరవ వేతనం ఇవ్వండి: రామకృష్ణ

విజయవాడ(ధర్నాచౌక్), నవంబరు 9: సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన సీఎం చంద్రబాబు వలంటీర్లకు న్యాయంచేసే అంశంలో మాట తప్పడం సరైంది కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హితవు పలికారు. వలంటీర్లకు రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వలంటీర్లకు న్యాయం చేయాలని కోరుతూ 'వలంటీర్ల ఆవేదన-చంద్రన్నకు నివేదన' సదస్సు విజయవాడలో శనివారం జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ... 'ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సదస్సు నిర్వహిస్తుంటే పోలీసులతో అరెస్టులు చేయించడం, వారెంట్లు ఇవ్వడం సిగ్గుచేటు. అక్రమ అరెస్టులు, వారెంట్‌లు, నోటీసులతో ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు.

బహుమతుల పేరిట ఘరానా మోసం

రణస్థలం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలో బహుమతుల పేరిట ఘరానా మోసం వెలుగుచూసింది. ఉభయగోదావరి జిల్లాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఇన్‌స్టాల్‌మెంట్ స్కీం పేరిట ప్రజలకు బహుమతుల ఆశ చూపి, సుమారు రూ.50లక్షల వరకూ వసూలు చేసి పరారయ్యారు. రూ.20తో ప్రారంభమైన ఈ స్కీమ్‌లో ప్రతివారం రూ.50 పెంచుతూ 16 వారాల పాటు మొత్తంగా రూ.6,020 చెల్లిస్తే.. ప్రతివారం డ్రా తీసి టీవీలు, ద్విచక్ర వాహనాలు తదితర విలువైన బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. ఖాతాదారుల నుంచి రూ.50లక్షలు వసూలు చేసిన ఆ ఇద్దరూ పత్తా లేకుండా పోయారు. తమకు న్యాయం చేయాలంటూ శనివారం చిల్లపేట రాజాం సచివాలయం ఎదుట బాధితులు నిరసన తెలిపారు.

జగన్ పెన్నుల కోసం 9.84 కోట్లా?: లోకేశ్

అమరావతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్... పెన్నులు, కాగితాల కోసం భారీగా ఖర్చు పెట్టారంటూ లోకేశ్ ఎక్స్ వేదికగా శనివారం ఆరోపించారు. "ఏపీలోని విద్యార్థులకు నాదో ప్రశ్న. మీ పెన్ను ఖరీదు ఎంత ఉంటుంది?... మీరు ఊహించగలరా? వైఎస్ జగన్ తన తాడేపల్లి ప్యాలెస్‌లో పెన్నులు, కాగితాల కోసం రూ.9.84 కోట్లు ఖర్చు చేశారు. దీనినే విచక్షణాయుతంగా ఖర్చుచేస్తే... లెక్కలేనన్ని స్కూళ్ల స్వరూపాన్ని మార్చేయవచ్చు. అనేకమంది విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దవచ్చు. ఆయన ఏం రాసి ఉండవచ్చని మీరు ఊహిస్తున్నారు?' అని మంత్రి లోకేశ్ ప్రశ్నించారు.

బడ్జెట్‌పై రేపు మంత్రివర్గ ప్రత్యేక సమావేశం

అమరావతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గం సోమవారం ప్రత్యేకంగా సమావేశం కానుంది. వచ్చే ఏడాది బడ్జెట్ ప్రతిపాదనలపై ఈ సమావేశం ఉంటుంది. అదే రోజు నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండడంతో ఉదయం 9 గంటలకు అసెంబ్లీలోని ముఖ్యమంత్రి చాంబర్‌లో ప్రత్యేకంగా ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

గవర్నర్ నజీర్‌తో ఆర్థిక మంత్రి పయ్యావుల భేటీ

అమరావతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సోమవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, కీలక రంగాల గురించి గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం కొండలా పేర్చిన పెండింగ్ బిల్లుల చెల్లింపులపైనా ఆరా తీశారు. మూలధన వ్యయం మరింత పెంచాలని మంత్రికి సూచించారు.

జుగుప్సాకర పోస్టులు పెడితే వదలం: పార్థసారథి

తిరుపతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి):జగన్ కనుసన్నల్లోనే వైసీపీ సోషల్ మీడియా బ్యాచ్ రెచ్చిపోతోందని మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు. 'జుగుప్సాకరంగా పోస్టులు పెట్టేవారిని వదిలిపెట్టేది లేదు. అనుచిత పోస్టుల నివారణకు సమాచార శాఖ ఆధ్వర్యంలో షార్ట్ ఫిలిమ్స్ రూపొందించి అవగాహన కల్పిస్తాం. పీఎంఏవై 2.0 కింద టిడ్కో ఇళ్ల నిర్మాణ పథకం వచ్చే మార్చి నుంచి ప్రారంభమవుతుంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహ సౌకర్యం కల్పించడమే సీఎం చంద్రబాబు లక్ష్యం' అని శనివారం తిరుపతిలో అన్నారు. 'వర్కింగ్ జర్నలిస్టులకు స్థలాలు ఇవ్వడంతో పాటు అందులో సరసమైన ధరకే ఇళ్లు కట్టించి ఇచ్చే దిశగా సీఎం చంద్రబాబు ప్రణాళిక రూపొందిస్తున్నారు. డిసెంబరు నాటికి కొత్త అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలనే ప్రతిపాదన ఉంది' అని పార్థసారథి తెలిపారు.

ఏడాదిలోనే డయాఫ్రం వాల్

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు సమ్మతించారు. 700 మీటర్ల మేర వాల్ నిర్మాణం పూర్తయిన వెంటనే.. సమాంతరంగా ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు మొదలు పెట్టేందుకు జలసంఘం అనుమతి ఇచ్చింది. ఇందుకు శుక్రవారంనాటి సమీక్షలో సూత్రప్రాయంగా సమ్మతించిన సంగతి తెలిసిందే. ఆరో తేదీ నుంచి మూడ్రోజుల పాటు పోలవరం ప్రాజెక్టు క్షేత్రంలో, శనివారం ధవళేశ్వరంలోని ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన వర్క్‌షాపులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఒకరోజు ముందే వర్క్‌షాపును ముగించారు. చివరిరోజు సమీక్షలో.. ప్రాజెక్టు పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని జలసంఘం స్పష్టంచేసింది. ప్రతి 15 రోజులకోసారి పనులను వీడియో కాన్ఫరెన్సు ద్వారానే గాక ప్రత్యక్షంగానూ పరిశీలిస్తామని జలసంఘం చీఫ్ ఇంజనీర్ విజయ్ శరణ్ తేల్చిచెప్పారు. ఫిబ్రవరిలో మరోసారి ప్రాజెక్టు క్షేత్రంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం అక్కడ సెంట్రల్ సాయిల్-మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) నిర్వహిస్తున్న నాణ్యతా ప్రమాణాల పరీక్షలతో పాటు.. రాష్ట్ర జల వనరుల శాఖ కూడా ప్రత్యేకంగా లేబొరేటరీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సంబంధిత నివేదికలను ఎప్పటికప్పుడు పీపీఏ ద్వారా తమకు అందజేయాలన్నారు. అలాగే డయాఫ్రం వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యాం డిజైన్లను తమకు పంపాలని.. డిజైన్లను రూపొందిస్తున్న ఆఫ్రీ సంస్థను జలసంఘం ఆదేశించింది. ఈ నెలాఖరు నాటికి డిజైన్లను పంపితే వాటిని పరిశీలించి.. వచ్చే ఫిబ్రవరికల్లా ఆమోదం తెలుపుతామని తెలిపింది. ఈసీఆర్ఎఫ్ డ్యాం ప్రాంతంలోని గ్యాప్-1, గ్యాప్-2 పూడ్చివేతలు.. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలలో సీపేజీ నివారణకు చేపట్టనున్న కార్యాచరణ, వైబ్రో కంపాక్షన్ పనులపై సంతృప్తి వ్యక్తం చేసింది. కాగా.. డయాఫ్రం వాల్ పనులు 700 మీటర్లకు చేరుకోగానే అటు సమాంతరంగా ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు కూడా ప్రారంభిస్తే.. 2027 నాటికి పోలవరం ప్రధాన డ్యాం పనులన్నీ పూర్తయిపోతాయని.. తత్ఫలితంగా ఏడాదికాలం కలిసి వస్తుందని రాష్ట్ర జల వనరుల శాఖ వివరించింది. ఇందుకు జల సంఘం, అంతర్జాతీయ నిపుణులు కూడా ఆమోదం తెలుపడంతో ప్రాజెక్టు పనులపై నెలకొన్న సందేహాలన్నీ తొలగిపోయాయి.

జలసంఘం, నిపుణులతో ప్రత్యేక సీఎస్ భేటీ

వాస్తవానికి ఆదివారం కూడా వర్క్‌షాపు జరగాల్సి ఉన్నా.. శనివారమే ముగించారు. అనంతరం ఢిల్లీ వెళ్లేందుకు విజయవాడ చేరుకున్న అంతర్జాతీయ నిపుణులు, కేంద్ర జల సంఘం అధికారులు నోవాటెల్‌లో బస చేశారు. అక్కడ వారిని రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. నాలుగురోజుల వర్క్‌షాపులో సానుకూల నిర్ణయాలు తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

పనుల షెడ్యూల్ సమర్పించండి..

పోలవరం నిర్మాణంలో ఇప్పటికే బాగా జాప్యం జరిగిందని.. ఇక ఈ పరిస్థితి పునరావృతం కావడానికి వీల్లేదని రాష్ట్ర జల వనరుల శాఖకు, నిర్మాణ సంస్థలైన మేఘా, బావర్‌లకు జల సంఘం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ప్రధాన డ్యాం పనులకు సంబంధించి షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులూ ఉండవని తేల్చిచెప్పింది.

ఇన్సులిన్ ఇంజక్షన్లకు చెక్





(మొదటి పేజీ తరువాయి)

ఆయన ప్రసంగించారు. అనంతరం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. పలు విషయాలు వెల్లడించారు. ఆహారపు అలవాట్లు, తీవ్రమైన ఒత్తిడి, ఇతర కారణాలతో ప్రపంచవ్యాప్తంగా డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. అయితే డయాబెటిస్ రోగులు జీవితాంతం ఇబ్బంది పడాలని చాలామంది భావిస్తుంటారని, ముఖ్యంగా టైప్-1 బాధితులకు ఇన్సులిన్ తప్ప మరోమార్గం లేదన్న భావన ఉందన్నారు. వారు అధునాతన రీ జనరేటివ్ థెరపీతో సాధారణ జీవితాన్ని గడిపే అవకాశం లభిస్తుందన్నారు. దీనిపై సుదీర్ఘకాలం పరిశోధన చేయడంతో పాటు సుమారు 300 మందికి ఈ థెరపీని విజయవంతంగా పూర్తి చేసినట్టు వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా, కెనడాతో పాటు యూరప్ దేశాల్లో ఈ విధానం అందుబాటులో ఉందన్నారు. డయాబెటిస్‌కు సంబంధించి 10 శాతం మంది టైప్-1 బాధితులు ఉంటున్నారని, క్లోమ గ్రంథి (ప్యాంక్రియాస్) నుంచి ఇన్సులిన్ హార్మోన్ ఉత్పత్తి ఆగిపోతే రక్తంలో చక్కెర పేరుకుపోయి ఈ సమస్య తలెత్తుతుందన్నారు. టైప్-1 డయాబెటిస్‌తో బాధపడేవారు ఇన్సులిన్‌ను ఎక్కువగా తీసుకోవాల్సి ఉంటుందని, వీరు సాధారణ జీవితాన్ని లీడ్ చేసేందుకు రీ జనరేటివ్ థెరపీ ఉపయోగపడుతుందని చెప్పారు. సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విధానంలో ఐదు గంటలపాటు ప్రత్యేక పరికరంలో దాత నుంచి సేకరించిన ప్యాంక్రియాస్‌ను ఐసోలేట్ చేస్తామని వివరించారు. అనంతరం ఐలెట్ సెల్స్ ప్రొడ్యూస్ అవుతాయని, వీటిని టైప్-1 డయాబెటిస్ రోగికి లివర్ కింది భాగంలో ఇంజెక్షన్ రూపంలో ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ థెరపీ తరువాత షుగర్ పూర్తిగా కంట్రోల్‌లోకి రావడంతోపాటు సాధారణ జీవితాన్ని గడపవచ్చునన్నారు. అయితే ఖరీదైన వైద్యం కావడంతో అనేక దేశాల్లో ఈ విధానం అందుబాటులోకి రావడం లేదన్నారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ వేణు కవర్తపు, డాక్టర్ కేవీఎస్ హరికుమార్ కూడా ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ఫుట్ రీకన్‌స్ట్రక్షన్ ఓ వరం



షుగర్ వ్యాధితో బాధపడే వారిలో కొన్ని కారణాలు వల్ల కాళ్లు తీసేయాల్సి వస్తోంది. భారత్‌లో 100లో 90 మందికి కాళ్లు తీసేస్తున్నారు. ఇంగ్లాండ్ వంటి దేశాల్లో పదిమందికి మాత్రమే అటువంటి పరిస్థితి ఏర్పడుతోంది. అధునాతన ఫుట్ రీకన్‌స్ట్రక్షన్ విధానంతో ఈ పరిస్థితి ఉండదు. దీన్నిభారత్‌లో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈ ఫుట్‌ను కోల్‌కతాలో తయారుచేసే ప్రక్రియ ప్రారంభమైంది. అపోలో ఆస్పత్రిలో 25 వరకూ ఆపరేషన్లు చేశాను. ఇది షుగర్ వ్యాధిగ్రస్తులకు వరంగా మారుతుంది.

- డాక్టర్ వేణు కవర్తపు, ఎముకల వైద్య నిపుణులు, లండన్ కింగ్స్ కాలేజ్ హాస్పిటల్

పిల్లల్లోనూ షుగర్ కేసులు పెరుగుతున్నాయి



చైల్డ్ డయాబెటిస్ కేసులు పెరుగుతున్నాయి. ఇది కొంత ఆందోళన కలిగిస్తోంది. జంక్ ఫుడ్, ఒబెసిటీ వంటి అంశాలు దీనికి కారణం. ఈ విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. 15ఏళ్లలోపు పిల్లల్లోనూ కేసులు నమోదవుతున్నాయి. 20 నుంచి 30 ఏళ్లలోపు యువతలోనూ డయాబెటిస్ కేసులు పెరగడానికి ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, కొద్దిమందిలో జన్యుపరమైన అంశాలు, కుటుంబ వారసత్వం కారణాలుగా ఉంటున్నాయి. రోజూ వ్యాయామంతో పాటు ఆహారపు అలవాట్లు మార్చుకోవడం ద్వారా ఈ సమస్య బారినపడకుండా ఉండవచ్చు.

- డాక్టర్ కేవీఎస్ హరికుమార్, ఎండోక్రినాలజీ వైద్య నిపుణులు, హైదరాబాద్



పార్వతీపురంలో ఏనుగుల సంచారం

పార్వతీపురం మండలాన్ని గజరాజులు వణికిస్తున్నాయి. కొన్ని రోజులుగా మండలంలోనే సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇటీవల పెదబొండపల్లిలో ఏనుగుల దాడిలో ఓ వృద్ధుడు చనిపోయాడు. రెండు రోజుల కిందట నర్సిపురంలో కొబ్బరిమొక్కలను ధ్వంసం చేశాయి. ప్రస్తుతం ఏనుగులు పెదమరికి చేరుకున్నాయి. దీంతో అటవీ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేశారు. - ఆంధ్రజ్యోతి, పార్వతీపురం రూరల్

వైసీపీలో చేరలేదని రౌడీషీట్ పెట్టించారు

» అప్పటి మంత్రి అక్రమ కేసులతో వేధించారు

» టీడీపీ గ్రీవెన్స్‌లో వైసీపీ బాధితుల ఆవేదన

అమరావతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ నుంచి వైసీపీలోకి చేరలేదనే కక్షతో తమపై అక్రమ కేసులు పెట్టించి వేధించారని పలువురు బాధితులు టీడీపీ ప్రజావేదికలో బావురుమన్నారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, పార్టీ నేతలు వర్ల రామయ్య, నల్లగట్ల స్వామిదాసు, బుచ్చిరాంప్రసాద్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతపురం జిల్లా ఎర్రప్పదొడ్డికి చెందిన గొల్ల గోవిందు, గొల్ల కృష్ణప్ప మాట్లాడుతూ.. వైసీపీలో చేరలేదన్న కక్షతో గత ప్రభుత్వంలో అప్పటి మంత్రి ఉషశ్రీ చరణ్ తమపై అక్రమ కేసులు పెట్టించారని కన్నీటి పర్యంతమయ్యారు. ఆ అక్రమ కేసులను ఎత్తేయాలని కోరారు. టీడీపీ అనుబంధ కమిటీ సెక్రటరీగా పని చేస్తున్న తనను గత ప్రభుత్వంలో పార్టీ మారాలని వైసీపీ నేతలు ఒత్తిడి చేశారని, తాను ససేమిరా అనడంతో అక్రమంగా రౌడీషీట్ ఓపెన్ చేయించారని తిరుపతికి చెందిన జి. గజేంద్ర వాపోయారు. తన భూమిని వైసీపీ నేతలు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని, తప్పుడు రికార్డులు సృష్టించేందుకు అధికారులు వారికి సహకరించారని చిత్తూరు జిల్లా పేటూరుకు చెందిన కె. గోవిందు వాపోయారు. గత ప్రభుత్వంలో పేదల ఇళ్ల కోసం తన భూమి తీసుకుని, తనకు పరిహారం ఇవ్వకుండానే అందులోని మామిడి చెట్లను నరికేశారని, తగిన పరిహారం ఇప్పించాలని విజయవాడ రూరల్ నున్నకు చెందిన పోతురాజు కోరారు. వైసీపీ నేతల అండతో దేవస్థానం భూమిని ఆక్రమించి, తన ఇంటి గోడను కూల్చేందుకు ప్రయత్నిస్తూ, పోలీసులతో బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా అగ్రహారానికి చెందిన కె. ఉమామహేశ్వరరావు మొరపెట్టుకున్నారు.

వైసీపీ పాలనలో 2,04,414 నేరాలు

» తాడేపల్లి పెద్దలపైనా చర్యలు తప్పవు:మాజీ మంత్రి సుజాత

అమరావతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో 2,04,414 నేరాలు, ఘోరాలు, అత్యాచారాలు జరిగాయని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకురాలు పీతల సుజాత వెల్లడించారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు మహిళల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసభ్యకర పోస్టులు పెడుతున్న వర్రా రవీంద్రారెడ్డి సైకోలాంటి వాడని, ఆయన వెనుక ఎవరున్నారు? ఎక్కడి నుంచి జీతం వస్తోందని ప్రశ్నించారు. అన్నింటిపైనా సమగ్ర విచారణ జరుగుతోందని తెలిపారు. "తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చున్న పెద్ద తిమింగలాలను కూడా వదిలిపెట్టేది లేదు. వైసీపీ పాపాల పుట్ట బద్దలైంది. ఒక్కొక్క పాము బయటకు వస్తోంది. వైసీపీ నేతలకు కౌంట్‌డౌన్ మొదలైంది. వైసీపీ ఆగడాలు ఇక సాగవు" అని హెచ్చరించారు. జగన్ పాలనతో పోల్చితే కూటమి పాలనలో మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాయని అన్నారు. నేరాల సంఖ్య తగ్గించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని తెలిపారు.

పోలీసు విచారణకు వైసీపీ ఎమ్మెల్యే డుమ్మా

ఒంగోలు క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌పై తీవ్రపదజాలంతో పోస్టు పెట్టిన ఎర్రగొండపాలెం వైసీపీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌పై పోలీసులు నెల క్రితం కేసు నమోదు చేశారు. దానికి సంబంధించి శనివారం విచారణకు రావాలని పోలీసులు సమాచారం ఇచ్చినా ఆయన హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. వివరాలు... పేకాట క్లబ్‌ల నుంచి కమీషన్లు వసూలు చేస్తున్నారని మంత్రి లోకేశ్‌పై నిరాధార ఆరోపణలు చేస్తూ ఎమ్మెల్యే చంద్రశేఖర్ 'ఎక్స్' వేదికగా సెప్టెంబరు 18న పోస్టు పెట్టారు. చేశారు. 'పేకాట ఆడే వారికి వసతులు ఏర్పాటు చేస్తారా..?' అంటూ మంత్రిని ప్రశ్నించారు. దీనిపై టీడీపీ కార్యకర్త చేదూరి కిశోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎర్రగొండపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ నిమిత్తం స్టేషన్‌కు రావాలని వారం క్రితం నోటీసులు ఇచ్చినా ఎమ్మెల్యే హాజరు కాలేదు. దీంతో విచారణ నిమిత్తం శనివారం స్టేషన్‌కు రావాలని ఎస్ఐ చౌడయ్య నేరుగా ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. అయితే విచారణకు హాజరు కాకపోగా కేసుల పేరుతో తమ గొంతు నొక్కుతున్నారని మీడియా సమావేశం ఏర్పాటు చేసి చంద్రశేఖర్ గగ్గోలు పెట్టారు. దీనిపై డీజీపీని కలుస్తానని చెప్పారు.

ఆన్‌లైన్‌లోనే 2,500 కోర్సులు పూర్తి

సిక్కోలు వాసి అరుదైన రికార్డు
51 ఏళ్ల వయసులో సాధించిన శాస్త్రి

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సిక్కోలు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి అరుదైన ఘనత సాధించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగించేందుకు భారత ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఉచిత కోర్సు ప్రవేశపెట్టగా.. శ్రీకాకుళం నగరానికి చెందిన ఎంవీఎస్ఎస్ శాస్త్రి తన కుమార్తెకు బోధించేందుకు ఆ కోర్సు చదివి పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించారు. అలా 2022 అక్టోబరులో ప్రారంభించిన ఆన్‌లైన్ కోర్సుల విద్యాభ్యాస్యాన్ని ఆయన తన అలవాటుగా మార్చుకున్నారు. రెండేళ్లలో ఏకంగా 2,500 ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేశారు. 51 ఏళ్ల వయసులో ఈ ఘనత సాధించిన వ్యక్తిగా అరుదైన రికార్డు సాధించారు. చదువుకు వయసు అడ్డుకాదని శాస్త్రి నిరూపించారు. శనివారం శ్రీకాకుళంలోని ఓ హోటల్‌లో శాస్త్రిని వివిధ సంఘాల నాయకులు, విద్యావంతులు సన్మానించారు. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ.. రెండేళ్లలో 2,500 కోర్సులు పూర్తి చేశానని, యువత ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకుని లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం శాస్త్రిని కుటుంబ సమేతంగా సత్కరించారు.


ఎంవీఎస్ఎస్ శాస్త్రి దంపతులను సత్కరిస్తున్న నగర ప్రముఖులు


ఆనం వెంకటరమణారెడ్డి, ఆక్వా కల్చర్ అథారిటీ


జీవీ రెడ్డి, ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్


పట్టాభిరాం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్


పొడపాటి తేజస్వి, కల్చరల్ కమిషన్


కిడారి శ్రవణ్, గిరిజన సహకార కార్పొరేషన్


కావలి గ్రీష్మ మహిళా ఆర్థిక కార్పొరేషన్


డూండి రాకేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్


సుజయ్ కృష్ణ రంగారావు అటవీ కార్పొరేషన్


ఉండవల్లి శ్రీదేవి మాదిగ సంక్షేమ కార్పొరేషన్


తుమ్మల రామస్వామి కాకినాడ పట్టణాభివృద్ధి అథారిటీ

పదవుల పండగ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వంలో కూడా ఆయనకు సాంస్కృతిక సలహాదారుడి పదవి ఇచ్చినా సున్నితంగా తిరస్కరించారు. శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్‌కు ముస్లిం మైనారిటీ వ్యవహారాల సలహాదారుగా కేబినెట్ ర్యాంక్‌తో నియమించారు. 3 రాజధానుల బిల్లును ఆమోదించాలంటూ గత ప్రభుత్వం ఎన్ని ఒత్తిళ్లు తీసుకొచ్చినా, మంత్రులు వ్యక్తిగత దూషణలకు దిగినా విధి నిర్వహణలో ఆయన నిక్కచ్చిగా వ్యవహరించారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి బీసీలు, వివిధ సామాజిక వర్గాలు, సీనియర్లు, యువతకు ఈ జాబితాలో స్థానం దక్కింది. బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా ఉన్న వీరంకి గురుమూర్తిని ఏపీ గౌడ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిలో నియమించారు. టీడీపీ నాయకురాలు మంజులారెడ్డికి శిల్పారామం, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సాంస్కృతిక సొసైటీ ఛైర్‌పర్సన్ పదవి దక్కింది. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో మాచర్ల పోలింగ్ బూత్‌కు ఏజెంట్‌గా వెళ్తున్న మంజులారెడ్డిని పిన్నెల్లి ముఠా దారి కాచి కత్తులతో విచక్షణా రహితంగా దాడి చేసినా ఆమె తలకు కట్టు కట్టుకుని మరీ పార్టీ కోసం పనిచేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో పలుమార్లు భౌతికదాడులను ఎదుర్కొని పార్టీకి పనిచేసిన కొమ్మారెడ్డి పట్టాభిరామ్, చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఐటీ ఉద్యోగులను ఏకం చేసి పోరాడిన పొడపాటి తేజస్వినికి నామినేటెడ్ పదవులు దక్కాయి. పార్టీ అధినేత వాహన శ్రేణికి పైలట్‌గా స్కూటర్‌పై వేల కిలోమీటర్లు ప్రయాణించిన దివ్యాంగుడు గోనుగుంట్ల కోటేశ్వరరావుకు నామినేటెడ్ పదవి లభించింది.

ఇన్‌చార్జిలకు పట్టం

విశాఖ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉంటూ పొత్తులో భాగంగా సీటును జనసేనకు త్యాగం చేసిన గండి బాబ్జిని ఏపీ కో-ఆపరేటివ్ నూనెగింజల అభివృద్ధి ఫెడరేషన్ ఛైర్మన్‌గా నియమించారు. గుడివాడ ఇన్‌చార్జిగా ఉంటూ సీటు త్యాగం చేసిన రావి వెంకటేశ్వరరావుకు గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని ఇచ్చారు.

కార్పొరేషన్ పేరు	ఛైర్మన్	ప్రాంతం-పార్టీ
మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు (కేబినెట్ హోదా)	మహమ్మద్ షరీఫ్	నరసాపురం (టీడీపీ)
విద్యార్థులు-నైతిక విలువల ప్రభుత్వ సలహాదారు (కేబినెట్ హోదా)	చాగంటి కోటేశ్వరరావు	
శెట్టిబలిజ సంక్షేమ కార్పొరేషన్	కుడిపూడి సత్యబాబు	రాజమండ్రి (టీడీపీ)
గవర సంక్షేమ కార్పొరేషన్	మళ్ల సురేంద్ర	అనకాపల్లి (టీడీపీ)
కళింగ సంక్షేమ కార్పొరేషన్	రోణంకి కృష్ణమనాయుడు	నరసన్నపేట (టీడీపీ)
కొప్పుల వెలమ సంక్షేమసంఘం కార్పొరేషన్	పీవీజీ కుమార్	మాడుగుల (టీడీపీ)
కురుబ/కురుమ సంక్షేమ కార్పొరేషన్	దేవేంద్రప్ప	ఆదోని (టీడీపీ)
నాయీబ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్	ఆర్.సదాశివ	తిరుపతి (టీడీపీ)
రజక సంక్షేమ కార్పొరేషన్	సావిత్రి(అడ్వొకేట్)	బీజేపీ
తూర్పుకాపు సంక్షేమ కార్పొరేషన్	పాలవలస యశస్వి	శ్రీకాకుళం (జనసేన)
వాల్మీకి/బోయ సంక్షేమ కార్పొరేషన్	కప్పట్రాళ్ల సుశీలమ్మ(బొజ్జమ్మ)	ఆలూరు (టీడీపీ)
వన్యకుల క్షత్రియ/(వన్నెరెడ్డి/వన్నికాపు/పల్లికాపు/పల్లిరెడ్డి సంక్షేమ కార్పొరేషన్	డీఆర్ రాజన్	చంద్రగిరి (టీడీపీ)
యాదవ సంక్షేమ కార్పొరేషన్	నరసింహ యాదవ్	తిరుపతి (టీడీపీ)
అగ్నికుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్	చిలకలపూడి పాపారావు	రేపల్లె (జనసేన)
గౌడ సంక్షేమ కార్పొరేషన్	వీరంకి వెంకటగురుమూర్తి	పామర్రు (టీడీపీ)
కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్స్	గండి బాబ్జి	పెందుర్తి (టీడీపీ)
శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ	మంజులారెడ్డి(రెంటచింతల)	మాచర్ల (టీడీపీ)
స్టేట్ బయోడైవర్సిటీ	నీలాయపాలెం విజయ్‌కుమార్	తిరుపతి (టీడీపీ)
స్టేట్ ఫైబర్‌నెట్	జీవీరెడ్డి	మార్కాపురం (టీడీపీ)
టెక్నాలజీస్ సర్వీసెస్	మన్నవ మోహన్‌కృష్ణ	గుంటూరు వెస్ట్ (టీడీపీ)
కల్చరల్ కమిషన్	తేజస్విని పొడపాటి	ఒంగోలు (టీడీపీ)
ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్	పోలంరెడ్డి దినేష్‌రెడ్డి	కోవూరు (టీడీపీ)
అటవీ అభివృద్ధి కార్పొరేషన్	సుజయ్‌కృష్ణ రంగారావు	బొబ్బిలి (టీడీపీ)
గ్రంథాలయ పరిషత్	గోనుగుంట్ల కోటేశ్వరరావు	నరసారావుపేట (టీడీపీ)
ఇండస్ట్రియల్ అభివృద్ధి కార్పొరేషన్	దేగల ప్రభాకర్	గుంటూరు ఈస్ట్ (టీడీపీ)
ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు	కేకే చౌదరి	కోడూరు (టీడీపీ)
మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్	చిల్లపల్లి శ్రీనివాసరావు	జనసేన
రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్	ప్రగడ నాగేశ్వరరావు	యలమంచలి (టీడీపీ)
స్టేట్ అగ్రికల్చరల్ మిషన్	మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి	ఒంగోలు (టీడీపీ)
స్టేట్ ఆక్వా కల్చర్ అభివృద్ధి అథారిటీ	ఆనం వెంకటరమణారెడ్డి	నెల్లూరు రూరల్ (టీడీపీ)
స్టేట్ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ సలహా కమిటీ	రఘురామరాజు గొట్టిముక్కల	విజయవాడ సెంట్రల్ (టీడీపీ)
స్టేట్ ఆర్గానిక్ ఉత్పత్తుల సర్టిఫికేషన్ అథారిటీ	శావల దేవదత్	తిరువూరు (టీడీపీ)
స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్	రావి వెంకటేశ్వరరావు	గుడివాడ (టీడీపీ)
మహిళా ఆర్థిక సహకార కార్పొరేషన్	కావలి గ్రీష్మ	రాజాం (టీడీపీ)
ఏపీఎస్ఆర్‌టీసీ ప్రాంతీయబోర్డు		
విజయనగరం జోన్	దొన్నుదొర	టీడీపీ
విజయవాడ జోన్	రెడ్డి అప్పలనాయుడు	జనసేన
నెల్లూరు జోన్	సురేష్‌రెడ్డి	బీజేపీ
కడప జోన్	పూల నాగరాజు	టీడీపీ
చేనేత సహకార సంఘం	సజ్జా హేమలత	చీరాల (టీడీపీ)
నాటక అకాడమీ	గుమ్మడి గోపాలకృష్ణ	పామర్రు (టీడీపీ)
ఎన్టీఆర్ వైద్యసేవ	సీతారామ సుధాకర్	విశాఖ సౌత్ (టీడీపీ)
స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్	కొమ్మారెడ్డి పట్టాభిరామ్	విజయవాడ వెస్ట్ (టీడీపీ)
అమలాపురం పట్టణాభివృద్ధి అథారిటీ	స్వామినాయుడు అల్లాడ	అమలాపురం (టీడీపీ)
అనంతపురం-హిందూపురం పట్టణాభివృద్ధి అథారిటీ	టీసీ వరుణ్	అనంతపురం (జనసేన)
అన్నమయ్య పట్టణాభివృద్ధి అథారిటీ	రూపానందరెడ్డి	కోడూరు (టీడీపీ)
బాపట్ల పట్టణాభివృద్ధి అథారిటీ	సలగల రాజశేఖర్‌బాబు	బాపట్ల (టీడీపీ)
బొబ్బిలి పట్టణాభివృద్ధి అథారిటీ	తెంటు లక్ష్మీనాయుడు	బొబ్బిలి (టీడీపీ)
చిత్తూరు పట్టణాభివృద్ధి అథారిటీ	కె.హేమలత	చిత్తూరు (టీడీపీ)
కాకినాడ పట్టణాభివృద్ధి అథారిటీ	తుమ్మల రామస్వామి(బాబు)	కాకినాడ (జనసేన)
కర్నూలు పట్టణాభివృద్ధి అథారిటీ	సోమిశెట్టి వెంకటేశ్వర్లు	కర్నూలు (టీడీపీ)
మచిలీపట్నం పట్టణాభివృద్ధి అథారిటీ	మట్ట ప్రసాద్	మచిలీపట్నం (బీజేపీ)
నెల్లూరు పట్టణాభివృద్ధి అథారిటీ	కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి	నెల్లూరు రూరల్ (టీడీపీ)
రాజమండ్రి పట్టణాభివృద్ధి అథారిటీ	బొడ్డు వెంకటరమణ చౌదరి	రాజానగరం (టీడీపీ)
శ్రీకాకుళం పట్టణాభివృద్ధి అథారిటీ	కొరికన రవికుమార్	శ్రీకాకుళం (జనసేన)
విశాఖ మెట్రో ప్రాంతీయ అభివృద్ధి అథారిటీ	ప్రణవ్ గోపాల్	విశాఖపట్నం ఈస్ట్ (టీడీపీ)
స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్	ముస్తాఫ్ అహ్మద్	నంద్యాల (టీడీపీ)
ఆర్యవైశ్య సంక్షేమ కార్పొరేషన్	డూండి రాకేష్	విజయవాడ వెస్ట్ (టీడీపీ)
క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్	వేగేష్న సూర్యనారాయణరాజు	భీమవరం (జనసేన)
కాపు సంక్షేమ కార్పొరేషన్	కొత్తపల్లి సుబ్బారాయుడు	నరసాపురం (జనసేన)
మాదిగ సంక్షేమ కార్పొరేషన్	ఉండవల్లి శ్రీదేవి	తాడికొండ (టీడీపీ)
మాల సంక్షేమ కార్పొరేషన్	డాక్టర్ పెదపూడి విజయ్‌కుమార్	ఒంగోలు (జనసేన)
గిరిజన సహకార కార్పొరేషన్	కిడారి శ్రావణ్	అరకు (టీడీపీ)


సీ ప్లేన్‌లో సీఎం చంద్రబాబు, రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్, కేంద్ర మంత్రి రామ్మోహన్


శ్రీశైలంలో సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి, చిత్రంలో రామ్మోహన్, కందుల దుర్గేశ్, బీసీ జనార్దన్ రెడ్డి



విజయవాడ నుంచి శ్రీశైలానికి సీప్లేన్‌లో వెళుతూ అభివాదం చేస్తున్న సీఎం

తిరుపతి, శ్రీశైలం, గండికోట, ధవళేశ్వరం, ప్రకాశం బ్యారేజీ, కోనసీమ, అరకు లోయలో బొర్రా గుహలు, కటిక వాటర్ ఫాల్స్, ట్రైబల్ మ్యూజియం, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలు రాష్ట్రంలో ఉన్నాయి. వీటన్నిటినీ కలపగలిగితే మన రాష్ట్రం ప్రపంచానికే టూరిజం స్పాట్‌లా మారుతుంది.

- ముఖ్యమంత్రి చంద్రబాబు

పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చాం. అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. ఈ రంగంలో ఉండేంత ఉపాధి అవకాశాలు మరే రంగంలో ఉండవు.

పర్యాటకాంధ్ర!

- రాష్ట్రంలో ఎన్నో టూరిజం ప్రదేశాలు
- ప్రగతి పథంలో పయనిస్తాం
- విజయవాడలో సీ ప్లేన్ డెమో లాంచ్‌లో సీఎం చంద్రబాబు వెల్లడి

నంద్యాల/విజయవాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలు చాలా ఉన్నాయని, వాటన్నింటిని కలిపితే ఆంధ్రప్రదేశ్.. దేశానికే కాకుండా ప్రపంచానికే పర్యాటక ఆకర్షక ప్రాంతంగా మారుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. శ్రీశైలం క్షేత్రంతో పాటు పర్యాటక అభివృద్ధికి తిరుమల తిరుపతి తరహాలో మాస్టర్ ప్లాన్ తయారు చేస్తామని వెల్లడించారు. శనివారం విజయవాడ ప్రకాశం బ్యారేజీలోని పున్నమిఘాట్ నుంచి శ్రీశైలానికి సీ ప్లేన్ సర్వీసు డెమోను ప్రారంభించిన ఆయన.. సీ ప్లేన్‌లోనే శ్రీశైలానికి చేరుకున్నారు. ఆయన వెంట పౌరవిమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కూడా ఉన్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో సీ ప్లేన్‌లో దిగిన సీఎంకు రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, కందుల దుర్గేశ్, ఎన్ఎండీ ఫరూక్, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ బైరెడ్డి శబరి, స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, డీఐజీ కోయ ప్రవీణ్, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. పర్యాటకాన్ని ప్రోత్సహించే విధంగా విజయవాడ కనకదుర్గమ్మవారి స్థానం నుంచి ద్వాదశ జ్యోతిర్లింగ, శక్తిపీఠం శ్రీశైలానికి సీ ప్లేన్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. 'ఇప్పటి వరకు హెలికాప్టర్లు, విమానాల్లో ప్రయాణించాను. ఇవి దిగే సమయంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. కానీ సీ ప్లేన్‌తో అలాంటి ఇబ్బంది ఏమీ లేదు. ఇందులో ప్రయాణించడం ప్రత్యేక అనుభూతినిచ్చింది. తుమ్మలబయలులో టైగర్ సఫారీకి అవకాశం ఉంది. ఇక శ్రీశైలం డ్యాం ఒక అద్భుతం. తిరుమల పవిత్ర పుణ్యక్షేత్రంలాగే శ్రీశైలం కూడా పచ్చని ప్రకృతితో నిండి ఉంటుంది. ఇక్కడ పర్యాటకాభివృద్ధికి అటవీ, పర్యావరణ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టూరిజం మంత్రి కందుల దుర్గేశ్, రోడ్లు-భవనాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిలతో కమిటీ వేసి, ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులతో కలిసి మాస్టర్ ప్లాన్ తయారుచేస్తాం. రిపోర్టు ఆధారంగా పనులు చేపడతాం' అని వెల్లడించారు. పర్యాటక వనరులను సద్వినియోగం చేసుకోగలిగితే వైట్‌కాలర్ జాబ్స్ వస్తాయన్నారు. శ్రీశైలం నుంచి తిరిగి సీ ప్లేన్‌లో విజయవాడకు చేరుకున్న ఆయన.. మీడియాతో తన అనుభవాలను పంచుకున్నారు. సుందరమైన ప్రాంతాలను వీక్షించామని, ఎంతో అనుభూతి పొందానని భావోద్వేగంతో చెప్పారు. ల్యాండింగ్, టేకాఫ్ చాలా స్మూత్‌గా జరిగిందని చెప్పారు. ఆయా సందర్భాల్లో ఇంకా ఏమన్నారంటే..

గండికోటలోనూ సీప్లేన్

"శ్రీశైలంలో మాదిరిగానే కడప జిల్లా గండికోటలోనూ సీ ప్లేన్ సర్వీసులు ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నాం. వాస్తవానికి శ్రీశైలంలో ప్రారంభించిన రోజే అక్కడా సీ ప్లేన్‌ను దింపేందుకు యత్నించాం. కానీ కుదరలేదు. గండికోటలో నీటిని నింపి, హోటళ్ల వంటివి నిర్మిస్తే దేశంలోనే అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తయారవుతుంది. రూ.80 కోట్లతో కేంద్ర పర్యాటక శాఖకు ప్రతిపాదనలు పంపించాం. మార్చి నుంచి కేంద్రం సహకారంతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రోజూవారి సీ ప్లేన్ సర్వీసులు ఎక్కువగా మొదలుపెట్టి, టూరిజాన్ని మరింత ఎక్కువగా ప్రచారం చేస్తాం. రాష్ట్రంలో ఐదేళ్ల పాటు అభివృద్ధి ఆగిపోయింది. విధ్వంసం జరిగింది. గతంలో మూడు సార్లు సీఎంగా ఉన్నప్పటి కంటే ఇప్పుడే ఎక్కువ ఇబ్బంది అనుభవిస్తున్నాను. జగన్ హయాంలో ప్రభుత్వ శాఖలను నిర్వీర్యం చేశారు. నిధులను పక్కదారి పట్టించారు. రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసి నాశనం చేశారు. మొన్నటి ఎన్నికల్లో 'ప్రజలు గెలవాలి, రాష్ట్రం పునర్నిర్మాణం జరగాలి' అనే నినాదంతో ముందుకొచ్చాం. ప్రజలు నమ్మి మా కూటమిని గెలిపించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా భావిస్తూ అధికారంలోకి వచ్చిన 150 రోజుల్లో వ్యవస్థను గాడిలోపెట్టాం" అని చంద్రబాబు చెప్పారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో నూతన అధ్యాయం మళ్లీ ప్రారంభమైందన్నారు. సీ ప్లేన్లకు మంచి అవకాశం ఉందన్నారు. అందుకే ఇక్కడే డెమో మొదలుపెట్టామన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్ నిత్యపున్నమిగా వెలుగుతోందని చెప్పారు.

10 ప్రాంతాలకు సీప్లేన్ సర్వీసులు!

విజయవాడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీప్లేన్‌లను నడపటానికి అనువైన పది ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించింది. విజయవాడ, శ్రీశైలంతో పాటు గండికోట, లంబసింగి, అరకు వ్యాలీ, రుషికొండ, ధవళేశ్వరం, కోనసీమ, కాకినాడ , తిరుపతికి సీప్లేన్లు నడపటానికి అత్యంత అనువైన ప్రాంతాలుగా నిర్ధారించింది. విజయవాడ-శ్రీశైలం మధ్య సీప్లేన్ సర్వీసులను ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో త్వరలోనే ప్రకటన వెలువడనుంది. ఈ సర్వీసులను విజయవంతం చేసే అంశాలపై కూడా విజయవాడలో నిర్వహించిన సభలో చర్చించారు. ప్రధానంగా సీప్లేన్‌లకు భారీ పెట్టుబడి లేకుండానే విమానయానాన్ని అందుబాటులోకి తీసుకురావచ్చని సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అభిప్రాయపడ్డారు. ఎయిర్‌పోర్టుల్లా.. పరిపాలనా భవనాలు, రన్‌వేలు, టెర్మినల్స్ తదితరాలు సీప్లేన్స్‌కు అవసరం లేదు. అయితే వీటిలో ప్రయాణించాలంటే సాధారణ విమానాల కంటే ఖర్చు ఎక్కువగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని సాధారణ విమానాల చార్జీకి తీసుకురాగలిగితే వీటికి డిమాండ్ తీసుకురావచ్చని భావిస్తున్నారు. కాగా, ఏపీ, తెలంగాణ మధ్య సీప్లేన్‌లు నడపటానికి స్పైస్‌జెట్ ఆసక్తిగా ఉంది. వచ్చే మార్చిలో రెండు సర్వీసులను ప్రారంభించనున్నట్టు ఆ సంస్థ సీఎండీ అజయ్‌సింగ్ చెప్పారు.

మల్లన్న సన్నిధిలో ముఖ్యమంత్రి

శ్రీశైలం, నవంబరు 9: శ్రీశైలంలో భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను చంద్రబాబు దర్శించుకున్నారు. ఆయనకు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనరు ఎస్. సత్యనారాయణ సాదరంగా స్వాగతం పలికారు. మల్లికార్జున స్వామివారికి చంద్రబాబు అభిషేకం చేశాక.. భ్రమరాంబికాదేవి ఆలయానికి చేరుకుని ప్రత్యేక అర్చన నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రిని అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. అర్చకులు, వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

సోషల్ సైకోల్లో వణుకు!

- నోటీసులు, కేసులు, కౌన్సెలింగ్‌తో బెంబేలు
- రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల ముమ్మర వేట
- భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని హితవు
- కుటుంబ సభ్యులకూ సూచనలు
- తీవ్రతను బట్టి బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు

అమరావతి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి నేతలపై సోషల్ మీడియాలో నీచ వ్యాఖ్యలతో చెలరేగిపోయిన వారు దారికి వస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆక్రోశం... ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహంతో సోషల్ సైకోలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. వారు పెట్టిన పోస్టులను బట్టి... నోటీసులు ఇవ్వడం, కౌన్సెలింగ్ చేయడం, కేసులు పెట్టడం, అవసరమైన చోట అరెస్టులూ చేస్తున్నారు. వాళ్ల కుటుంబ సభ్యులకు కూడా విషయం వివరిస్తున్నారు. గ్రూపుల్లో ఫార్వర్డ్ చేసిన వారిని స్టేషన్లకు పిలిచి వివరాలు సేకరిస్తున్నారు. లైకులు కొట్టిన వారికి వాట్సాప్ ఇతర సోషల్ మీడియా ద్వారా 160 సీఆర్పీసీ నోటీసులు పంపారు. మార్ఫింగ్ ఫొటోలు, అసభ్యకరమైన వీడియోలు సృష్టించిన వారిపై భారత న్యాయ సంహితలో వ్యవస్థీకృత నేరాలకు సంబంధించిన సెక్షన్ 111 ప్రయోగిస్తున్నారు. పోలీసుల వరుస చర్యలతో ఉక్కిరి బిక్కిరవుతున్న సోషల్ సైకోలు పలువురు రాష్ట్రం విడిచి పారిపోతున్నారు. మరి కొందరు 'ఇంకెప్పుడూ ఇలాంటి తప్పులు చెయ్యం. వదిలిపెట్టండి' అని పోలీసులను వేడుకుంటున్నారు. ఇంకొందరు భయంతో న్యాయవాదుల్ని వెంటబెట్టుకుని ఠాణాలకు వచ్చి రక్షణ కోరుతున్నారు.


గతంలో చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లపై అసభ్య వ్యాఖ్యలతో రెచ్చిపోయిన శ్రీరెడ్డి ఇప్పుడు పేరుపేరునా అందరికీ 'సారీ' చెప్పారు. 'క్షమాపణ అడుగుతున్నా' అంటూ వీడియో విడుదల చేశారు. ఎన్నికల ముందు కూటమి నేతలపై తీవ్ర వ్యాఖ్యలు చేసి, ఇప్పుడు వైసీపీ అధికార ప్రతినిధిగా మారిన యాంకర్ శ్యామల సైతం స్వరం మార్చారు. 'తెలిసో, తెలియకో తప్పు చేశాం.. క్షమించండి' అని వేడుకున్నారు.

పోలీసుల కౌన్సెలింగ్, కేసులు, అరెస్టుల నేపథ్యంలో వైసీపీ సోషల్ మీడియా నెట్‌వర్క్ నుంచి భారీగా నిష్క్రమణలు మొదలయ్యాయి.

నోటీసుల పరంపర...

"మనం చట్ట ప్రకారమే వెళదాం. తప్పు చేసిన వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదు. కచ్చితంగా నెల రోజుల్లో ఏపీలో పోలీసింగ్ అంటే ఎలా ఉంటుందో చూపిస్తా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు కేబినెట్ భేటీలో పేర్కొన్నారు. దీనికి తగినట్టుగానే క్షేత్రస్థాయిలో చర్యలు మొదలయ్యాయి. విజయవాడ పోలీసులు 3రోజుల్లోనే వందల మంది సోషల్ సైకోలను గుర్తించారు. వీరిలో కరుడు గట్టిన వారికి కౌన్సెలింగ్ ప్రారంభించారు. హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకూ కేసులు, కౌన్సెలింగ్‌తో ఉక్కుపాదం మోపుతున్నారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడేలా పోస్టులు పెట్టినా, మరొకరికి పంపినా ఇబ్బందులో పడినట్లేనని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు, పార్టీలు, ఇతర సమూహాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేలా ఉండే పోస్టుల గురించి సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. సైబర్ హిస్టరీ షీట్లలో చిక్కుకుని భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని విద్యార్థులు, నిరుద్యోగులను హెచ్చరిస్తున్నారు. విషపూరిత ప్రచారంలో భాగమైతే సైబర్ బుల్లీస్ షీట్ తెరుస్తామని, అదే జరిగితే ఇక్కట్లు తప్పవని చెబుతున్నారు. దీంతో వైసీపీ సోషల్ మీడియా నెట్‌వర్క్ నుంచి వందలమంది నిష్క్రమిస్తున్నారు.

నేరస్థులకు శిక్షలు



పోలీసు ఉన్నతాధికారుల సమావేశంలో హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ

సోషల్ సైకోలను విడిచి పెట్టొద్దు: అనిత

అమరావతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వాడకాన్ని సవాలుగా తీసుకుని అదుపు చేయాలి. సైబర్ సైకోలపై ఉక్కుపాదం మోపకుంటే సమాజానికి భారీ నష్టం. నేరస్థులకు శిక్షలు, నేరాలకు బ్రేకులు పడాలి. అందుకు క్షేత్రస్థాయి పోలీసింగ్‌లో మార్పు రావాలి. ఆ బాధ్యత పూర్తిగా జిల్లా ఎస్పీలు, కమిషనర్లే తీసుకోవాలి' అని హోం మంత్రి అనిత రాష్ట్ర పోలీసులకు దిశానిర్దేశం చేశారు. నేరాల తీరు తెన్నులు, సోషల్ మీడియాలో సైకోల విచ్చలవిడి పోస్టులు, గంజాయి నిర్మూలన, మహిళలు, చిన్నారులపై నేరాల కట్టడికి చర్యలపై మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆమె సమీక్షించారు. రాష్ట్రాన్ని వారం రోజులుగా కుదిపేస్తోన్న సోషల్ సైకోల ప్రస్తావన తీసుకొచ్చిన హోం మంత్రి.. పోలీసులు కడపలో వ్యవహరించిన తీరును ప్రస్తావించారు. 'యూనిఫామ్ సర్వీసుల్లో ఉన్న వ్యక్తులు శాంతి భద్రతల పరిరక్షణలో ఎలా పని చేయాలో వివరించి మార్పు తెచ్చేందుకు జిల్లాల ఎస్పీలు, పోలీసు కమిషనర్లు దిశానిర్దేశం చేయాలి. ప్రస్తుతం మనకు సోషల్ మీడియా పెద్ద సవాలుగా మారింది. నేను కూడా బాధితురాలినే. సోషల్ సైకోల విషయంలో సీఎం చంద్రబాబు చేసిన సూచనల మేరకు ఎంతటి వ్యక్తులున్నా వదిలి పెట్టకుండా చర్యలు తీసుకోవాలి. కన్న తల్లిని, సొంత చెల్లిని కూడా హేయంగా అవమానించే నీచులున్న మన రాష్ట్రంలో పోలీసులు కూడా అందుకు తగినట్లే నడుచుకోవాలి. సోషల్ సైకోల కట్టడికి ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురాబోతోంది' అని పేర్కొన్నారు. ఆమె విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ 'అసెంబ్లీకి రావడానికి జగన్ ఎందుకు భయపడుతున్నారు? ధైర్యముంటే రావాలి. లేనిపక్షంలో రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలి. ఆయన రారు.. ఆ పార్టీ ఎమ్మెల్యేలు 10 మందినీ రానివ్వరు' అని అన్నారు.

ఐదేళ్లలో నేరాలు పెరిగాయ్: డీజీపీ

2014-19 మధ్య జరిగిన నేరాలతో పోల్చితే 2019-24 మధ్యలో జరిగిన నేరాల సంఖ్యలో 46.8 శాతం పెరుగుదల ఉందని డీజీపీ ద్వారకా తిరుమలరావు వివరించారు. గత ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా మైనర్లపై నేరాల్లో 152 శాతం, మహిళలపై 36 శాతం, మిస్సింగ్ కేసుల్లో 84 శాతం పెరుగుదల ఉందని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లాల ఎస్పీలు, కమిషనర్లతో పాటు సీనియర్ ఐపీఎస్‌లు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్‌తో డీజీపీ భేటీ

రాష్ట్రంలో శాంతి భద్రతలు, సామాజిక మాధ్యమాల్లో చెత్త పోస్టులు తదితర అంశాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు వివరించారు. హోం మంత్రితో జరిగిన సమీక్ష వివరాలనూ ఆయనకు చెప్పారు. మహిళలపై నేరాలు, గంజాయి ప్రభావం, నేరాల కట్టడికి తీసుకోబోతున్న చర్యలను పోలీస్ బాస్ విపులీకరించారు. ప్రభుత్వానికి ఎక్కడా చెడ్డపేరు రాకుండా పోలీసు శాఖ పనిచేయాలని, ఒత్తిళ్లకు తలొగ్గకుండా బాధ్యులకు న్యాయం చేసేందుకు ప్రయత్నించాలని పవన్ అన్నట్లు తెలిసింది. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న గంజాయి, మత్తు కట్టడికి రంగంలోకి దిగబోతున్న టాస్క్‌ఫోర్స్‌కు 'నికో' అని పేరు ఖరారు చేసినట్లు తెలిసింది. నికో అంటే గ్రీకు భాషలో ప్రజా విజయం.. నికోలస్ అంటే విజయాన్ని తెచ్చిన వీర యోధుడు అని అర్థం.

పోలీసుల అదుపులో వర్రా?

కడప, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో విషం చిమ్ముతున్న ఎంపీ అవినాశ్ రెడ్డి అనుచరుడు, జగన్ సతీమణి భారతి పీఏ వర్రా రవీంద్రా రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మంగళవారం అర్ధరాత్రి అతడు పోలీసులకు మస్కా కొట్టి తప్పించుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత అతడి కోసం ప్రత్యేక బృందాలతో గాలించారు. ఈ క్రమంలోనే వర్రాను అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వేముల మండలంలోని కొండ్రెడ్డిపల్లెకు చెందిన వర్రా రవీంద్రా రెడ్డి వైఎస్ కుటుంబానికి సన్నిహితుడు. 2003లో బీసీ కులానికి చెందిన ఒక వ్యక్తి హత్య కేసులో ఇతని తండ్రి అరెస్టయ్యారు. అయితే... వైఎస్ ముఖ్యమంత్రి అయిన నెల రోజులకే ఆయన విడుదల కావడం గమనార్హం.

అవినాశ్ పీఏను ప్రశ్నించేందుకు యత్నం

కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డిని ప్రశ్నించేందుకు శుక్రవారం రాత్రంతా ఆయన ఇంటి వద్ద పోలీసులు పడిగాపులు కాశారు. ఈ విషయం తెలుసుకున్న రాఘవరెడ్డి ఇంటికి రాకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు సమాచారం. వర్రాతో రాఘవ రెడ్డి చాటింగ్ చేసినట్లు సమాచారం ఉండటంతో పోలీసులు అతడిని ప్రశ్నించాలని భావించారు. కాగా, పోలీసులు రౌడీల్లా వ్యవహరిస్తున్నారని అవినాశ్‌రెడ్డి పులివెందులలో విమర్శించారు. రౌడీల్లాగా అర్ధరాత్రులు వైసీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వద్దకు వెళ్లి లాఠీలతో తలుపులు కొట్టడం, భయభ్రాంతులకు గురిచేయడం మానుకోవాలన్నారు. తప్పు చేసి ఉంటే చట్టప్రకారం అరెస్టు చేయాలన్నారు. రవీంద్రారెడ్డికి వైసీపీ నుంచే ప్రాణ హాని ఉందని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. ఇంకోవైపు.. టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పరువుకు భంగం కలిగేలా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారంటూ కోనేరు మహేశ్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒక టీవీ చానల్ ప్రతినిధిపై కేసు నమోదు చేశామని వేంపల్లె సీఐ సురేశ్‌రెడ్డి తెలిపారు.

కస్టడీలో బోరుగడ్డకు మర్యాదలు!

- ఖండించిన జిల్లా ఎస్పీ సతీశ్ కుమార్

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్ బోరుగడ్డ పోలీస్ కస్టడీ వ్యవహారం మరోసారి వివాదాస్పదంగా మారింది. గుంటూరు నగరంలో ఏఈఎల్ సీ చర్చి కోశాధికారి కర్లపూడి బాబుప్రకాష్‌ను కత్తితో బెదిరించి రూ. 50 లక్షలు డిమాండ్ చేసిన కేసులో నిందితునిగా రిమాండ్‌లో ఉన్న బోరుగడ్డ అనిల్‌ను ఇటీవల అరండల్‌పేట పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. కస్టడీ అనంతరం ఆయనను రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలిస్తున్న సమయంలో రెస్టారెంట్‌కు తీసుకెళ్లి బిర్యానీ తినిపించారు. ఈ వ్యవహారం మరువక మునుపే... కస్టడీ సమయంలో ఆయనకు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో రాచమర్యాదలు చేశారంటూ ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కస్టడీ సమయంలో పోలీస్ స్టేషన్లోని టేబుల్‌పై బెడ్ షీట్లు పరిచి, దిండు వేసుకొని నిద్రించే అవకాశం కల్పించారు. సిబ్బంది ఆయనతో కరచాలనం చేయడం కనిపించింది. అయితే కస్టడీలో బోరుగడ్డకు మర్యాదలు చేశారనడంలో నిజం లేదని ఎస్పీ సతీశ్ కుమార్ తెలిపారు. పోలీస్ కస్టడీలో ఆయనకు కనీస సదుపాయాలు కల్పించాలంటూ 15 అంశాలతో మెజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారని... వాటిని మాత్రమే అమలు చేస్తున్నామని చెప్పారు. ఇంకోవైపు.. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను, వారి కుటుంబసభ్యులను సోషల్ మీడియా వేదికగా అసభ్యకరంగా దూషించిన బోరుగడ్డను కర్నూలు త్రీటౌన్ పోలీసులు రాజమండ్రి సెంట్రల్ జైల్లో కస్టడీలోకి తీసుకున్నారు. శనివారం తెల్లవారుజామున కర్నూలు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. 3రోజుల పాటు విచారించనున్నారు.

అసెంబ్లీ జాయింట్ సెక్రెటరీ
విజయరాజు సస్పెన్షన్

- శాసనసభ సెక్రెటరీ జనరల్ పేరిట తప్పుడు రిపోర్టు ఫలితం
- చీఫ్ మార్షల్ థియోఫిలస్‌పై రిమార్కులు లేవంటూ డీజీపీకి నివేదిక
- గతనెల 10న వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'.. ప్రభుత్వం చర్యలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



విజయరాజుపై అక్టోబరు 10న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

అసెంబ్లీ కేంద్రంగా సాగిన ఓ అడ్డగోలు వ్యవహారంపై సర్కారు చర్యలు చేపట్టింది. నాటి అసెంబ్లీ చీఫ్ మార్షల్ థియోపిలస్‌పై ఎలాంటి రిమార్కులూ పెండింగ్‌లో లేవంటూ డిజీపీకి తప్పుడు నివేదిక ఇచ్చిన అసెంబ్లీ జాయింట్ సెక్రెటరీ విజయరాజును సస్పెండ్ చేసింది. ఈ మేరకు అసెంబ్లీ సెక్రె టరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ ఆదేశాలు ఇచ్చారు. ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా ఉన్న ఐపీఎస్ అధికారి థియోఫిలస్‌ను జగన్ ప్రభుత్వం వచ్చాక ఏరికోరి అసెంబ్లీ చీఫ్ మార్షల్‌గా నియమించారు. 2019 నవంబరు 22 నుంచి 2022 డిసెంబరు 11 వరకు ఆ పోస్టులో కొనసాగిన ఆయన ఆ కాలంలో జగన్, ఇతర వైసీపీ నేతల అండతో రెచ్చిపోయారని అనేక ఫిర్యాదులు వచ్చాయి. చంద్రబాబు ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు ఆయన పట్ల దురుసుగా, అడ్డగోలుగా, అమర్యాదగా ప్రవర్తించారు. థియోఫిలస్ చీఫ్ మార్షల్‌లా కాకుండా వైసీపీ నేతలా వ్యవహరించారన్న విమర్శలొచ్చాయి. ఆ తర్వాతి కాలంలో అసెంబ్లీలో సీసీ కెమేరాల దిశను మార్చారంటూ ఆయనపై ఫిర్యాదులు వచ్చాయి. శాసనమండలి ప్రధాన ద్వారానికి ఉన్న సీసీకెమేరా దిశను ఉద్దేశపూర్వకంగా మండలి చైర్మన్ మోషేన్‌రాజు కార్యాలయంవైపునకు తిప్పారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై అప్పట్లో పెద్ద దుమారమే చెలరేగింది. థియోపిలస్‌పై చర్యలు తీసుకోవాలని మండలి చైర్మనే అసెంబ్లీ సెక్రటేరియట్‌కు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై సభాసంఘం విచారణ జరుగుతోంది. ఆ తర్వాత థియోఫిలస్‌ను ప్రభుత్వం బదిలీచేసింది. కొంతకాలానికే ప్రభుత్వం కూడా మారిపోయింది. సభాసంఘం చర్యలు కూడా ఆగిపోయాయి.

శాసన కేంద్రంగానే అడ్డగోలు లేఖలు..

థియోఫిలస్‌కు పదోన్నతి పెండింగ్‌లో ఉంది. ఆయన సర్వీసు రిజిస్టర్‌లో అసెంబ్లీలో చీఫ్ మార్షల్‌గా పనిచేసినప్పుడు కొన్ని రిమార్కులు పెండింగ్‌లో ఉన్నాయి. అవి పరిష్కారమైతే తప్ప పదోన్నతి రాదు. దీంతో పోలీసు శాఖలో తనకు ఇష్టుడు, సన్నిహితుడు అయిన ఓ ఉన్నతాధికారి సూచన మేరకు పదోన్నతి ఫైలు కదిలించారు. డీజీపీ కార్యాలయం ఈయన గత చరిత్రను పరిశీలించే క్రమంలో అసెంబ్లీ ఘటన బయటకు రావడంతో అతనిపై ఏం చర్యలు తీసుకున్నారో తెలపాలని సెప్టెంబరులో శాసనసభ సెక్రెటరీ జనరల్‌ను లిఖితపూర్వకంగా సమాచార ం కోరింది. శాసనసభ సెక్రెటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ అధికారిక పనిమీద ఢిల్లీ వెళ్లినప్పుడు, జాయింట్ సెక్రెటరీగా ఉన్న విజయరాజు సెక్రెటరీ జనరల్ తరఫున డీజీపీ కార్యాలయానికి ఆ సమాచారం పంపారు. 'థియోఫిలస్ అసెంబ్లీ చీఫ్ మార్షల్‌గా పనిచేసిన కాలంలో ఆయనపై ఎలాంటి ఫిర్యాదు లు రాలేదు. క్రమశిక్షణ చర్యలు వంటివీ పెండింగ్‌లో లేవు' అంటూ డీజీపీ కార్యాలయానికి లేఖ పంపారు. ఈ లేఖతో థియోఫిలస్ పదోన్నతి ఫైలు శరవేగంగా కదిలింది. ఈ ప్రక్రియ చివరి దశలో డీజీపీ కార్యాలయం మరోసారి అసెంబ్లీ సెక్రెటరీ జనరల్‌ను సంప్రదించింది. "థియోఫిలస్‌పై ఎలాంటి ఫిర్యాదులు, విచారణలు పెండింగ్‌లో లేవని ఇచ్చారు. పదోన్నతి ఇస్తున్నాం. ఆమోదయోగ్యమేనా?' అంటూ సెప్టెంబరు 29న లేఖ పంపింది. దీంతో థియోఫిలస్‌పై ఫిర్యాదులు, విచారణలు పెండింగ్‌లో లేవంటూ తాను నివేదికలూ, లేఖలూ ఏమీ పంపలేదంటూ సూర్యదేవర ప్రసన్నకుమార్ అక్టోబరు 4న డీజీపీ కార్యాలాయానికి లేఖ రాయడంతో మొత్తం గుట్టురట్టయింది. దీనిపై విజయరాజును నిలదీయగా, మండలి చైర్మన్ మోషేన్‌రాజు ఒత్తిడితో ఆ లేఖ రాయాల్సి వచ్చిందని వివరణ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో అంతా సైలెంట్ అయిపోయారు. బాధ్యులపై చర్యలు తీసుకోకుండా మౌనం వహించారు.

'ఆంధ్రజ్యోతి' కథనంతో గుట్టురట్టు..

విజయరాజు లేఖ ఉదంతాన్ని అక్టోబరు 10న 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. 'అలా వదిలేస్తే ఎలా? తప్పు చేసి దొరికిపోయినా చర్యలు తీసుకోరా?' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై సర్కారు స్పందించింది. విషయాన్ని గవర్నర్‌కు నివేదించింది. విజయరాజుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ సెక్రటేరియట్‌ను ఆదేశించింది.



డిప్యూటీ కలెక్టర్ మురళి కుమారుడి ఇంట్లో ఏసీబీ తనిఖీలు

ఏసీబీ ఉచ్చులో తిరుపతి
డిప్యూటీ కలెక్టర్

- ఆదాయానికి మించి ఆస్తులపై ప్రభుత్వానికి ఫిర్యాదులు
- తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో విస్తృత సోదాలు
- తిరుపతిలో కొడుకు పేరిట పెద్ద హోటల్
- మదనపల్లెలో అదుపులోకి తీసుకున్న ఏసీబీ

తిరుపతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి డిప్యూటీ కలెక్టర్ ఎం.ఎస్.మురళి ఆస్తులపై శనివారం ఏసీబీ తనిఖీలు చేపట్టింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఫిర్యాదులతో రంగంలోకి దిగిన ఏసీబీ.. శనివారం తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, నెల్లూరు జిల్లాల పరిధిలో విస్తృత సోదాలు జరిపింది. మదనపల్లెలో ఆయన్ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. డిప్యూటీ కలెక్టర్ మురళి అత్యధిక శాతం ఆస్తులను తన పేరిట, కుటుంబీకుల పేరిట కాకుండా బినామీల పేరిట పెట్టినట్టు ఏసీబీ గుర్తించింది. రెవెన్యూ శాఖలో తన కింద పనిచేసిన నమ్మకస్తులైన ఉద్యోగులు, అధికారుల పేరిట ఆస్తులు కొనుగోలు చేసినట్టు అధికారులు గుర్తించారు. అందులో భాగంగా ఓ సర్వేయరు, మరో డిప్యూటీ తహసీల్దార్ల నివాసాల్లోనూ తనిఖీలు జరిగాయి. సాయి గ్రాండ్ హోటల్ స్థలం విలువ రూ. కోట్లలో ఉండడంతో తొలుత అధికారులు ప్రశ్నించగా లీజుకు తీసుకున్నట్టు డిప్యూటీ కలెక్టర్ చెప్పారని సమాచారం. అయితే ఏసీబీ అధికారులు డాక్యుమెంట్లు పరిశీలించడంతో కొడుకు పేరిటే స్థలం కొనుగోలు చేసి హోటల్ కట్టించినట్టు గుర్తించారని తెలిసింది. ఇక చిత్తూరు జిల్లా పరిధిలో 8 చోట్ల కూడా ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. అన్నమయ్య జిల్లాలోని రామసముద్రం, రాయచోటి, రాజంపేట, ఒంగోలు జిల్లా కేంద్రం, బెంగుళూరులోనూ భారీగా ఆస్తుల్ని గుర్తించినట్టు సమాచారం. మదనపల్లె ప్రశాంత్‌నగర్‌లోని ఆర్డీవో మురళి ఇంట్లో నివాసం ఉన్న ఆయన తమ్ముడు వెంకటాచలపతి నివాసంలో, ఆయన ప్రియశిష్యుడు మదనపల్లె మండలం పొన్నేటిపాళెం వీఆర్వో శేఖర్ నివాసంలోనూ సోదాలు జరిగాయి. మొత్తంగా బినామీల పేరిట ఉన్న ఆస్తుల విలువ రూ. 200 కోట్లు ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. పలు డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు స్వాధీన పర్చుకున్నారు. కాగా, మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ ఫైళ్లు దగ్ధమైన కేసులో ఇప్పటికే ప్రభుత్వం మురళీని సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే.

రేపు మైనారిటీ దినోత్సవం

అమరావతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): భారతరత్న, తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతిని పురస్కరించుకొని సోమవారం మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. మైనార్టీ సంక్షేమ శాఖ తరఫున విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మస్తాన్‌వలీ తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేసిన వారికి జీవిత సాఫల్య అవార్డు, విశిష్ట సేవలు అందించిన ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు అవార్డులు, సాంస్కృతిక కళా రంగాల్లో సేవలందించిన వారికి విశిష్ట అవార్డులు ఇవ్వనున్నామనున్నారు.

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం

- దక్షిణ కోస్తా, రాయలసీమలకు వర్షసూచన

విశాఖపట్నం, అమరావతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దాని ప్రభావంతో సోమవారం ఉదయానికి అల్పపీడనం ఏర్పడనుంది. ఇది పశ్చిమ దిశగా పయనించి ఈనెల 13వ తేదీ కల్లా తమిళనాడు, శ్రీలంక తీరం వైపు వెళ్లనున్నదని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో ఈనెల 11 నుంచి 13 వరకు దక్షిణ కోస్తా, రాయలసీమ ల్లో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. దక్షిణ కోస్తాలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. అల్పపీడనం నేపథ్యంలో రైతు లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు. కాగా శనివారం పలు చోట్ల తేలికపాటి వర్షాలు కురిశాయి.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.